
ఆంధ్రసచిత్రవారపత్రిక






Cuticura
TALCUM POWDER

తిరిగి ఆరోగ్యముగా పూర్తి స్వస్థత చేకూరుతుంది!



పిల్ ఫర్-ప్రూఫ్ మూతతోను, క్రొత్త ఎఱ్ఱ లేబిల్‌తోను యిప్పుడు సరఫరా చేయబడుచున్నది.

వాటర్ బరీస్ కాంపౌండ్ టానిక్కును ప్రపంచములో ఆరోగ్యమును వాంఛించు చిన్నలు పెద్దలు అందరూకూడా ఆరోగ్యము నిచ్చుటలో సాటిలేనిదని కోరొందుటచే విడువక వాడుచున్నారు.

వాటర్ బరీస్ కాంపౌండ్‌లో ముఖ్యమైన పోషక పదార్థములు కలపియుండుటచే సౌఖ్యప్రదమగు జీవితమును ప్రసాదించి మీ కుటుంబమునకు అవసరమైన అదనపు శక్తిని చేకూర్చును

వాటర్ బరీస్ కాంపౌండ్ ఎడతెగని దగ్గు, పడిశములు, శ్వాసకోశపు రుగ్మతలను నివారించును. వ్యాధినుండి త్వరితముగా కోలుకొనుటకు డాక్టర్లు దీనిని సిఫారసు చేయుచున్నారు.



/ఇప్పుడు వాడుకలో లేని ఎఱ్ఱరాపర్

ఆరోగ్యమునకు హితమైన

వాటర్‌బరీస్ కాంపౌండ్

ఆంధ్రసచిత్ర వారపత్రిక

★

Founder
K. Nageswara Rao

స్థాపితము
1908

★

సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

★

సంపుటము 55
సంచిక 21

3-2-60
బుధవారం

వికారి మాఘ శుద్ధ సప్తమి

★

విడిప్రతి వెల 25 న. పై.
సంవత్సర చందా 13-0-0

★

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి
మదరాసు-1.

విషయానుక్రమణిక

ఉత్తరాలు

ముఖ్యమంత్రి

తెలుగు వెలుగులు శీర్షికలో ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్యను గురించి మాత్రంగానూ అతి చక్కగానూ వ్రాశారు. "అన్నీ తెలిసినట్లున్నాడూ నటించడం గనుకనే, ఆ తెలిసిన వాన్ని నిజంగా తెలుసుకుని నిరూపించుకోగలడు" అని వ్రాసినమాటలు ఆయన విషయంలో అక్షరాలా నిజం.

భాగవతుల విశ్వనాథరావు,
హైదరాబాదు.

సినిమా సంగీతం

వారపత్రికలో సినిమా విమర్శలు చాలాబాగుంటున్నాయి. మన సంగీత దర్శకులు హిందూస్థానీ బాణీలను ఎందుకు అనుసరిస్తున్నారు? మన సంగీత సంపద తరిగిపోయినదా? లేక తిరిగి పాటలలో చక్కని వరుసలు కట్టటం చేతకాకనా? లేక కాపీ ...

... ములువుగా అయిపోతుందా? ఇప్పుడు విడుదల అవుతున్న చిత్రాలసంగీతం నాటికి నాటికి దిగజారి అధ్వాన్నంగా వుంటున్నది. హిందూస్థానీ బాణీ లేని సినిమా లేదు. సంగీత దర్శకులందరూ మంచిసంగీతాన్ని అందిస్తారని ఆశిస్తున్నాను.

వేలూరి దుర్గానంద్
బుర్లా (ఒరిస్సా)

పండిత పుత్రః

ఆంధ్ర వారపత్రిక (30-1-60) లో అట్టుకవరు పేజీలో ప్రచురించిన ఇద్దరు బాలురఫోటో దిగువ "పండిత పుత్రః" అని వ్రాసియుంటిరి. వారిరువురు కాబట్టి "పండిత పుత్రౌ" అని యుండవలదా?

శ్రీవిలాస్, జయపూర్.
అవును, పొరబాటే.

* * *

ఎదురు చూపులు

మీ పత్రిక రుక్క పత్రి...


... లోకంలో మెరుస్తూ పెరుగుతోంది. పత్రికలో చెప్పతగ్గ విషయాలు రాజధాని కబుర్లు, గళ్ళ ముడికట్టు, కార్టూనులు, న్యూఢిల్లీ లేఖ. వీటికోరకు పత్రిక ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంటాను. అసలు వారానికి 2 సార్లు ప్రచురిస్తే, "మా ఎదురుచూడడం" తగ్గుతుంది.

కోతపల్లి రాజరత్నం
హైదరాబాదు.

* * *

గళ్ళముడికట్టులాటి గోలుసుకట్టు (18-1-60) కోత్తది చాలా బాగుంది. మెదడుకు 2, 3 గంటలు మేత పెట్టింది. ఇంకో విషయం. మీ ఆంధ్రపత్రికను గురించి, అందులో ప్రచురించే, గళ్ళ ముడికట్టును గూర్చి, మేము వారం వారం ఎదురు చూస్తాం. సాధ్యమైనంత వరకు పూరిస్తూనే యుంటాము.

(54-పేజీ చూడండి)



న్యూఢిల్లీ లేఖ

కృష్ణ

చలిమూలాన పరిపాలనలో జడత్వం!

భారతీయులకు దేహంకన్న దేహి ముఖ్యంకావచ్చు. కాని 'దేహరక్షణే దేహిరక్షణ' అనికూడా మన పెద్దలు అంటారు. బహుశా యీ రెండో విషయం మరచిపోయికాబోలు పెల్లుపెరిగిపోతున్న వ్యాధులను నివారించడానికి అధికారులు పూనుకొనడంలేదు. గట్టి చర్యలు తీసుకొనడంలేదు. ఇది విచారకరం.

శిశిర, హేమంతాలు ఢిల్లీలో రాజ్యంచేస్తున్నాయి. ఈ సంవత్సరం ఢిల్లీకి మంచి 'చలిదెబ్బ' తగిలింది. మంచు దట్టంగా కురుస్తున్నది. ప్రజలు చలికి వణికిపోతున్నారు.


ఈ వారం పత్రికలలో ప్రతాకశీర్షిక క్రొషోలోవ్ భారత్ యాత్ర. పత్నితోపాటు భారత్‌లో పర్యటించడానికి సోవియట్ ప్రెసిడెంట్ ఢిల్లీ వచ్చారు. పంజాబీ భాషారాష్ట్ర నిర్మాణానికి జనవరి 24 నుంచిఆందోళన ప్రారంభిస్తానని మాస్టర్ తారాసింగ్ ప్రకటించడం మరో వార్త! కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులపేర్ల ప్రకటనమూడవ విశేషం. వ్యాపారసరళినిబట్టి పెట్టుబడి దేశంలోకి రావడానికి వీలుగా భారత్ పశ్చిమ జర్మనీతో చర్చలు జరపడానికి సమ్మతించడం ఒక ముఖ్య వార్త.

కాగా కేంద్ర ప్రభుత్వోద్యోగుల మొత్తంసంఖ్య 1958 లో ఎంతో ప్రకటించింది ప్రభుత్వం. ఈ సిబ్బంది జనాభా లెక్కలసేకరణ ప్రతిఏటా జూన్ 30వ తేదీకి పూర్తి అవుతుంది. ఆ నాటికి ఉద్యోగుల ప్రమిలిటరీ మినహాయించి సంఖ్య ఎంతో అంతా సేకరిస్తారు. ఈ నివేదిక 1959, డిసెంబరు 8 వ తేదీకి గాని ముద్రణ కాలేదు. 1960 జనవరి 17 న ఇది ప్రభుత్వం ప్రకటించింది. 18 లక్షలమంది సిబ్బంది జనాభా లెక్కలసేకరణకు ప్రభుత్వం వారికి నాలుగున్నర ఇంతకాలం పట్టవలసిన పెద్దసంఖ్య ఏమీ అక్కడలేదే! మరెందుకు జరిగింది జాగు? త్వరలో మునుపే ఈ నివేదిక ప్రకటించి ఉంటే ఉద్యోగాలు అధికంగా యివ్వరాదనే కేంద్ర హోంశాఖ వారి ఆదేశాలు ఎంత చక్కగా పాటించబడుతున్నదీ ప్రజలు తెలుసుకునేందుకు వీలుఅయేది, అది ప్రభుత్వానికి యిష్టం లేదు.


క్షయవ్యాధి పరిశీలక సంఘం నివేదిక కూడా ఈ వారమే ప్రకటించింది ప్రభుత్వం. భారతీయులలో నూటికి 1.8 మందిక్షయ వ్యాధితో బాధపడుతున్నట్లు ఈ నివేదిక వెల్లడిస్తున్నది.

అయితే విడివిడిగా పట్నాల్లో, పల్లెల్లో ఈ వ్యాధి ఉన్నతం సూచించే లెక్కలు ప్రభుత్వం సేకరించకపోవడం ఆశాభంగం కలిగించింది. ఈ వ్యాధి కేవలం పట్నాలకు సంబంధించిందే కాదు. మోటారు రాకపోకలు లేని మారుమూల పల్లెలకూ ఇదివ్యాపిస్తుంది. 'మొబైల్ ఎక్స్-రే' వెళ్లడానికి వీల్లేని కుగ్రామాలలో ఈ వ్యాధి ఎలాఉందో ఈ నివేదిక తెలుపడంలేదు. కొన్నిచోట్ల ఇలా పరిశోధన జరిగింది. దానివల్ల కుగ్రామాల్లో సైతం ఈ వ్యాధి బాగా ప్రబలి ఉన్నట్టు తెలుస్తోంది.

క్షయ వ్యాధి వ్యాప్తికి ప్రధాన కారణాలు జనం పండుగలకీ పబ్బాలకీ అటూ ఇటూ చేసే ప్రయాణాలేనని చెబుతారు. ఉత్సవాలనీ, సంతలనీ, సంబరాలనీ జనం గుమిగూడే చోట ఈ అంటువ్యాధి వ్యాపిస్తుంది కాగా ఈ సేకరించిన [illegible]



అహింసా తపస్వీ



భారత దేశంలో రెండు వారాలపాటు పర్యటించటానికి వచ్చిన సోవియెట్ యూనియన్ అధ్యక్షుడు మార్షల్ వొరోషిలోవ్, భారత రాష్ట్రపతి, సోవియెట్ ప్రథమ ఉపప్రధాని శ్రీ కొజ్లోవ్.

★ న్యూఢిల్లీ లేఖ ★

లో పరిమితమై ఉండవచ్చు. మారుమూల పల్లెగ్రామాలలో పరిస్థితి పరిశీలనకు ప్రభుత్వం సంకల్పించింది.

నివేదికనుబట్టి ముదిరిపోయిన కేసులు యెక్కువనీ, వైద్యావకాశాలున్నవి తక్కువనీ తేలుతున్నది. పట్టణాలలో ఈ వ్యాధి చాలావరకు కుదురుతున్నదని ఈ నివేదికవల్ల తెలిపోంది. వైద్యవసతులు బాగా ఉండటం ఒక కారణం కావచ్చును.

అయితే పరిశీలన మొత్తం జనాభాలో నూటికి నలభైమందికే పరిమితం అయింది. ఆరు కోట్లలోని జనాభాపైన ఈ సర్వేలు జరిగాయి. రాకపోకల సౌకర్యాలు లేనందున సర్వేలు సమగ్రంగా జరుగలేదని నివేదికవల్ల తెలుస్తున్నది. ఈ లెక్కలు పూర్తిగా సమగ్రమైనవిగా ఎంచరాదని నివేదికలలో పరిశీలకసంఘం కోరసేకోరింది. మొత్తంమీద ఇదివరకటికంటే క్షయవ్యాధి మరింతగా ప్రబలి ఉన్నమాట నిజం.

క్షయవ్యాధి పట్టణప్రాంతాలకు, జనసమ్మర్దానికీ, చెందిన వ్యాధిఅని ప్రజల నమ్మకం. పరిశుభ్రతలేని, మురికిపేటలలోను, కొన్నికొండప్రాంతాలలోనుకూడా ఈ వ్యాధి ప్రబలంగా ఉంది. కొన్నిరకాల కాయకష్టంవల్లకూడా క్షయవ్యాధి ప్రబలుతుందట!

స్వతంత్రం వచ్చిన తర్వాత పండుగలూ, పబ్బాలూ మరీ ఎక్కువైపోయాయి. వీటితో సంతలూ, సంబరాలూను. వీటన్నింటి మూలంగా క్షయవ్యాధి ఎక్కువైంది. షాపాటూ, సర్కస్‌లూ, జనానికి హాయిగా ఉంటాయని రోమన్ సామెత. 1947 నుంచీ కాంగ్రెసు ఈ సిద్ధాంతంమీదే నడుస్తున్నది. పరిపాలనా యంత్రాంగం ప్రణాళికల సర్కస్ తలపెట్టింది. విదేశ ప్రముఖులు ఎడతెగకుండా వచ్చిపోయే సర్కస్ ఒకటి న్యూఢిల్లీలో జరుగుతూ ఉంటుంది. 'రిపబ్లిక్ డే' సైనికవిన్యాసాలూ, ఉత్సవాలూ మరో పెద్ద సర్కస్.

ఇక్కడ కొంచెం దారితప్పింది. అసలు విషయం క్షయ నిర్మూలనం. రిపబ్లిక్ ఉత్సవాలూ, మహాసభలూ, కుంభమేళాలు వీటివల్ల క్షయవ్యాధి ప్రబలిపోవటం లేదా? వీటని తగ్గించే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నదా లేదా అనేది ముఖ్యప్రశ్న.

పత్రికలకు విడుదలచేసిన నివేదిక సారాంశం పరిశీలిస్తే కేడు హృద్రోగాలకు కారణంగా పరిగణించబడుతున్న 'వనస్పతి' డాల్డా నెయ్యి ప్రస్తావనేలేదు. ఇది విచారకరం. ఈ 'వనస్పతి'వల్ల దేశంలో హృద్రోగాలు పెరిగిపోతున్నాయనీ, అనేక ఇతర రోగాలు పుట్టుకు వస్తున్నాయనీ అందరికీ తెలుసు. కొన్నివిషయాలు గట్టిగా తెలిసే లాభంలేదు. అందులో ఇదొకటి. 'వనస్పతి' మీద మొట్టమొదట యుద్ధం ప్రకటించిన కీర్తి స్వతంత్రం రాకముందు కౌన్సిల్ ఆఫ్ స్టేట్‌లో ప్రతిపక్ష నాయకుడు కీ॥ శే॥ రాయ్‌బహాదూర్ రామ్ శరణ్ దాస్ కు చెందుతుంది. పంజాబు సభ్యులు ఆయన, ఆనాడే 'వనస్పతి' వల్ల ప్రమాదం గురించి హెచ్చరించారు. మన రక్షణ బాధ్యతలు వహించే సైనికులు దీనినిబాగా వాడుతున్నారు. ఇతరసూచనలకు మల్లేనే వనస్పతికూడా క్షయవ్యాధికి దారితీస్తోందా అనేది ముందు పరిశీలించాలి.

వచ్చే ఏప్రిల్‌లో రాజ్యసభా సభ్యులు పదిహేడు మందికి పదవీకాలం పూర్తి అవుతుంది. ఆయా నియోజక వర్గాలు తిరిగి ఎన్నికలు జరపుకోవాలి ఇందులో ఢిల్లీకి చెందిన శ్రీ ఓంకారనాథ్ కూడా ఉంటారు పాతవారినే తిరిగి ఎన్నుకోమంటే ఇంతవరలో వదరు సభ్యత్వం చేసింది కాంగ్రెస్ పార్టీ 'ప్రవర' చెప్పుకుని, ప్రజలకు నచ్చ చెప్పవలసి ఉంటుంది. కాంగ్రెస్‌వాడు కావడమే అభ్యర్థి అర్హత అని ప్రజలు గుడ్డిగా నమ్మేరోజులు మారాయి కదా మరి! పార్లమెంటులో ఉన్న ఢిల్లీ సభ్యులు పదిమంది. ఒక్కరూ తమ స్వంత నియోజకవర్గం బాగోగులను గూర్చి అడిగినవారు లేరు. లోక్‌సభలో శ్రీ నవల్ ప్రభాకర్ ఒక్కరూ కొంత శ్రద్ధ ప్రదర్శించారు

'ప్రభుత్వం హామీ'ల ప్రచురణకు ప్రజాధనం అపారంగా దుర్వినియోగం చేస్తున్నారు పార్లమెంటరీవ్యవహారాల మంత్రి.

(63వ పేజీ చూడుడు)

హైదరాబాదు విశేషాలు

కొత్త నాయకుణ్ణి ఎన్నుకొని కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకున్న, ఉత్సాహంతో ఆంధ్రుల రాజధాని హైదరాబాదు ముందంజ వేస్తున్నది. కొత్త మంత్రులు, పాతమంత్రులు వ్యష్టిగా, సమిష్టిగా ఎవరి వ్యవహారాలు వారు చూసుకుంటున్నారు; రాష్ట్రపరిపాలనా కార్యకలాపాలలో నిమగ్నులవుతున్నారు. రాష్ట్రస్థాయిలోను, దేశస్థాయిలోనూ రాజధానిలో జరుగుతున్న సభలకు, మహాసభలకు ప్రారంభోత్సవాలు జరుపుతున్నారు. మొత్తంమీద పాత అన్నది అంతగా రోత అనిపించక పోయినా, జరిగిందంతా అంతగా కొత్తగాక పోయినా, వున్నంతలో కొత్త కొంతవరకు వింతగానే కనిపిస్తున్నది. ఈ చైతన్యం కేవలం మాండలికమైన ప్రయోజనాలకుగాక సువిశాలమైన రాష్ట్ర సమగ్ర శ్రేయస్సుకు ఉపయోగపడుతుందనే ఆశించవచ్చు. ఆ విధంగా ఉపయోగపడినప్పుడే ఏ చైతన్యమైనా సార్థకమనిపించుకుంటుంది.

* * *

ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య ప్రజాప్రతినిధులైన వార్ని గూర్చి ప్రజలు ఏమనుకుంటున్నారో, ఏమికావాలంటున్నారో తెలుసుకోవలసిన బాధ్యత వున్నదని తోటి మంత్రులకు సలహా ఇచ్చారు; పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేయకూడదని చెప్పారు. మంచి మాటే చెప్పారు; బహుశా గత అనుభవం దృష్ట్యానే వారు ఈవిధంగా ముందు జాగ్రత్త పడి వుంటారు. మంత్రులైనవారు పరస్పర విరుద్ధమైన భావాలు ప్రకటించడం ప్రారంభిస్తే, మంత్రివర్గాన్ని ఇరకాటంలో పెట్టినట్లవుతుంది. ఏ పరిస్థితులలోనూ దీనికి అవకాశం ఇవ్వకూడని మాట వాస్తవం.

* * *

మొత్తంమీద, మాట్లాడే జనాన్ని మూడు రకాలుగా విభజించవచ్చు. ఏదో మాట్లాడక తప్పదు కాబట్టి మాట్లాడే వారు ఒకరకం; తమ వాక్చాతుర్యం చూపించడానికి మాట్లాడేవారు మరొకరకం: ఇంతలో నోటి ముత్యాలు ఏమీ రాలిపోతాయి గనుక మాటలద్వారానైనా ఓదార్పు కలిగిద్దామని మాట్లాడేవారు ఇంకొకరకం. అయితే ఎవరి మాటలకు ఎంతవిలువ ఇవ్వాలో ప్రజలకు తెలియకపోదు. ఆరోగ్యవైద్యశాఖలకు ప్రస్తుతం కేటాయిస్తున్న డబ్బు చాలదన్నారు మంత్రి శ్రీ పి.వి.జి. రాజు. మంచిదే. ఒక్క ఆరోగ్య వైద్యసౌకర్యాలకే కాదు ప్రజలకు అన్ని సౌకర్యాలూ ఎక్కువ కావలసిందే. వాటిని కలుగజేస్తే ప్రజలు వద్దనరు: కోడలు కొడుకును కంటానంటే ఏ అత్త వద్దంటుంది గనుక? లోగడపనిచేసిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రులకు మాత్రం ఈ సదుద్దేశం లేకపోయిందా? అయితే, ధనాభావం అడుగడుగునా అడ్డు తగిలింది! మరి ఈపాత విషమస్థితిని ఏవిధంగా పరిష్కరిస్తారో కొత్తమంత్రి ఇంకా సెలవివ్వలేదు.

ఇది రాజధానిలో సభల వారం; యావద్భారతస్థాయిలో జరిగిన శాసనసభాపతుల వార్షిక సమావేశం ఒకటి. రెండు: రహదార్ల ఇంజనీర్ల సభ; పోతే మూడోది: ఆంధ్ర ప్రదేశ్ శాసనసభాపతి శ్రీ కాశీశ్వరరావు గారి 80 వ జన్మదినోత్సవసభ.

వీటిలో మొదటిదానికి అనంతశయనం అయ్యంగార్ అధ్యక్షతవహించి అధికార వికేంద్రీకరణం ప్రాధాన్యాన్ని, ప్రశస్తి ఉగ్గడించారు; ఒరిస్సా, బీహారు, బెంగాల్ సభాపతులు తప్ప (కేరళకు సభలేదు) మిగతా వారందరూ హాజరైనారు; ఆంధ్రప్రదేశ్ సభాపతి అతిథులందరికీ స్వాగతమిస్తూ సభాపతుల గౌరవమర్యాదలను కాపాడడం అవసరమన్నారు; అఖిలభారత శాసనసభా కార్యాలయాల శాఖ ఏర్పడాలని కోరారు. ప్రాంతీయభాషను అధికారభాషగా ప్రవేశపెట్టడంలో ఏర్పడుతున్న ఆటంకాల విషయంకూడా ప్రస్తావించారు. సహజంగా భాషా రాష్ట్రాభిమానియైన సభాపతి ఈ విషయం

మీకు నచ్చిన వ్యక్తి!

వ్యాసరచన - పోటీ

ఉత్తమ వ్యాసాలకు 150 రూ. బహుమతి

మొదటి బహుమతి రూ. 75

రెండవ బహుమతి రూ. 50

మూడవ బహుమతి రూ. 25

వ్యాసరచన పోటీ కూపన్

మీకు నచ్చిన వ్యక్తిపేరు

....

మీ పూర్తిపేరు....

చిరునామా....

పోటీ షరతులు

1. వ్యాసరచనపోటీకి వ్యాసంపంపేవారు పోటీకూపన్ పూర్తిచేసి రచనతో జతపరిచి పంపాలి.
2. రచన అరఠావును మించకుండా, ఒకవైపునే వ్రాసిపంపాలి.
3. దస్తూరి స్పష్టంగా, శుభ్రంగా ఉండాలి.
4. ప్రతిరచనకు వెనుకవైపున రచయిత పూర్తిపేరు, చిరునామా మళ్లీ వ్రాయాలి.
5. రచనలపై తుదినిర్ణయం సంపాదకులదే. దీని విషయమై ఎట్టి ఉత్తరప్రత్యుత్తరాలు జరుపబడవు. బహుమతికి నిరాకరించిన రచనలు త్రిప్పి పంపుటకు వీలుపడదు.
6. సజీవులైఉన్న ఏ ప్రముఖ ఆంధ్ర స్త్రీ, పురుషులగూర్చి అయినా వ్రాయవచ్చును.
7. బహుమతి నిర్ణయం వ్యాసాలలో ఎవరినిగూర్చి వ్రాశారనే దానిపై కాక, వ్యాసాలయొక్క మంచిచెడ్డలను బట్టి ఉంటుంది. ఇది ముఖ్యంగా గమనింపప్రార్థన.
8. 13-2-1960 తేదీవరకూ మా కార్యాలయానికి చేరినవాటిని మాత్రమే పోటీకి స్వీకరిస్తాము.
9. రచన పంపే కవరుపైన "వ్యాసరచనపోటీకి" అని వ్రాయాలి.

(పూర్తి వివరాలకు 27-1-60 సంచిక చూడండి)

హైదరాబాదు విశేషాలు

ప్రస్తావించడం సమంజసమే. అయితే తమ తమ నియోజకవర్గాలలోని ప్రజల కష్టసుఖాల పట్ల సభాపతులైనవారు ప్రత్యేకంగా ఎంతవరకు శ్రద్ధ తీసుకోవచ్చునన్నది చాలా ముఖ్యమైన సమస్యే. మాట్లాడితే అన్యదేశాలలో పార్లమెంటరీ సంప్రదాయాలు ఏవిధంగా వున్నవని పరిశీలించడంకంటే సజాతీయమైన సత్సంప్రదాయాలను మనదేశంలో మనం ఎందుకు సృష్టించుకోకూడదు? రాజధానిలో జరుగుతున్న సమావేశం ఇలాంటి విషయాలను ఇదమిద్ధమని తేలిస్తే బాగుంటుంది.

* * *

రహదారి ఇంజనీర్ల వార్షిక సమావేశంలో శ్రీ దురాని కాలంలో రహదార్ల శాఖను పునర్వ్యవస్థీకరించడం అవసరమన్నారు; ఇకమీద ప్రయాణ సౌలభ్యానికి దోహదం చేసేమాట వాస్తవం. వివిధరాష్ట్రాలనుంచి వచ్చిన ఇంజనీర్లు తమ తమ అవసరాలను తెలియచేస్తున్నారు. రహదార్ల నిర్మాణమన్నది రాష్ట్రానికే కాకుండా దేశం మొత్తాన్ని దృష్టిలో పెట్టుకొని చేయవలసినపని. రహదార్ల విషయంలో మనరాష్ట్రం ఎంతో వెనుకబడివున్నది. సరసన వున్న మద్రాసు రాష్ట్రంలో ప్రతి వందచదరపు మైళ్లకు సగటున 42/100 మైళ్ల నిడివిగల రోడ్లువుంటే మనకు 18/100 మైళ్ళ నిడివిగలవి కూడా లేవు... కృష్ణా గోదావరి. తుంగభద్రలపై పెద్ద వంతెనలు నిర్మించుకుంటున్నా వివిధజిల్లాల మధ్య రాకపోకలకు వచ్చే ప్రణాళికలలో ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంటుంది. శ్రీ గురాని కోరినట్లు రహదార్ల అభివృద్ధికి కొత్త ప్రణాళికలో ఎక్కువ కేటాయింపు జరగాలి; ఇందులో ఆంధ్రప్రదేశ్ అవసరాలను కేంద్రప్రభుత్వదృష్టికి తీసుకురావ [illegible]

సభాపతి శ్రీ కాళేశ్వరరావుగారి 80-వ జన్మదినోత్సవం ఇక్కడ వైభవంగా జరిగింది. ముస్లిం సంస్థలు ఉత్సాహంతో ముందుకు వచ్చి ఈ ఉత్సవం చేయడం విశేషం. గవర్నర్ శ్రీ సచార్, ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య, లోక్ సభాపతి శ్రీ అనంతశయనం, శ్రీ మాడపాటి హనుమంతరావు, పలువురు ముస్లిం ప్రముఖులు సభలో పాల్గొని శ్రీ కాళేశ్వరరావుగారికి జన్మదినాభినందనలు అందచేశారు; ప్రజాహిత జీవితంలో వారి చిరకాల సేవను ప్రశంసించారు. అభినందనలకు సమాధానం చెబుతూ శ్రీ కాళేశ్వరరావు ఎవరైతే మంచిపనులు చేస్తారో వారు చిరాయుష్మంతులవుతారన్న ఉపనిషద్వాక్యాన్ని ఉదహరించారు. అనేక యుద్ధాలలో ఆరితేరిన ఈ వృద్ధమూర్తి మాటలు విని శ్రోతలు నిండు మనస్సుతో ఆశీర్వదించివుంటారనడంలో సందేహం లేదు.



ముస్తాబు ద్రవ్యముల చరిత్రలో ఇంతవరకు తయారుకాని క్రొంగ్రొత్త ఫేస్ పౌడర్లు!

గోకుల్ శాంటోల్ టాయిలెట్ పౌడరు:

శుద్ధమైన చందనపు చెక్కల పొడరుతో (మైక్రోనైజ్డ్) చాల ఇంపైన టాల్కుం చేర్చబడి, తయారుకాబడిన పౌడరు. మీ ముఖ కాంతిలో మెరుగు చూపుట, చెమటను ఆపుట, చాలకాలము వాసన యుండుట దీని ముఖ్య విశేషములు. చెమట పొక్కులను ఆపుచేయును.

గోకుల్ శాండల్‌వుడ్ టాయిలెట్ పౌడరు:

శుద్ధమైన చందనపు చెక్కలనుండి తయారుకాబడిన పౌడరు. ఫేస్ పౌడరులకు వలయునంత సున్నితము చేయబడినది.

గోకుల్ బ్యూటీ పౌడరు:

పరిశుభ్రమైన పసుపుకొమ్ముల నుండి తయారుకాబడిన పౌడరు. వివిధ రాయలలో కలవు. మీ ముఖవర్చస్సును పెంపొందించునట్టియు, క్రిమి సంహారక సంబంధమగు శక్తియు గుణములు గలది. దీని సువాసన గంటలతరబడి నిలచియుండును.

టి.యస్.ఆర్ & కో., కుంబకోణమ్

C. L. Mani



తెలుగు వెలుగులు 20

రాజులను చేసేవాడు ఒకనాడు తానూ ఒక రాజు కాక తప్పదు. అలాగే మంత్రులను చేసేవాడు ఒకనాడు మంత్రి కాకనూ తప్పదు. అనేమాట సత్యం. ఇది పరిచితులకు సత్యం అని, అపరిచితులకు అల్లూరి అని, ద్వివిధనామాలతో, రాజుకాని రాజుగా—అంటే మంత్రికాని మంత్రిగా—ఇన్నాళ్లు వెలుగుతున్న తెలుగు వెలుగు శ్రీ అల్లూరి సత్యనారాయణరాజుగారి పట్ల పరమసత్యంగా పరిణమించింది.


జన్మస్థానం (పశ్చిమ గోదావరిజిల్లా) జిన్నూరు. తల్లిదండ్రులది ఉన్నకుటుంబం కాగు. బాల్యంలో వీధిబడి విద్యతప్ప మరి లేదు. అబ్బినవిద్య స్వార్జితం. ఒకరు నేర్పినది కాదు. ఒకరివద్ద నేర్చినది కాదు.

రాజకీయాలలో మొదట సర్దార్ దండు నారాయణరాజుగారు దగ్గరకు తీశారు. ఆ తరువాత అంతా స్వయంకృషి, స్వప్రయత్నం, స్వప్రభావం, స్వయంసిద్ధం. రాష్ట్ర కాంగ్రెసులో అంచెలంచెలుగా అన్ని పదవులను ఆక్రమిస్తూ చివరికి అఖిల భారత కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి అయినాడు. రాష్ట్ర రాజకీయాలు అడ్డం రాకపోతే అధ్యక్షులు కూడా అయ్యేవారు.

"నువ్వు ఇందాకటినుంచి చెప్పేదిచూస్తే నువ్వు ఒక పెద్ద దద్దమ్మవనో, లేక ఒక పెద్ద తంత్రజ్ఞుడవనో అనుకోవాలి. కాని మొదటిది అసత్యం, రెండోది సత్యం" అన్నాడు ఒకప్పుడు ఆయన మిత్రుడొకాయన. అది విని ఫకాలున నవ్వాడు. అలా చాలాసేపు నవ్వుతూనే ఉన్నాడు. ఎంత ప్రమాదంవచ్చినా ఆనవ్వు ఆగిపోదు. పోలికలు పోల్చిచూపడం కష్టం గాని బర్నార్డిషా బొమ్మ చూస్తే శ్రీ సత్యనారాయణరాజు స్ఫురణకు వస్తాడు.

మామూలు సంభాషణలలో ఎంత ఆకర్షణ శక్తి ప్రస్ఫుటిస్తుందో, బహిరంగోపన్యాసాలలోనూ అంతా ప్రస్ఫుటమవుతుంది. మాతృభాషలో ఎంత అనర్గళంగా మాట్లాడగలరో హిందీలోనూ అంత అనర్గళంగా మాట్లాడగలరు. మాటలతోపాటు రచనాపటిమకూడా ఉన్నది. "వోల్గానుండి గంగాతీరం" అన్న గ్రంథానువాదమే దానికి తార్కాణం.

ఆయన పలుకు తేనెపలుకు అని చెప్పవచ్చు. ఆయనమాటలు ఎంతటివాడిపైనైనా సమ్మోహనాస్త్రాలుగా పనిచేస్తాయి. వాటి వశీకరణశక్తి అమోఘం. మూర్ఛలో ఉన్నంతకాలమూ, సహచరులు "సత్యం" అంటారు. మూర్ఛానంతరం వారే ప్రతికక్షులై "అ.సత్యం" అంటారు. అసలు సత్యాన్ని ఎరిగిన కొందరు అనురాగంతో పడిపోతారు. మనుష్యులను కూడకట్టుకొని రావటంలో ఆయనకు ఆయనే సాటి. చతురోపాయాలలోనూ సామదానభేదాలమీదనే ప్రధానంగా ఆధారపడతారు. ఈ మూడింటికి లొంగనివారు అరుదు. మనసు కలవనివారిని కూడా సమయానికి ఎలాగో చేరదీస్తారు. చిన్నపనికైనా, పెద్దపనికైనా తెగింపు హెచ్చు. ఆత్మవిశ్వాసం అధికం. ఇన్ని శక్తియుక్తులు మేళవించిన అల్లూరి సమర్థుడైన మంత్రిగా తప్పక రాణించగలరు. ★



ఇంటర్వ్యూ ప్రివ్యూ

వేటూరి సుందరరామమూర్తి

బెజవాడ—గుంటూరు రోడ్డుమీద తుపాకి గుండులా దూసుకుపోతోంది మోటార్ బైక్. పరిసరం ప్రశాంతంగా ఉంది. చల్లగాలి సుఖంలా ఉంది. రాత్రి తొమ్మిదింటికి బెజవాడలో షాపింగ్ పూర్తి చేసుకుని రాజారావు శరవేగంతో గుంటూరు వస్తున్నాడు. మర్నాడు ఉదయం పోలీసు ఉద్యోగానికి అతనికి ఇంటర్వ్యూ.

రాజారావు షికారీలో ఆరితేరాడు. గుండెబలం కండబలం గలవాడు. వాడి చూపు, వేడి రక్తంగల ఘటం. ముక్త్యాల ప్రాంతం పట్టడవుల్లో గండు పులుల్ని మట్టుపెట్టి మటుమాయం చేసినదిట్ట.

అలా శరంలా దూసుకుపోతున్న రాజారావుకు గభిక్కన ఏదో గగ్గోలు వినిపించింది. చుట్టుపట్ల కలయచూశాడు. బైక్ పరిగెడుతూనే ఉంది. మార్గం నిర్మానుష్యంగా ఉంది. ఏమీ కనుపించలేదు.

ఈదురుగాలులు చెవిలో విసిరి కొడుతున్నాయి. ఆ ఒంటరితనం అతన్ని భయపెట్టబోయి తెల్లబోయిందా అన్నట్లు మసక వెన్నెల అంతటా ఆకట్టుకుంది. రోడ్డుమీద తనముందు అరఫర్లాంగు దూరంలో ఒక కారు అమితవేగంగా పోతోంది.

ఈసారి మళ్ళీ అలికిడి వినిపించింది. భయంకరమైన అరపేదో వికారంగా వినిపించింది. అది తన ముందున్న కారులోంచే వస్తున్నట్లు అనిపించింది. పసిగట్టిన రాజారావు లాగు జేబులో తుపాకి తడిమి చూసుకున్నాడు. ఆ గగ్గోలు ఏదో స్త్రీ కంఠం. స్త్రీ ఆర్తనాదం. రాజారావుకు ఉద్రేకం ఎక్కువైంది. దాంతో వేగం హెచ్చించాడు.

క్షణం వితర్కించి 'అవును. బహుశా ఆ కారులో ఎవరో దుండగులు స్త్రీని అపహరించి బలాత్కారం చేస్తున్నారు.' అనుకున్నాడు రావు. అరుపు మళ్ళీ విస్పష్టంగా వినిపించింది. రెచ్చిపోయి వేగం హెచ్చించేశాడు రావు. ముందు కారు మరింత వేగంగా దూసుకుపోతోంది. కారును దాటి పోవాలని సైడ్ కోసం హారన్ చేశాడు. అట్నుంచి వచ్చి రోడ్డు కడ్డంగా ఖణాయిస్తే ఢక్కొస్తూ గుండెగిడు ఆగిపోవలసిందే...ఇలా ఊహించాడు.

కారు వ్యక్తి సైడ్ యివ్వలేదు. రావుకి అనుమానం ధ్రువపడింది. కారుదాటి దారి కడ్డంవచ్చి ఆ కిరాతకుణ్ణి పట్టేసుకోడం ఎలా? అతని మోటార్ బైక్ రోడ్డుపై ఉక్కిరిబిక్కిరి అయింది.

ఇంతలో మార్గంలో మలుపు వచ్చింది. కారు మలుపు తిరుగుతోంది. ఇదే సమయమని పక్కసందుగా రివ్వున దూసుకుపోయాడు రావు. సరాసరి ముందుకు దౌడాయించి రోడ్డు కడ్డంగా బైక్ నిలబెట్టి కారును ఆపివేశాడు.

కోపంగా, పౌరుషంగా కారుదగ్గరికి వచ్చాడు రావు. కారులోంచి తనాబీలా

ఇంటర్వ్యూ
ప్రివ్యూ

దైటకొచ్చినవ్యక్తి యుద్ధసల్లుడిలా వుప్పించి ముందుకు దూకాడు. జబ్బకొద్దీ ఘనాయించి దెబ్బతీశాడు. మూడుగజాల దూరంలో పడ్డాడు రావ్. దిమ్మతిరిగిపోయి కనిబుసలు కొట్టింది అతనికి. తమాయించుకుని చివాలున లేచి బలంకొద్దీ గింగిరాలు తిరిగేటట్లు గూబ గుయ్యమనిపించాడు కారు వ్యక్తికి.

కారులో గోల ఇంకా జరుగుతూనే వుంది. బాహాబాహీగా ఇక లాభంలేదని రావు కారునచి మోకాలు కీలుమీద తుపాకి గురిపెట్టి ప్రయోగించాడు. ఎండిన గుండుతగిలిన ఆకాశపొధంలా, చిన్న 'క్లూ'తో-కధలో పెర్గిన 'సస్పెన్సు'లా దభాల్న కూలిపోయాడు దుండగీడు.

రాజారావు కాలునిలదొక్కుకుని – ఆదుర్దాగా కారుదగ్గరికివెళ్ళి చూశాడు. మసక చీకట్లో అలికిడేం కనిపించలేదు. అంతకుముందు క్షణంవరకు వినిపించిన అల్లరీ, ఆర్తనాదం ఆగిపోయాయి. కారులో మరివ్యక్తి ఉన్నట్లు కనిపించలేదు. ధైర్యంచేసి తలుపు తీసి చూశాడు. రెండు పెట్టెలుమాత్రం వున్నాయి. మనుష్యులు ... తను అనుకున్న స్త్రీ...ఎవరూలేరు. ఆదుర్దా ఎక్కువైపోయింది. అయోమయమైపోయింది.

ఇంతలో...'ఆలిండియా రేడియో... మీరింతవరకు 'కారులో హత్య' డిటెక్టివ్ నాటిక విన్నారు. ఇందులో పాల్గొన్నవారు...'

నిర్ఘాంతపోయాడు రావు. నిర్విణ్ణుడై సంభ్రమించిపోయాడు. అప్రయత్నంగా కారు కున్న నాలిక మంటపుట్టనేలేదు. బుద్ధి ఫట్లీకొట్టి చిత్తయిపోయా ననుకున్న రాజారావు — చేసినపనికి బాధతో భయపడిపోయాడు. తానో పెద్దకొండెతవ్వి పట్టిన ఎలుకలా ఎదర తుప్పలోపడి కనిపించాడు దెబ్బతిన్న మనిషి!

ఆక్షణంలో ఏమిటో, ఎలాగో, యేం చేయాలో రావుకు తోచలేదు.

హఠాత్తుగా ఆతిసమకలో రేచులాఒకజీప్ కారువచ్చి ఆగింది. అందులోంచి గబగబా

పోలీసుపటాలం ఒకటి దిగి చుట్టూవచ్చి కమ్ముకున్నారు.

రావు వణికిపోయాడు. పోలీసులుకొందరు కారంతా వెతుకుతున్నారు. రావుని డబాయించి 'ఎవరూ నువ్వు? ఏమి టిది? ఎక్కడ ఈ కారులో వచ్చినవ్యక్తి?' అని అడిగాడు పోలీసు అధికారి.

మూల కీలువిరిగి పడివున్న వ్యక్తిని చూపించాడురావు.

చేసిన నేరానికి వెంటనే తనకే సంకెళ్ళు పడతాయనుకున్న రాజారావు - తనకళ్ళను తానే నమ్మలేకపోయాడు. కుప్పకూలిపడివున్న కారుమనిషి చేతికి తటాలున బేడీలు వేశారు పోలీసులు

'ఇక్కడేం జరిగింది?' పోలీసు అధికారి ప్రశ్నించాడు. జరిగినకథ వివరించాడు రాజారావు.

'ఎక్కడికి వెడుతున్నారీ అర్థరాత్రి?' మళ్ళీ ప్రశ్నించాడు అధికారి. గుంటూరు ఇంటర్వ్యూ సంగతి చెప్పాడు రావ్.

'రైట్...ముందు స్టేషనుకు పదవండి' అన్నాడు ఇన్‌స్పెక్టరు.

'ఏమిటిది ఇన్‌స్పెక్టర్...అంతా అయోమయంగా వుంది' రావ్ ప్రశ్నించాడు.

ఖైదీతోసహా పటాలంతో జీపువాన్ కదిలింది. మోటార్ బైక్ మరో పోలీస్ జవాన్ తెస్తున్నాడు. ఇన్‌స్పెక్టర్ చెప్పాడు: 'ముందు మీరుకూడా స్టేషన్‌కువచ్చి స్టేట్‌మెంటు ఇవ్వాలి. తరువాత మీరువెళ్ళవచ్చు. వీడు మాకళ్ళల్లో కారంకొట్టి ఆర్నెల్లుగా యీ చుట్టుపట్ల చోరీలుచేస్తున్న బడాచోర్ కేడీ...గూండా...సినిమాహాల్లో రెండు వేల రూపాయలు కొట్టేసి, పార్క్ చేసివున్న మునిసిపల్ కమిషనరీ కార్లో ఉడాయించాడని తెలిసి వెంబడించాం. దొంగనోట్లు అచ్చువేయటం వీడివృత్తి.. సింపిల్ రాస్కేల్..

మొత్తానికి భలే చిత్ర సంఘటన మీరు వీణ్ణి పట్టుగోటం—మీకు చాలా థ్యాంక్స్'

అప్రయత్నంగా 'ఏమిటిదంతా ముద్దాయిని పెద్దమనిషినయి''యాను' అన్నాడు సంభ్రమంతో రావ్.

'మరేంలేదు. రేపు మీరు పోలీస్ ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వెడుతున్నారు కదూ... ఇది ఇంటర్వ్యూ ప్రివ్యూ' అని క్షణం ఆగి బిగ్గరగానవ్వి - మీ కీమాట లిలా అర్థంకావటం కష్టం, మరివస్తా- నమస్తే...' అని ఠాణాలోకి నడిచాడు ఇన్‌స్పెక్టర్.

మర్నాడు ఇంటర్వ్యూలో యిన్‌స్పెక్టర్ కూడా ఒక పరీక్షకుడే. ఈ మాటలు ఒక కానిస్టేబుల్ రావు చెవిలో ఊదాడు. స్టేట్‌మెంట్ ఇచ్చి బయటికి వస్తుంటే...మరొకడు తెచ్చి మోటార్ బైకే అందించాడు.

ఈ మాటలువిన్న రాజారావు ఆ మోటార్ బైక్ ఎక్కి జరిగిందానికి జరగబోయేదానికి ఒక్కసారి ఆశ్చర్యంలో మునిగిపోయి గుంటూరు ఇంటర్వ్యూలో పైకి తేలాడు. ★

వచ్చేవారం

కొత్త సీరియల్

రాబిన్ హుడ్



అతడెవరో ఎవరికీ తెలియదు. కాని 'రాబిన్‌హుడ్' అనేపేరు వినగానే ''ఓహో, అతనా?'' అని, ఎప్పుడో మరిచిపోయిన ప్రాణమిత్రుడు జ్ఞాపకంవచ్చినట్లు సంతోషపడతారు. విలువిద్యలో అతన్ని మించినవాడు లేడు. గజదొంగలలో అతన్ని మించినవాడు లేడు. మంచితనంలోకూడా అతన్ని మించినవాడు లేడు. అందుకే ఇన్నివందల ఏళ్లుగా, తరతరాల జనం అతన్నిగూర్చి రకరకాల కథలు చెప్పుకున్నారు. కవులు అతనిగాథలు పాటలల్లారు. ఎన్ని నవలలో, ఎన్ని నాటకాలో వ్రాశారు. సినిమాలొచ్చాక అతని కథ సినిమాలుతీశారు. టెలివిజన్‌లో ప్రదర్శించారు. అతని తరవాత ఎందరో బందిపోటు దొంగలు, అతనిలాగా అడవుల్లో, కొండల్లో న్యాయశాసనానికి అందకుండా సంచరిస్తూ, 'రాబిన్‌హుడ్'అనేబిరుదు తగిలించుకున్నారు. కాని ఎవరికీ అతనికి వచ్చిన పేరుప్రతిష్ఠలు రాలేదు. అతడు ధనికులను దోచుకుని, దరిద్రులకిచ్చేవాడు. ధూర్తులను శిక్షించి ఆర్తులను రక్షించేవాడు. అతని ధైర్యసాహసాల అద్భుతగాథలు ఈనాటికీ పిల్లలనేమిటి, పెద్దలనీ నోరూరిస్తాయి.

రాబిన్‌హుడ్ కథ వచ్చేవారంనుంచీ ఆంధ్ర వారపత్రిక ''బాలసాహితి''లో సీరియల్‌గా, బొమ్మలతో సహా ప్రకటిస్తున్నాము. పిల్లలందరూ వారం వారం ఈకథ చదివి ఆనందిస్తారని ఆశిస్తున్నాము.

రాజధాని కబురు

"శ్రీ ప్రవీణ్" సెలవులో ఉన్న కారణంచేత గతవారం, ఈవారం "రాజధాని కబురు" శీర్షిక నిలిపివేయవలసి వచ్చినది. ఆయన సెలవునుంచి తిరిగిరాగానే తిరిగి ఈశీర్షిక యథాప్రకారం వెలువడుతుంది.

సమాజ శ్రేయస్సు దృష్ట్యా

సెక్సు సమస్య

మన సమాజంలో సెక్సుసమస్యగురించి గత సంచికలో మొదటి వ్యాసం ప్రచురించాము. ఈ సమస్యదృష్ట్యా భార్యాభర్తల అన్యోన్యతకు భంగం వాటిల్లజేసే కొన్ని కారణాలను స్పృశిస్తూ ఈ సంచికలో రెండవవ్యాసం ప్రచురిస్తున్నాము.

2

పెండ్లి నూరేండ్ల పంట—అంటారు పెద్దలు. ఎంతో కాలం మంతనాలు జరిపి, పొంతనాలు చూశాక కాని పెండ్లి చేయరు. మరి, కాపురంలో పొందిక కుదరకపోతే కోలాహలం పుట్టిందన్నమాటే.

ఈ పొందికకు దంపతులలో సెక్సు వైషమ్యం—కామోపభోగంలో విషమత—లేకపోవడం ప్రధానం. సెక్సును మించిన వ్యాసయావేగం మరొకటి లేదు. సెక్సు జీవికి ప్రధానమైన కోరికఅని ఇదివరకే అన్నాము. కామం శరీరస్థితి హేతువు కావడంవల్ల ఆహారంవంటి నిత్యావసరమవుతూ, ధర్మార్థాలకు ఫలభూతమైన పురుషార్థమూ అవుతున్నది—అన్నాడు వాత్స్యాయనుడు. ఈ పురుషార్థం సఫలంకాకపోతే, సంతృప్తి కలుగకపోతే కలిగే ప్రమాదాలు కొల్లలు.

కాపురంలో పొందిక లేకపోవడానికి కారణాలు శారీరకంగాను, మానసికంగాను, స్వభావసంస్కారాలనుబట్టీ వుంటాయి. ఇవి కాపురం ఆరంభమైన కొన్నాళ్ళకే ఆరంభమై ఇంతింతై, హృదయ నభోమండలంలో అంతై వ్యాపిస్తాయి. పెండ్లి, కాపురం అనగానే దంపతులు ఏవేవో మధుర మధుర భావాలతో స్వప్న వీధులలో విహరిస్తారు. కాపురం పెట్టడంతోటే తమ ఆశలన్నీ నిరాతంకంగా, నిరంతరంగా నెరవేరుతాయనీ అడియాసలు పడుతారు. ముఖ్యంగా పురుషుడు తన ఆశలన్నిటినీ పిండవేయడానికి ఉబలాటపడుతాడు. కాని, స్త్రీ పురుషుడు చూపినంత ఆవేగం చూపదు. దీనితో ఆమె అప్రవర్తకత్వం—చొరవ చూపకపోవడం—గుర్తించడంతో పురుషుడు కొంచెం వెనుతగ్గి భార్య తన వాంఛలను తీర్చలేకపోతున్నది; తాను చూపుతున్న సంరంభం చూపలేకపోతున్నది—అనే అపోహ పడుతాడు. గార్హస్థ్యజీవితం తొలినాళ్లలో పురుషునకు కామవాంఛ హెచ్చని, పది పన్నెండేళ్లు కాపురం చేసిన తర్వాత—ప్రారంభకాల పరిస్థితికి విరుద్ధంగా—కామవాంఛ లొచ్చని శాస్త్రజ్ఞు లంటారు. ఈ తొలినాళ్ళలోనే పురుషుడు దురుసుగా ప్రవర్తించడంవల్ల స్త్రీకి వైముఖ్యం ఏర్పడడం-ఆమె మగడంటే ఎంతప్రేమగలదైనా సంభవిస్తుంది. కాపురం చాల సున్నితమైంది. హెచ్చులొచ్చులు లేక సమ్మసరిగా ఉంటేనే ఏపుగా పెరుగుతుంది. సమ వేగంగా వున్నపుడే సుఖమూ, సంతోషమూను. నాయకుడు చిరవేగుడు, చండవేగుడు అయితే—ఎంతకూ వదలనివాడయితే—స్త్రీలకు అసహ్యం కలుగుతుంది; శీఘ్రవేగుడు, మందవేగుడు అయితే భావప్రాప్తి కలుగక ఈసు పుడుతుంది. కనుక ఉభయత్రా సమవేగం అవసరం—అంటాడు వాత్స్యాయనుడు. కామమనేది ప్రకోపించిన పిదప త్వరగా శాంతించదు; మనస్సు స్తిమితం కోల్పోతుంది. ఇలా మరికొన్ని సార్లు జరిగితే కాపురంలో పొందిక ప్రిదిలిపోతుంది.

కాపురం కలతలపాలు కావడానికి మరొక కారణం స్తబ్ధత-జడత్వం. ఈ స్తబ్ధత సెక్సును గురించి పెద్దవారు చెప్పిన లేనిపోని భయాలవల్ల—ముఖ్యంగా స్త్రీలలో ఏర్పడుతుంది. కొత్తశోభనపు పెళ్ళికూతుర్ని శోభనపుగదిలోకి పంపుతున్నప్పుడు కూడా పక్కింటి పొరిగింటి అమ్మలక్కలు మొగుని తాకిడిని చిలవలు పలవలుగా చెప్పి బెదరగొట్టడం నేడూ మన గ్రామాలలో, పట్టణాలలో జరుగుతున్నదే. ఈ మాటలతో, మనసులో చీకట్లు కమ్మినవారు కొన్నేళ్ళు కాపురం చేసినా స్తబ్ధులుగానే ఉంటారు. "భార్య భర్తనే నమ్ముకొని, ఏకచారిణిగా, భర్తపై భారమంతా వేసి అతనినే దేవతగా భావించి అనుకూలంగా ప్రవర్తించాలి" అని పదే పదే ఉపదేశామృతం వీనుల పడడంవల్ల నవవధువు బిక్కుబిక్కుమంటూనే భర్త కోరికలు తీర్చినా, మనసిచ్చి మసలదు; తీవ్రత చూపదు; చల్లబడి ఉంటుంది. దీనితో క్రమంగా భర్తఅంటే వెగటు, వైరస్యం పెరిగిపోతాయి ఆమెలో. సంప్రయోగంలో త్వరగా ద్రవించదు—అంటే మామూలు మాటలలో నడుము సడలించదు; ఒళ్లుకదలదు. దీనితో ఆమెకు మూర్ఛాపస్మారాదిరోగాలు పుట్టే ప్రమాదంకూడా ఉంది. ఇలాగే పురుషుని స్తబ్ధతనుకూడా స్త్రీ ఉపేక్షగాను, ప్రేమరాహిత్యంగాను భావిస్తుంది. దానితో రెచ్చిపోయి, పెడదారి తొక్కడమూ సంభవిస్తుంది. ఈవిధంగా కామోపభోగంలో వైషమ్యం పోనుపోను ఉభయుల హృదయాలలోను నీలినీడలు పడవేసి వ్యభిచారానికి దిగజారజేయడానికి ప్రధానకారణమవుతుందన్నా అతిశయోక్తి కాదు.

నిజానికి, ఎంతో మనోవ్యథ, కష్టం తర్వాతగాని వ్యభిచారంలో ప్రవృత్తి ఏర్పడదని మానవజాతి చరిత్రను పరిశీలిస్తే తెలుస్తుంది. వ్యభిచారమనేదాని నిర్వచనమూ యుగయుగాలలో మారుతూనే ఉంది. ఒకానొక కాలంలో ఇంటికి విచ్చేసిన అతిథికి గృహస్వామి తన భార్యను సకలోపచారాలకు అప్పగించడం ధర్మం. దానిని కావన్నవారిని, రాజులను, రాజర్షులను, మహర్షులను కూడా—శపించిన గాథలు భారతంలో ఉన్నాయి. నిన్న మొన్నటివరకు ఈ ఆచారం ఎస్కిమోలలో ఉండేదని చరిత్రకారు లంటారు. తనకు అపూర్వానందమిస్తున్న వస్తువును అతిథికి అర్పించి ఆనందింపజేద్దామనే సత్సంకల్పమే ఈ ఆచారానికి మూలహేతువు కావచ్చు. బహుపతిత్వం ఒకప్పుడు ఆచారం; ధర్మం. నేడది ఎంతో అపహాస్యభాజనం; అవమానకరం. బహుపత్నీత్వం మొన్నటివరకు శాస్త్రసమ్మతం; నేడది నేరం. ఏమైనా, వివాహమనే వ్యవస్థ ఏర్పడడానికి ముందూ, తర్వాతకూడా అన్ని కాలాలలోను కామోపభోగం విషయంలో ఆర్జవం అత్యవసరమనేది అన్ని దేశాలవారూ గుర్తించిన ధర్మం; అతి పవిత్రమైన ధర్మం. కామ ప్రవృత్తి ఆకలిదప్పులవంటి ప్రవృత్తిసామాన్యం కాక తదతీతమైందనడం స్పష్టం గనుక యాదృచ్ఛికంగా సృష్టికి కారణమవుతూ, అనితరసాధ్యమైన ఆనందాన్ని పొందించేది గనుక, స్నేహానికి పరాకాష్ఠ గనుక, తత్పరమైనవారిని అదు

వులో పెట్టడం, కట్టుబాట్లు సంఘంలో అనాదిగా ఏర్పడడంవల్ల, ఈ విషయంలో అనార్జవం మహాపాతకంగాను, మహాపరాధంగాను భావించారు; వర్ణించారు. పరస్పరం మరణ పర్యంతం వ్యభిచారమనేది తలపెట్టకుండా కాపురం చేయడం స్త్రీ పురుషులకు పరమోత్తమమూ, సమానమూ అయిన ధర్మం. కనుక ఉభయులూ ఆర్జవంతో ప్రవర్తించాలి స్త్రీ భర్తను మీరి పెడదారి తొక్కితే లోకంలో నిందనుమోసి, పాపం పొంది, రోగాలతో నవిసి, మరుజన్మలో జిత్తులమారి నక్కై పుడుతుంది—అని మనువు అన్నాడు. అన్ని మతాలలోను ఇలాటి విధి నిషేధాలే ఉన్నాయి. ఏకపత్నీ వ్రతానికి, పాతివ్రత్యానికి ప్రాధాన్యమిచ్చే కథలు, గాథలు నేల నాలుగుచెరగులా వినిపించేవే. వ్యభిచారం అన్ని మోసాలకన్నా "మహామోసం" గా భావించడం వల్ల, సంఘ వ్యవస్థ మాంచి బిగువుగా ఉండడంవల్ల మనలో సెక్సువిషయమై అనార్జవం తక్కువే-ముఖ్యంగా స్త్రీలు వ్యభిచరించడమనేది అరుదే. పతిపై అనురాగం, తన పిల్లాజెల్లాపై వాత్సల్యం, పరువు మళ్ళి పోవడం, అవమానం, కష్టం కలుగుతాయన్న ఆశంక, అందని మానుపండులే అన్న అప్రత్యయం, మనసుంచి మరొకరికి మనఃక్లేశం ఎందుకులే అన్న మంచితనం, గుట్టు బయటపడితే గుంపునుంచి వెలి అనే గాబరా, భర్తే మరొకరి ద్వారా మభ్యపెట్టించి పరీక్షిస్తున్నాడేమో నన్న విమర్శ, అన్నిటికీ మించి ధర్మాపేక్ష స్త్రీలలో వ్యభిచార వ్యావర్తన కారణాలు—అని వాత్స్యాయనుడన్నాడు.

కాని, నేడు కొందరు వ్యభిచారం గురించి భిన్నాభిప్రాయంతో దానిని సమర్థించేవారూ ఉన్నారు. మన వివాహ వ్యవస్థ సెక్సు సిద్ధాంతాలు, నిబంధనలు 'మధ్యతరగతి నాగరికత'పాదులలో మొలచినవి. నీతిఅనేది ఎప్పటికప్పటికి మారేదిగనుక సహేతుకం కాదు. మానవుని కామప్రవృత్తి అనుభవ వైవిధ్యం లేకపోతే అతృప్తంగానే ఉండిపోతుంది. ఒకే ఒక ఒక్కపెళ్లాంతో విసుగెత్తిపోతుంది. కనుక మనస్సంతృప్తికి పలువురు పడతులు అవసరం—అని వీరు వాదిస్తారు.

ఇక స్త్రీలలో సంప్రయోగం చేతనే తృప్తి పొందక సంతానంకోసం, చిట్టి చేతులు తమ పాలిండ్లు పట్టుకొని, పట్టు పెదవులతో పాలుపీల్చే అపూర్వానుభూతి కోసం కాలు జారేవారూ, తమభర్తలకు ఆధాన సామర్థ్యం తగ్గిందనే భ్రాంతితో పక్కదోవలు చూచేవారూ ఉన్నారు. సంప్రయోగ సుఖానికీ—భావప్రాప్తికీ—సంతానప్రాప్తికీ సంబంధంలేదని మొదట్లోనే చెప్పాం. కాని సుశ్రుతుడు భావప్రాప్తిలేనిదే బీజాధానం కలుగదన్నాడు. వహ్నసత్వం "భావప్రాప్త్యాగర్భసంభవః ఇతి బాభ్రవీయాః" (భావప్రాప్తి లేకపోతే గర్భం సంభవించదని బాభ్రవీయులు అంటారు.) అని వాత్స్యాయనుడన్నాడు.

సామాన్య వ్యావహారిక జీవితంలోనే ఆర్జవం అత్యవసరమైనప్పుడు జీవన సహచరులలో ఆర్జవం అతి ముఖ్యమనడం చెప్పనక్కరలేదు. ఏవో తాత్కాలిక ప్రేరకాలతో అవే నిజమైన కారణాలని భ్రాంతిపడి పెడదారితొక్కడం మీదలకు కారణం. వాటిని అదుపులో పెట్టుకొనడంలోనే ఉంది సుఖమంతా. వెలిచవులు తాత్కాలికంగా నిషాకలిగించినా, కొత్త సమస్యలను, చిక్కులను పుట్టించి, గార్హస్థ్య జీవితాన్ని గిట్టించి, మరింతవిషాదం కలిగిస్తాయి. వ్యభిచారం చాలవరకు సెక్సులో పొత్తుకుదరకపోవడంవల్లనేనని కనుగొన్నాము గనుక ఈవైషమ్యాన్ని పోనాడి, పొందిక పొందడం సాధ్యమా? సాధ్యమే.

సెక్సు నేడు పూర్వంలాగ ప్రజననసాధనంగాను, సుఖోపకరణంగాను ఉండడం మాత్రమే కాక, అంతకన్నా ఎంతో ముందుకే పోయింది. కేవలం విషయసుఖమే ప్రధానమైతే మానవుడు విచ్చలవిడిగా తిరిగేవాడే. అలాకాక నేడు సెక్స బహుళ స్నేహానికీ, సాహచర్యానికీ ప్రధానపీఠంగా పరిణమించింది. ఈ సెక్సు సవ్యంగా లభించేది గార్హస్థ్యంలోనే.

గార్హస్థ్యం స్నేహ పరాకాష్ఠ; ప్రణయ పరమావధి; సాహచర్య సుఖానికి సీమ అన్నాం కదా! సంప్రయోగం మాత్రమే దాని ప్రధాన ప్రయోజనం కాదు. పూర్వం ప్రజ; నేడు ప్రజతో పాటు మైత్రితో విలసితమైన సాహచర్యం. ఈ మైత్రి అరమరలు లేక గడవడానికి ఉభయులూ కొంత త్యాగం చేయవలసి ఉంటుంది, కొంత నిగ్రహం చూపవలసి ఉంటుంది, తిక్కలు తగ్గించుకొని అనుసరణతో మనవలసి ఉంటుంది. ఇద్దరిలో ఎవరికి వైరస్య వైముఖ్యాలు కలిగినా, కారణాలు తెలుసుకొని, చక్కదిద్దుకోడమే జీవిత సౌఖ్యానికి కీలకం. మన నెరిగి మసలుకోడం తెలుసుకొన్నవారి సుఖానికి అంతుండదు. పరస్పర ప్రవృత్తులను పరిగణించి సహనం చూపడం ముఖ్యం. సెక్స అనేది మన వ్యక్తిత్వానికి వెలిగా ఉండదు. స్వస్థమనస్కుడెవడూ సెక్సు చిక్కులతో బాధపడడు. కనుక సెక్సు చిక్కులకు సహన ప్రేమలకు మించిన మందు లేదన్నారు మనస్తత్వవేత్తలు. ఈ సులు పెరిగిన కామవాంఛ చాల సంతోషదాయకమౌతుంది.

స్త్రీ పురుషులలో—దంపతుల మాట—కామప్రవృత్తి, వేగం సమానంగా ఉండవు. సులువెరిగి ప్రవర్తిస్తే స్తబ్ధత ఎవరిలో ఉన్నా మంచులాగ కరిగిపోతుంది; వెచ్చదనం విస్తరిస్తుంది. దేనికైనా 'అభ్యాసం కూసువిద్య'. "సాధనమున పనులు సమకూరు ధరలోన" అన్నాడు వేమన. కొత్తలో కలిగిన లోపాలను, వైషమ్యాన్ని, వైముఖ్యాన్ని గ్రహించి సర్దుకొని ప్రవర్తిస్తే, సహజంగా సమకాలంలోనే ఉభయులకూ భావప్రాప్తి కావడానికి, అసంతృప్తి అంతమైపోవడానికి అవకాశం ఏర్పడుతుంది. స్త్రీల ప్రీతిని గుర్తించి, లక్షణాలను అరసి, అదనెరిగి, నమ్మకం కలిగించి, అభిముఖ్యం చేకూర్చుకొని ప్రవర్తిస్తే సమాన స్వభావ భావాలు గలవారికి సమాన సుఖం కలుగుతుందన్నాడు వాత్స్యాయనుడు. అట్టి రాగోదయ ప్రక్రియలు అన్ని దేశాలవారూ తెలిపారు; అవి హృదయాలు కలిస్తే తమంతటనే పుట్టుకవస్తాయి. వాటికి క్రమం, క్రమం అంటూ లేవు. అదొక లోకం. "నియతికృతనియమరహితం". ఇది ఫలానావిధంగా చేయాలి, ఇది ఈరీతి—అనే గిరిగీచే సూత్రాలేవీ లేవు. ఇంగితజ్ఞానం, హృదయావబోధం, పరస్పర విశ్వాసం ఇవే మూలసూత్రాలు. కనుకనే,

"శాస్త్రాణాం విషయ స్తావత్
యావన్మందరసా నరాః,
రతిచక్రే ప్రవృత్తేతు
నైవ శాస్త్రం నచ క్రమః."

అన్నారు కామశాస్త్రకారులు.

ఏవంచ: మనం గ్రహించవలసినది వ్యభిచారాది దుష్టమార్గాల నివారణకు, అభిముఖ్యాది సుమార్గసాధనకు పతిపత్నులు పరస్పరం తమ వైయక్తికాభ్యాసాలను, విభేదాలను సమీచీన దృష్టితో చూచి సరిదిద్దుకోడం ఉత్తమమని. ఈ విభేదాలను తమ గార్హస్థ్య జీవిత సంబంధంలోని సామాన్యాంశాలుగా వారు భావించాలే గాని, విడదీసి విశేషాంశాలుగా భావించరాదు. వాటిని వారి వారి సంస్కారాలనుబట్టి పెద్దవిగాను పరిగణించవచ్చు; చిన్నవని తోసివేయనూ వచ్చు. గార్హస్థ్య జీవితం పరస్పరసంతృప్తి పరిణామమనే దృష్టి కలిగితే—సామాన్యవ్యవహారంలోలాగే—పట్టువిడుపులు అవసరమని అనుభవమే పాఠం చెబుతుంది.

—చంద్ర


మీ మనస్తత్వానికి గీటురాయి

మనిషి సుఖంగా ఉండడానికి దేహారోగ్యం ఎంత అవసరమో, మానసికారోగ్యమూ అంత అవసరమేనని, ఈ రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడిఉంటాయని అందరికీ తెలిసినదే. మానసికారోగ్యాన్ని చెడగొట్టేవి ఆందోళన, భయం, ఒకే విషయమై అదేపనిగా ఆలోచన, శారీరకంగా ఏజబ్బులేకుండానే అనారోగ్యంగా ఉన్నట్లు బాధపడడం మొదలైనవి. అలాటి మానసిక అనారోగ్యాన్ని "న్యూరోసిస్" అంటారు. ఈ న్యూరోసిస్‌తో బాధపడే వ్యక్తులను కనుక్కొని, వారి మనోవ్యాధి ఉధృతాన్ని అంచనావేసి, దాని చికిత్సకు తోడ్పడే మార్గాలను అన్వేషించే ఉద్దేశ్యంతో అమెరికాలోను, బ్రిటన్‌లోను కొందరు మనస్తత్వవేత్తలు ప్రశ్నల పట్టికలు జారీచేయడం గతయుద్ధకాలంలో ఎక్కువగా జరిగింది. బ్రిటన్‌లో వ్యాప్తిలోకి వచ్చిన ఒక ప్రశ్నావళిని తీసి ఈ క్రింద ప్రచురిస్తున్నాము. ఇందులో 40 ప్రశ్నలున్నాయి. ప్రశ్న చదివి 'అవును' 'కాదు' ఏదో ఒకటి నిశ్చయించుకుని అక్కడ గుర్తుపెట్టుకోవాలి. పది అవునులు వస్తే ఆరోగ్యవంతమైన మనస్సులు గలవ్యక్తులనీ, 20 గాని, ఇంకా పైబడి గాని అవునులువస్తే కొంత మానసిక అనారోగ్యం ఉందని అనుకోవచ్చు. అయితే అంతమాత్రాన ఆందోళన పడవలసిన అవసరంలేదు. 20 అవునులు వచ్చినంతలోనే మానసికరోగి (న్యూరోటిక్) అని తొందరపడి నిర్ణయించుకోకూడదు. ఈమాదిరి ప్రశ్నలవలన అనుభవజ్ఞుడైన మనస్తత్వవైద్యుడు, వ్యక్తులను ఎలా అర్థం చేసుకోవాలో తెలుసుకోగలుగుతాడు. అవసరమైతే మరింత క్షుణ్ణంగా పరీక్షచేయడానికి ప్రయత్నిస్తాడు. కనుక కేవలం ఈ ప్రశ్నలను బట్టే ఒక వ్యక్తి మనస్తత్వాన్నేతప్ప, మానసికారోగ్యాన్ని పూర్తిగా నిర్ణయించడం మంచిది కాదు.

ప్రశ్నలు	అవును	కాదు
(1) మీకు అప్పుడప్పుడు కళ్లు తిరుగుతాయా?		
(2) మీకు గుండెదడ వస్తుందా?		
(3) మీ రెప్పుడైనా నరాల బలహీనతవలన మంచం పట్టారా?		
(4) జబ్బు చేయడంవల్ల ఉద్యోగం మానేసి చాలాకాలం ఊరికే ఉండడం జరిగిందా?		
(5) తరుచు మీకు సభాపిరికితనం వస్తూ ఉంటుందా?		



	అవును	కాదు
(6) కొత్తవారితో సంభాషించడం కష్టమైపోతూ ఉంటుందా?		
(7) మీ కెప్పుడైనా నత్తి ఉండేదా? లేక తరుచు మాటలు తడబడేవారా?		
(8) ఏదైనా ప్రమాదం జరిగి గాని, దెబ్బ తగిలి గాని, రెండు మూడు గంటలసేపు స్మృతి తప్పి పడిపోయారా?		
(9) ఏదైనా పరాభవం, అవమానం జరిగినప్పుడు దాన్నిగూర్చే అస్తమానం తలపోస్తూ కూర్చుంటారా?		
(10) మీరు వట్టి గాభరా మనిషి అని మీ నమ్మకమా?		
(11) ప్రతిదానికి వట్టి పుణ్యానికి నొచ్చుకునే స్వభావమా మీది?		
(12) సభల్లోనూ, సమావేశాలలోనూ సాధారణంగా ఎవరి దృష్టినీ ఆకర్షించకుండా ఉండడానికి ప్రయత్నిస్తారా మీరు?		
(13) అప్పుడప్పుడు మీకు వణుకుపుడుతుందా?		
(14) చీటికి మాటికి తారాజువ్వలా లేచే కోప స్వభావమా మీది?		
(15) ఊరికే ఆలోచనలమీద ఆలోచనలు వచ్చి నిద్ర పాడైపోతుందా?		
(16) ముందేం జరుగుతుందో అని ఆందోళన పడుతూ ఉంటారా?		
(17) మీకు బిడియం జాస్తిగా ఉందా?		
(18) నిష్కారణంగా మీకు సంతోషం గాని, దిగులు గాని కలుగుతుందా?		



(19)–(27)	అవును	కాదు

(19) పగటి కలలు కనడం అలవాటా?
(20) అందరూ ఆనందించేస్తున్నారు, మీరే కష్టపడిపోతున్నారని మీకు అనిపిస్తూ ఉంటుందా?
(21) గుండెల్లో నొప్పి ఎప్పుడైనా వస్తుందా?
(22) పీడకలలు వస్తూ ఉంటాయా?
(23) ఆరోగ్యం గూర్చి ఊరికే బెంగెట్టుకుంటూ ఉంటారా?
(24) నిద్రలో ఎప్పుడైనా నడవడం ఉందా?
(25) శరీరశ్రమ ఏమీ లేకుండానే చెమట పోస్తుందా?
(26) కొత్తవాళ్ళని స్నేహితులుగా చేసుకోవడం మీకు కష్టమా?
(27) మీ మనస్సు మీ అధీనం తప్పి ఎటో పోవడం, మీరు ఏంచేస్తున్నారో మీకే మరిచిపోవడం ఉందా?

(28)–(40)	అవును	కాదు

(28) మీ ఇష్టమైన విషయాలను ఎవరైనా కాదని కొట్టేస్తే కొట్టేసేంత పనిచేస్తారా?
(29) ఎప్పుడూ మీరు అసంతృప్తిగా ఉంటూ ఉంటారా?



(30) తరుచు 'ఛీ, ఇక లాభంలేదు' అనేంత నిస్పృహ, నిరాశలలో పడుతూ ఉంటారా?
(31) మీకంటె అధికులైనవారిదగ్గర మీరు కొంచెం ఇరుగ్గా, ఇబ్బందిగా ఉన్నట్లు ప్రవర్తిస్తారా?
(32) మీకు నిద్రలేమి జబ్బు ఉందా?
(33) బరువులెత్తడం, పరుగులెత్తడం వగైరా ఏమీ లేకుండానే మీకు ఊపిరి అందకపోవడం జరుగుతుందా?
(34) మీ కెప్పుడైనా తీవ్రంగా తలనొప్పి రావడం ఉందా?
(35) మీకు తరుచు నీరసం వచ్చి క్రుంగిపోతూ ఉంటారా?
(36) ఏవో నొప్పులూ, బాధలూ ఉంటూనే ఉంటాయా?
(37) లిఫ్టులు ఎక్కుతున్నప్పుడు, రైలులో పోతున్నప్పుడు, భయం పుడుతుందా?
(38) మీకు తరుచు నీళ్ళ విరేచనాలు అవుతూ ఉంటాయా?
(39) మీలో మీకు నమ్మకం తక్కువా?
(40) మీ రితరులకంటె తక్కువవారమనే భావం కలుగుతూ ఉంటుందా?

★

కథ కాని కథ

సమయస్ఫూర్తి

(మొదటి బహుమతి రూ. 10)

చదువుకుంటున్న రోజుల్లో, చాలామందిలాగే నాకూ ఆటల మీద మోజు ఎక్కువగా ఉండేది. రోజూ ఫుట్‌బాల్ ఆడేవాణ్ణి. ఒకసారి మా స్కూలుకు ఏలూరు స్కూలుకూ పోటీపడింది. ఆ మాచ్‌కి, మా కెప్టెన్ నన్ను తన జట్టులోకి తీసుకున్నాడు కాని డ్రిల్లు మేస్టరు నన్ను వెళ్ళగొట్టాడు. నేను తగినంతపొడుగ్గా లేను అని. చేసేదేంలేక పోటీ చూడడానికి వెళ్ళాను. ఆట జోరుగా సాగుతోంది. ఆ ఉత్సాహంలో, ఆటచూస్తున్న నేను ఒళ్ళుమరచిపోయి నాముందు నిల్చున్న ఒక పెద్దమనిషిని బంతిని తన్నినట్టు లాగిపెట్టి తన్నాను. ఆయన అదరిపడి, వెనక్కి తిరిగి నా జెబ్బపట్టుకు గదమాయించాడు—ఎందుకలా తన్నావు అని.

అప్పటికి బోధపడింది నేను చేసిన దారుణం. జవాబేం చెబితే ఏంలాభం! ఆయన ఎలాగా తంతాడు. కాని అనుకోకుండానే, "గండుచీమ కుట్టిందండి" అనేశాను గబుక్కున. ఆయన ఏమనుకున్నాడో ఏమో, నామాట నమ్మేసి కొంచం అవతలకిపోయి నిల్చుని ఆట చూడసాగాడు! దెబ్బలు తప్పించిన ఆ ఉపాయాన్ని చెబితే ఇప్పటికీ నా మిత్రులు నవ్వుతూఉంటారు.

గుంటూరు శంకర్. (పిఠాపురం).

చంద్రహాసం

(రెండవ బహుమతి రూ. 5)

నేను హైస్కూలులో చదివేటప్పుడు మా క్లాసులో చంద్రం అనే అబ్బాయి ఉండేవాడు. రోజుకొక మేస్టరుని ఏడిపించడము వాడి నిత్యకృత్యములలో ఒక పనిగా ఎంచేవాడు. చంద్రానికి మా ఇంగ్లీషు మేస్టరుగారికి అసలు పడేదిగాదు. మా స్కూలు వార్షికోత్సవంనాడు "శ్రీరామజననం" నాటకంలో 'కౌసల్య' పాత్ర ధరించి బహుమానం పొందేడు. ఆ నాటినుంచి అందరూ వాడిని 'కౌసల్యా', 'కౌసల్యా' అని పిలిచి ఏడిపించడము మొదలు పెట్టేరు. ఇదివిని మా ఇంగ్లీషు మేస్టరుగారు పొంగిపోయారు. ఒకనాడు ఆయన క్లాసులో ఎటెండెన్సు వేసుకుంటూ చంద్రంపేరు రాగానే 'చం...కౌసల్యా' అన్నాడు. చంద్రం తడుముకోకుండా "ప్రజెంటుసార్" అనేశాడు. క్లాసంతా గొల్లుమంది. "కౌసల్య అంటే నువ్వేనేమిటా చంద్రం!" అన్నారు ఇంగ్లీషు మేస్టారు నవ్వుతూ. చంద్రానికి సమాధానం చెప్పాలని బుద్ధిపుట్టింది. "పిల్లలంతా అలానే అంటున్నారండీ!" అనేశాడు పుటుక్కుమని.

కె. వి. వి. నరసింహారావు, (విజయనగరం)

అజ్ఞాతవాసం

(రెండవ బహుమతి రూ. 5)

నేను, మా మాస్టరు (అంటే చిన్ననాటి క్లాసు టీచరు) కలిసి శనివీద మాకు దగ్గరగాఉన్న దొండపర్తికి బయలుదేరాం. సిటీ బస్సు రాలేదని ఒక రిక్షా ఎక్కాం. రిక్షా పోతోంది. ఇంతలో మా గురువుగారు నాకు, అప్పుడే జరిగిన టీచర్స్ ట్రైనింగ్ పేపరు తాలూకు విశేషాలు చెప్తూ ఒక పద్యం చదివి వినిపించి దీనిలో యతి గణములు ఇలా ఉండాలంటూ ఏదో చెప్తున్నారు.

ఇంతలో రిక్షావాడు, "అయ్యా మేష్టారు మీరు ఏమనుకోకుండా ఉంటే చిన్న మనవి. మీరు చెప్పింది తప్పండి. అది ఫలానా పద్యము కనుక యతి నియమాలు ఉండవండి గణాలు కూడా తప్పు చెప్పారండి" అంటూ తప్పును సవరించాడు.

మాస్టరుగారు తెల్లబోయారు. అయినా నమ్మలేక, రిక్షా ఆపించి, "ఏమోయ్ ఇవన్నీ నీకెలా తెలుసు" అని అడిగారు. అతను తలవంచుకుని, "నేను సెకండరీ గ్రేడ్ టీచర్స్ ట్రైనింగ్ పరీక్షకు వెళ్ళానండి. కానీ పరీక్ష పోయింది. ఉద్యోగం దొరక్క ఈ గతి పట్టింది," అన్నాడు.

మా గురువుగారు తక్షణం ఆ రిక్షా వదిలేసి అతడిని ఏమండీ అని మన్ననచేసి పావలాకి అర్ధరూపాయి చేతిలోపెట్టి, 'మాకన్న మీరే ఘనులు' అంటూ వచ్చేశారు.

ధవళ సన్యాసిరావు, విశాఖపట్నము-4.

రైల్వే సంగీతం

(రెండవ బహుమతి రూ. 5)

తణుకులో రైలు ఎక్కాను. చేసేది గంటప్రయాణమే అయినా సీట్లు ఖాళీలేకపోవడంమూలాన బెర్తుఎక్కి కూర్చున్నాను. అప్పటికే ఒక తాతగారు అక్కడ కూచొనివున్నారు.

రైలుచప్పుడులో ఎవరికీ వినబడదుగదా అని మెల్లగా ఏదో గాలిపాట ప్రారంభించాను. మళ్ళీ ప్రక్క తాతగారికి వినబడుతూందేమోనని ఆయనవంక చూచాను. ఆయన కళ్ళుమూసుకుని మంచి తాళయుక్తంగా తల ఊపుతున్నారు. ఐదునిమిషాలకు వేల్పూరు స్టేషను వచ్చింది. పాట గట్టిగా వినబడుతుందని రైలుచప్పుడుతో పాటు నా పాటకూడా ఆపివేశాను. తాతగారు తల ఊపడంకూడా మానివేశారు. రేలంగి స్టేషనులో కూడా ఇలాగే జరిగింది. 'నాపాట అంతబాగా వుందా!' అని నాగొంతు హెచ్చించాను. అత్తిలి స్టేషనులోకూడా నేను నాపాట ఆపడం, తాతగారు తలవూపు ఆపడం జరిగింది. నాపాటలో మాధుర్యానికి నేను కొంచెం ఉత్సాహం పొందాను. తాతగారిచేత ఇంకా మెప్పుపొందాలని "మంచిలి" స్టేషనులో రైలుఆగినా నేను పాట ఆపలేదు. ఈమాటు కొంచెం గర్వంగా తాతగారివైపు చూచాను. కాని తాతగారు తల ఊపటంలేదు. మరోనిమిషంలో బండి బయలుదేరింది. వెంటనే తాతగారు మళ్ళీ తలవూపడం ప్రారంభించారు. అప్పుడు గ్రహించాను తాతగారు తలఊపుతున్నది రైలుసంగీతానికికాని నా సంగీతానికి కాదని.

ఎ. కె. ఆర్. మూర్తి (హైదరాబాద్).

హరివంశము

శివశర్మ

వ్రజనివాసపర్వం-7

ఇప్పుడు రామకృష్ణులు కొంచెం పెద్దవాళ్ళయినారు. రాముడికి క్రమంగా ఎనిమిది యేండ్లు, కృష్ణుడికి ఏడు యేండ్లు వచ్చాయి. ఈలోగా నందగోపుడు వారిని నిజోచిత వృత్తిధర్మాన్ని అనుసరించి ఆయా పనులలో నేర్పరులను చేస్తూవచ్చాడు. పుట్టువాళ్ళను బుద్ధి తెలిసే యీడు రాగానే నందుడు హరిచేత పచ్చికంచెలు కోయించి, చిన్న చిన్న ముంతలలో అటుకులు పిడికించి సకల యాదవకుల కుల దేవత కోటకేశ్వరీదేవికి నైవేద్యం సమర్పింపచేశాడు. ఊరిమీదపడి వాళ్లు అల్లరులు చేయకుండా పశువులను కాయడము అడవులకు పోయిరావడము మొదలైన పనులలో నియోగిస్తూ వచ్చాడు. పిల్లలు ఈ పనుల మీద తిరగలేక బడలిక చెందినప్పుడు రోహిణీదేవి వారిని ఇంటిలోనే కూర్చోపెట్టి, యదువంశ కథానకాలు, పూరువంశ కథానకాలు గాథలుగా వినిపిస్తోంది. పిల్లలు కథలు వింటూ అల్లరులు తగ్గి మెలగుతున్నారు. రామకృష్ణుల ఈ అల్లరి తగ్గడం వ్రజస్థానంలో విచిత్రమే అనిపించింది. అందరి పిల్లలతో కలిసి ఆలమందలతో అడవులకు పోయినప్పుడైతే ఆ రామకృష్ణుల అల్లరికి వూరు అలగోలంబాలగోలం కాకుండా వుండటం సహజమే. కాని వూళ్లో వున్నప్పుడుగూడా ఇది యేమిటా అని వ్రేతలు, ఆశ్చర్యపోయినారు. క్రమంగా వారికి రోహిణి పిల్లలను మాలిమిచేసి వంశావతారగాథా విశేషాలతో మేను మరచేట్లు చేసి, క్రమశిక్షణను వారికి నూరిపోస్తున్నట్లు తెలిసింది. క్రమంగా వాళ్లు గూడా పనులులేని వేళల్లో. రోహిణి బిడ్డలను శిక్షిస్తున్న సమయంలో నందగోపుని యింటికి రావడం, వచ్చి ఆవిడ చెబుతున్న కథలు వినడం పరిపాటి అయిపోయింది.

రోహిణి కథలు బాగా చెబుతుంది. ఆమెకు యదువుల వీర గాథలు, పూరువంశపురాజుల జీవితవృత్తాలు, కొట్టినపిండిగా వచ్చు. అసలు అదికే పౌరవుల అనుభవించారు! యదువుల యింటికోడలాయె! ఆ చెప్పడంలో ఆవిడ ఒక్కొక్కసారి యదువులను అవహేళనచేస్తూ, పౌరవులను పొగడుతూ, పుట్టినింటివారి ప్రశంసను ఆ బిడ్డల ముందు ప్రకటిస్తూవుంటుంది. బలరాముడికి కోపం వస్తుంది. అతడు తల్లివంక చూస్తాడు. ఆ చూపు నాగలి పట్టి సుండేకాయను లాగుతున్నట్లు వుంటుంది. అది సహజమే. కృష్ణుడికి కోపం వస్తుంది. అది ఎందుకో ఆవిడకు తెలియదు. ఒకరోజున ఆవిడ బిడ్డలకు యయాతి కథ చెబుతూ, యదువును దుష్టుణ్ణిగాను, పూరుణ్ణి ఉన్నతుణ్ణిగాను చిత్రించింది. బలరాముడు మా యదువే గొప్పవాడు; మీ పూరుడు ఏం గొప్పవాడు! అని కినుక చూపించాడు. కృష్ణుడు "ఏమండోయ్! రోహిణీ అమ్మగారు! మీరు యదువు గొప్పవాడు కాదంటున్నారా! అది నిజం కాదు. యదువే గొప్పవాడు. మీ పూరుడు వున్నాడే ఆయన రాజుని పూరుడు కాదుకండీ! మా యదువో, రాజులను గురువులను మనుమడు!" అన్నాడు. "ఓరి! కృష్ణా! నీ కెందుకురా ఈ కోపం! నీకు ఒక వర్ణమంటూ వున్నదా! కులంఅంటూ వున్నదా! పట్టి పశువులకాపరివి" అంటూ ఎకసక్కెం చేసింది రోహిణి. కృష్ణుడు పకపకా నవ్వాడు. "మా వాడికి కులం ఎందుకమ్మా! గోత్రమూను. బంగారుతండ్రి! భగవంతునివంటివాడు" అంది యశోద. కథ వినడానికి వచ్చినవాళ్లు "అవును, అవును, యశోదమ్మా! మీ వాడు భగవంతుడే! వట్టి భగవంతుడు! కాకపోతే ఇన్ని బుద్ధులు ఆ పొట్టలో ఎట్లా పుడతాయి" అన్నారు. అంతా నవ్వుకున్నారు.

బలరాముడు ఒకరోజున రోహిణితో ఇట్లా అన్నాడు: "అమ్మా! ఈ యదువులు, ఈ పౌరవులు తగాదా యెందుకు గాని వీరికి అందరికీ మూలకర్తలయిన ఆదిరాజుల కథలు చెప్పవే!"

"అట్లాగా! నాయనా! సరేలే! మీకు ఈకథలు చెప్పడంలేదట్లే




బ్రూక్ బాండ్ టీ
BROOKE BOND
KORA DUST
TEA
KORA BRAND
Brooke Bond Tea
FINEST
TEA
ఇతర టీలను మించిన మంచి టీ
BB 329 K
బ్రూకి బాండ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్

★ హరివంశం ★

వుంది. యదువంశం, పౌరవులకు గూడా పూర్వుడు చంద్రుడే కదా! అందుకే వీరంతా సోమవంశపు రాజులయ్యారు. ఆ వంశంలో బుధుడు, పురూరవుడు మొదలైన మహాపురుషులు చాలామంది జన్మించారు. వాళ్ళ కథలు చెప్పమంటారా?" అన్నది రోహిణి.

పిల్లలు సరేనన్నారు. పెద్దలకు కూడా ఆ కథలు వినాలని వుంది. వాళ్ళుగూడా ముచ్చటపడ్డారు. రోహిణి వారికి చంద్రోత్పత్తిని గురించి, తారకామయాన్ని గురించి, ఊర్వశీ పురూరవుల ప్రేమగాథను గురించి కథలు చెబుతానంది. ఆది సూర్య, ఆదిచంద్ర వంశాలకువున్న అనుబంధం ఏమిటో చెబుతానంది. అంతా సరే నన్నారు. రోహిణి కథను మొదలుపెట్టింది.

వైవస్వత మనువుకు పిల్లలు త్వరగా పుట్టలేదు. అందుచేత ఆయన మిత్రావరుణులనే దేవతలను ఉద్దేశించి పుత్రకామేష్టి చేశాడు. ఆయన వేల్చిన ఆహుతులను మిత్రావరుణులు స్వీకరించారు గాని, ఆయనకు ఆ దేవతలు పుత్రుణ్ని ప్రసాదించలేదు. మనువు వేల్చిన ఆహుతులవల్ల ప్రజ్వరిల్లిన అగ్నినుండి యజ్ఞధూమం వలద్భ్రమరవేణిగా ఒక్క కన్య పుట్టుకువచ్చింది. ఆ కన్య దివ్యరూపాభిరామ. అమిత దివ్యాభరణ భాసిత. దివ్యాంబరధర. దివ్య సంహనన. మానవి. ఘృతపది. మిత్రావరుణి. ఆమెను చూచి మనువుచాలాసంతోషించాడు. దానికి ఇలఅని పేరుపెట్టాడు. "ఇట్లా రా! తల్లీ!" అని దగ్గరకు చేరదీసి, వాత్సల్యం అంతా చూపించాడు. ఇట్లాఅన్నాడు: "తల్లీ! నేను పుత్రులనుకోరి ఇష్టి చేశాను. వాళ్ళు నిన్ను పుత్రికగా ఇచ్చారు. నా భాగ్యం ఇట్లా వుంది."

ఇల తండ్రిమాటలు విన్నది. ఇట్లా అన్నది. "తండ్రీ! నువ్వు చిరపుణ్యుడివి. నీకు పుత్రులు తప్పకుండా కల్గుతారు. మిత్రావరుణుల అంశంలో పుట్టాను గనుక నేను వారిదగ్గరకే వెడతాను. వారు పరమ తపస్వులు. నన్ను ఏమి చేస్తారో చూస్తాను. వారి దగ్గరకు పోవడం నాకు ధర్మంకదా!"

మనువు అంతకంటే ధర్మం లేదన్నాడు. ఇల మిత్రావరుణుల దగ్గరకు బయలుదేరింది.

వారు ఇలను చూచి ఆశ్చర్యపడనూ లేదు; వడకపోనూ లేదు. ఆమె వారికి వినీతురాలై కేలు మొగిడించి నమస్కారం చేసింది. ఒక ప్రక్కగా నిలబడి "నేను మీ అంశంతో జన్మించినదాన్ని. ఇలను. మానవిని. మీకు నావలన ఏమి పనులు జరుగవలసి వున్నవో, ఆదరముతో చెప్పండి. చేస్తాను," అంది.

మిత్రావరుణులు చాలా సంతోషించారు. "అమ్మా! నీవు ధర్మశీలవు. ఈ బుద్ధి, ఈ సత్యము, ఈ వినీతత, ఇతర కన్యలలో ఎక్కడా చూడము. నీ విధం మా మనస్సుకు మెచ్చు కొలిపించింది. నీవు మాకు కూతురవు అయినావు. కాని ఇక మనుకులాన్ని వెలయజేసే పుత్రుడవు కావలసివుంది. నీవు పురుషుడివి కాక తప్పదు. అవుతావు. అప్పుడు నిన్ను అంతా సుద్యుమ్నుడు అంటారు. అప్పుడు పరమ ధర్మపరత, లోకప్రియకారిత్వము, సర్వ సమర్చనీయత, నీయందు అమరి నిన్ను అధిక యశోవిజృంభితుణ్ని కావిస్తాయి. ఇక వెళ్ళు. ఆ వైవస్వత మనువును ఆదరించు" అని దీవించి పంపించారు.

ఇల మళ్ళీ మనువు దగ్గరకు బయలుదేరింది. దారిలో ఆవిడకు బుధుడు ఎదురుపడ్డాడు. ఆ బుధుడు పరమసుందరుడు. చంద్రుడికి, తారకు పుట్టాడు. ఆ అందగాణ్ణిచూచి ఆమె మోహించింది. ఆ అందగాడు ఆమెను కామించాడు. ముందు మనస్సులు కలిసి తర్వాత వారి శరీరాలు కలిశాయి. వారికి ఐలుడనే పుత్రుడు కల్గాడు. ఆ ఐలుడే పురూరవుడు. ఈ పురూరవుడికి ఊర్వశియందు ఆయువు, అసమాయువు, దృఢాయువు, వనాయువు, శతాయువు—పుత్రులు జన్మించారు. వారిలో ఆయువుకు నహుషుడు పుట్టాడు. నహుషుని పుత్రుడు యయాతి.

ఇంతవరకు చెప్పి రోహిణి పూర్వం తాను వారికి చెప్పిన యయాతి కథలోని అంశాలు జ్ఞాపకంచేసి—"ఆ యయాతి శుక్రుని కూతురు దేవయానిని, వృషపర్వుని కూతురు శర్మిష్ఠను పెండ్లి చేసుకున్నాడు. దేవయానికి యదువు పుట్టాడు. మా మెట్టిన ఇంటి వారి వంశము ఆయనదే. శర్మిష్ఠకు పూరుడు పుట్టాడు. మా పుట్టినయింటివారి వంశకరుడు ఆయనే" అంది.

రామకృష్ణులు, తక్కింగల శ్రోతలు ఇలోత్పత్తి కథ విన్నారు. వారికి ఇల సుద్యుమ్నుడు కావడం, బుధుడు ఆమెను పొందడం, మొదలైన వృత్తాంతాలు పరమ అద్భుతాలుగా కన్పించాయి. బలరాముడు ఒక ప్రశ్న వేశాడు: "మనువు సూర్యవంశం వాడుకదా! అతనివంశం సుద్యుమ్నుని వల్లనే విస్తరించిందా?" అని. "మాతండ్రీ! అదా నీ అనుమానం. లేదు. విస్తరించలేదు. ఆ తర్వాత మనువుకు తొమ్మిదిమంది కొడుకులు పుట్టారు. వారిలో ఇక్ష్వాకుడు పెద్దవాడు. అతని పేరుమీదుగానే ఇక్ష్వాకువంశం ఏర్పడింది. ఇలా కన్య మగవాడైన తర్వాత సుద్యుమ్నుడై రాజ్యం ఏలడం జరిగింది. వైవస్వతుడు ధర్మశాస్త్రాన్ని, పుత్రులకు చెప్పి, రాజ్యాన్ని దిద్ది, మార్తాండలోకానికి వెళ్ళిపోయినాడు. ఆ తర్వాత వశిష్ఠుడు మనుపుత్రులకు, సుద్యుమ్నుడికి రాజ్యం పంచిఇచ్చాడు. ఇక్ష్వాకుడికి మధ్యదేశం వచ్చింది. సుద్యుమ్నుడు ప్రతిష్ఠాన నగరాధిపతి అయినాడు. చాలాకాలందాకా మా పౌరవులకు ఈ నగరమే రాజధానిగా వుంటూవచ్చింది. ఆ తర్వాత ఎప్పుడో మావాళ్ళు ఇప్పటి హస్తినాపురాన్ని కట్టుకున్నారు. ఇంతకు మీకు సుద్యుమ్నుణ్ణిగురించి కదా కావలసింది? ఆ సుద్యుమ్నుడు ప్రతిష్ఠాన పురాధిపతి కాకముందు ఉత్కలుడు, వినతాశ్వుడు, గయుడు అతని పుత్రులుగా ప్రభవించారు. వీరిలో ఉత్కలుడు ఉత్కలవిషయానికి కర్తఅయినాడు. గయునివల్ల గయాభూమి ఏర్పడింది. వినతాశ్వుడు పశ్చిమధరణీపతి అయినాడు ఆ తర్వాతనే సుద్యుమ్నుడు ప్రతిష్ఠాన పురాధిపతి అయినాడు. అప్పుడు తిరిగ అతనికి తనతొంటి ఆడరూపు వచ్చింది. అప్పుడు ఇల తనకు బుధునివలన కల్గిన పుత్రుణ్ణి పురూరవుణ్ణి రావించి, అతనికి ఆ పురవరాధిపత్యం సమర్పించింది. మావాళ్లు ముందు ప్రతిష్ఠానపురవరాధిపతులైంది ఇట్లాగే" అని రోహిణి చెప్పగా అంతా సంతోషించారు.

అంతవరకు విని కృష్ణుడు రోహిణివైపు కొంటెగా చూశాడు. "అవును కానీండి! రోహిణీ అమ్మగారు! మీవాళ్ళు ప్రతిష్ఠాన పురాధిపతులు కావడం ఏమిటి? మనవాళ్ళనంటే సరిపోతుంది. అప్పటికి మీ పూరుడు ఇంకా పుట్టనేలేదుగా!" అన్నాడు. అంతా నవ్వారు. "ఓరి! చిన్నతండ్రీ! ఎంత ఆలోచనవుందిరా నీకు! అందుకే మీ అమ్మ అప్పుడప్పుడు నిన్ను రోళ్ళకు కడుతూ వుంటుంది" అంది రోహిణి. యశోదకు కళ్ళనీళ్ళు గిఱ్ఱున తిరిగాయి. అందరికి ఒక్కసారి యమళార్జున భంజనం వృత్తాంతం జ్ఞాపకం వచ్చింది. అంతా ఒక్కసారి ఆ అద్భుతశిశువువంక చూశారు. ఆ శిశువు చిన్న నవ్వు నవ్వి "సరే కానీండి! అమ్మగారు! తార అన్నారే బుధుడికి తల్లి, ఆవిడ కథ చెప్పండి" అన్నాడు.

"పోరా! కొంటె!" అని రోహిణి నవ్వింది. ★

సుభద్రా సదన్

సౌభద్ర

(గతసంచిక తరువాయి)

ప్రకాశం ఐదవసంవత్సరం పరీక్షలు అయిపోయాయి. అన్ని ప్రశ్నపత్రాలు బాగా వ్రాశాడు.

మద్రాసు పోయే మెయిలు నాల్గవ ప్లాటుఫారంమీద నిలబడి వుంది. తినుబండారాలమ్మేవాళ్ళు వాటి పేర్లకు కొత్త ధ్వనులిచ్చి పలుకుతున్నారు. జీడిపప్పువాడు 'కేడీటీవ్' అంటున్నాడు. వేడ తీసుకుని వేడినీళ్ళని 'టీ' గా అమ్ముతున్నాడు రైల్వే టీ స్టాల్ వాడు. రైల్వే గుమాస్తాలు, టిక్కెట్టులేకుండా ప్రయాణించే ముష్టివాళ్ళు, ప్లాటుఫారాలు పడకగా వుంచుకునే కుష్ఠువాళ్ళు వీళ్ళతో నిండివుంది ప్లాటుఫారం.

'హలో! ప్రతిమా - మీరుకూడా వస్తున్నారా యీ బండికి?'

'అవును మిస్టర్ ప్రకాశం! మీరూ యీ బండికే ప్రయాణమౌతున్నారని చెప్పారుగా నిన్న?'

ప్రతిమసామానులు బండిలో వుంచడానికి సాయంచేశాడు ప్రకాశం. ప్రకాశం ప్రతిమలను సాగనంపటానికి వారి మిత్రులు కొంతమంది స్టేషనుకు వచ్చారు. సరిగా రైలు బయలుదేరబోయే సమయానికి రమాకాంతం చెమటలు కక్కుతూ రెండు పూలదండలు పట్టుకువచ్చి ఒకటి ప్రకాశం మెడలో వేసి మరొకటి ప్రతిమ చేతికిచ్చాడు.

"ఏమిటీ పిచ్చిపని రమాకాంతం!"

"నీకు తెలియదులే ప్రకాశం! చాలా ఉత్కృష్టమైన ఉద్దేశంతో తెచ్చానివి,- నేను రేపు బండికి వెళ్ళిపోతాను. నువ్వు వెళ్ళగానే మీ అమ్మగారి ఆరోగ్యం బాగున్నట్లు ఉత్తరం వ్రాయి." ప్రకాశం చేతులు ఆప్యాయంగా పట్టుకుని అన్నాడు రమాకాంతం. "ఐదు సంవత్సరాలు అన్యోన్యంగా మసిలాము. విడిచివెళ్ళిపోతూవుంటే దిగులుగావుంది ప్రకాశం. మనకింక విద్యార్థిదశ దాటి, బాధ్యత శికలకు చుట్టుకుంటున్నందుకేదో భయంగావుంది."

"రైలు స్టేషనులో ఆగేప్పుడు యాత్రికులు దిగుతూ వుంటారు. అయినా ఆ కించిత్కాలంలో జరిగిన సాంగత్యం-వియోగంలో విషాదం తోపింపచేస్తుంది. రైలు మాత్రం తన యాత్ర సాగిస్తూవుంటుంది" నిట్టూర్పు విడుస్తూ అన్నాడు ప్రకాశం. "జీవనయాత్రా అంతే రమాకాంతం-ఇలాటివి మనం భరించడానికి సిద్ధంగావుండాలి."

పెద్ద హోరుతో అదిరి విడిచి, బయలుదేర సిద్ధమైంది యింజను. గార్డు యీలవేశాడు. రైలు కదిలింది.

ప్రతిమా ప్రకాశాలవద్ద సెలవు తీసుకున్నారు పరమేశం వగైరా మిత్రులు.

కనబడే కాల్టెక్స్ రిఫైనరి, హిందుస్తాన్ షిప్ యార్డు, పోర్టు దూరం కాసాగాయి. అంతర్జాతీయ ఖ్యాతిగల యీ విశాఖపట్టణం ప్రత్యక్షంగా లోపభూయిష్టమైవుంది.

విదేశీయుల తాకిడి ఎక్కువ కావటంవల్ల హోటళ్ళు, భోజనం అన్నీ ధర ఎక్కువ. సామాన్యమానవుడు గంజితాగి గాబర్డీను పాంటు ధరిస్తాడు-రోడ్లమధ్య మురుగు కాల్వలు ప్రవహిస్తూంటాయి. సముద్రపు టొడ్డు బీచ్ ఒక పాకీదొడ్డి. అరవ కుష్టురోగులు, ముష్టివారు బిచ్చంకోసం ప్రజల నడ్డగించి రోడ్లమీద విచ్చలవిడిగా నడుస్తారు. విశాఖపట్నంవాసులకు యిరుగుపొరుగులు తెలియనంత అనైక్యత.

అపఖ్యాతి అధికంగాకల విశాఖపట్నం క్రమంగా దూరానకొండల్లోకలిసిపోయింది.

టెలిగ్రాఫ్ స్తంభాలు, పొలాలు వేగంగా వెనక్కు వెళ్ళిపోతున్నాయి. ప్రకాశం కిటికీలోనుండి ప్రకృతినిచూస్తూ ఆలోచిస్తున్నాడు.

Mayor of Castor Bridge చదువుతున్న ప్రతిమ తలెత్తిచూసి ప్రకాశాన్ని పలుకరించింది.

"మీ మనసప్పుడే యింటికి వెళ్ళిపోయినట్లుందే ప్రకాశంగారూ?"

"అవును ప్రతిమాదేవి వెళ్ళిపోయింది. చాలాకాలమయ్యింది అమ్మనుచూసి. మీకు వింతగా వుంటుందేమో ప్రతిమాదేవీ! ఒక్కసారి మనసారా అమ్మ తన కోమలకరంతో తలనిమిరితే నా మనస్సు తృప్తితో నిండిపోతుంది—మంచి మందులు తీసుకు వెళ్తున్నాగా- యీ అవకాశంకోసం ఎన్నాళ్ళు నిరీక్షించాన్నను!— మా అమ్మ ఆరోగ్యం యిక నేనే చూసుకుంటాను. బ్రతుకిచ్చి, మనసిచ్చి, మనిషిగాచేసిన మా అమ్మకు సేవ చేసుకుంటాను."

"మీ నాన్నగారికింక విశ్రాంతి నివ్వాలి మీరు"

"నిజం—ప్రతినిముషం విలువకట్టి కొడుకుని చదివించుకున్నారాయన—ఎందుకో—యీ రోజు అంతా మీతో చెప్పాలని పిస్తూ వుంది. వాళ్ళిద్దరి సేవా చేసుకోవటమే నా జీవిత పరమావధి—అంతకుమించి నేను కోరే సుఖమేదీ లేదీ ప్రపంచంలో" పెద్ద చప్పుడు చేసుకుంటూ చిన్నస్టేషను దాటిపోతూంది మెయిలు.

"ఇదుగో ప్రతిమాదేవీ! ఈ బట్టలు చూడండి—నేను విద్యార్థిగావుండి కూడబెట్టిన డబ్బుతో నా జీవితంలో మొదటిసారిగా పెద్దవిలువకు నా తలిదండ్రులకు బట్టలు కొన్నాను." కళ్ళుచెదరే చీర, రవికలగుడ్డ, సిల్కు కండువా, పంచె!—పెట్టెలోనుంచి తీసి ప్రతిమకు చూపాడు ప్రకాశం. వాని అడుగున పరీక్షలకు ముందు తనకు తండ్రివ్రాసిన ఉత్తరం కనపడింది. అదితీశాడు ప్రకాశం.


"చాలా బాగున్నాయండి. మీ తలిదండ్రులు చాలా అదృష్టవంతులు" అంది ప్రతిమ చిరునవ్వు నవ్వుతూ.

"ఏమిటో నా విషయాలు చెప్పి విసిగిస్తున్నాను కాని మిమ్మల్నేమీ అడగటంలేదు" అన్నాడు ప్రకాశం—ఉత్తరం పైనవుంచి బట్టలు లోపలపెడుతూ.

"నావిషయానికేముంది. అంత వింత, ఉత్సాహం—ఏమీ లేవు. కాని యీ పట్నవాసం వదలి పల్లెలకు పోవాలని వుంది ప్రకాశంగారూ!"

"అంటే?"

"మనం ప్రతిచోటా చూస్తున్నాము. సామాన్య మానవుణ్ణి, బీదల్ని పీడిస్తూ పట్టాలు పుచ్చుకున్న డాక్టర్లు చేసే వైద్యం. పైగా పట్నాలు మురికి, మోసం, అన్యాయం—వీటితో నిండి అసహ్యాన్ని కలిగిస్తున్నాయి



నాకు. అవన్నీ మక్కా లోకలు—పల్లెలయినా బాగుచేసి, అక్కడి ప్రజల ఆరోగ్యం బాగుచేస్తే దేశసేవ చేసినట్లయినా వుంటుం దని నా వుద్దేశం" అంది ప్రతిమ.

"అభినందనలు, చాలా మంచి ఊహ" అన్నాడు ప్రకాశం.

ఎంత ఉన్నత భావాలు! భావాల కను గుణంగానే సౌందర్యం! తన పరీక్షలకు ముందు తండ్రి వ్రాశాడు—"

"అమ్మకు కులాసాగావుంది. నిన్ను చూడాలని వున్నదంటూ వుంది. ఇంకో రెండు నెలలవరకూ ఆమె పూర్తిగా పడక మీద విశ్రాంతి తీసుకోవాలట. ముద్దుక్రిష్ణ రోజూ వచ్చి నీకు బదులుగా కబురు చెప్తూ వుంటాడు. నీ చేతిమందు త్రాగితేనే తిరిగి ఆరోగ్యవంతురాలనవుతానంటూవుంటుంది. అంత నీరసంగావున్నా — నీ గది, పుస్తకాలు, ముద్దుక్రిష్ణసాయంతో సద్దుతూ వుంటుంది. 'డాక్టరు బాబు' గది శుభ్రంగా వుండాలట.

నేను బంధువులకు చేసిన సహాయం వ్యర్థమయ్యింది. కాని మీ అమ్మ సహాయము పొందిన యిరుగుపొరుగు లందరూ అను క్షణమూ వచ్చి ఏదో పనిచేసిపెట్టి పోతూ వుంటారు. వారిలో ఒకరికి మరొకరితో విరోధం. అయినా మీ అమ్మంటే మహా ప్రేమ. గుడిపోలయ్య మొదలైన ఆమె పోషితులందరూ 'మా లచ్చిమ'ని కీర్తిస్తూ వుంటారు. మీ అమ్మ శీలం నేను వర్ణిస్తున్నాను. చూడు మీ అమ్మ గొప్ప—! ఇవన్నీ వేరు — ప్రతి రోజూ తెల్లవారు జామున రెండు చేతులు నా పాదాల్ని స్పృశిస్తూవుంటాయి. కనులు విప్పి చూశాను —మీ అమ్మ నా పాదాలు కనుల కద్దుకుంటూవుంది. అప్పుడు మీ అమ్మలో భగవంతుణ్ణి చూశాను. భగవంతుడంటే వ్యక్తిలోని కారుణ్యమనే నా వుద్దేశం. నేను గ్రహించాను ప్రకాశం—మీ అమ్మ విలువ నా కన్న ముందు నీవే గుర్తించావని—

నే నేమైనా అన్యాయం చేశానేమోనని చాలాసార్లు చింతించేవాడిని. ఒక రోజు అడిగాను దగ్గరకూర్చుని. 'నీకు నేనేమీ సుఖం కలిగించలేకపోయాను. ఏమైనా చేయుగలనా?" అని.

"మీ రలాంటిదిగులు పెట్టుకోకండి. నేను అన్ని సౌకర్యాలూ పొందాను. జీవితంలో నా కింక కోరిక లేమీ లేవు." అంది. భగవంతుడికి నేను నమస్కారం చేశాను.

నీ పరీక్షలైరాగానే పెళ్ళి చేసెయ్యాలని పట్టుబడుతూ వుంది. అమ్మాయికూడ పెద్ద చదువు చదువుతూందట. ఇది బంగారయ్య గారు చూసిన సంబంధం. అమ్మాయి ఫోటో చూపాను మీ అమ్మకు. నన్ను దగ్గరకు పిలిచి.

"ఈ అమ్మాయిని మీరు మన ప్రకాశానికిచ్చి తప్పక పెళ్ళిచేయండి"లంది నేను ఫోటో చూశాను–మీఅమ్మ తన కుమారుడికోక దేవకన్య నేరుకుంది! బహుశ–నువ్వింతవరకూ అంత అందమైన అమ్మాయిని చూసివుండవు. మనసుకూడా అందమైనదికావాలని ప్రార్థించాను భగవంతుణ్ణి. ఆఅమ్మాయికూడా విశాఖపట్నంలోనే చదువుతోందట. ఆమెకు వాళ్ళవాళ్లు మన సంబంధం గురించి వ్రాశారు.

మీ అమ్మ నీ రాకతో పూర్తి ఆరోగ్యం

సుభద్రా సదన్

కోరి మమ్మల్నందర్నీ సంతోష పెడుతుందనుకుంటాను.

నాకు పనిమీద విసుగు, విశ్రాంతి మీద భ్రాంతి పుట్టాయి. నీవు అన్నివిధాలా తృప్తినిస్తావ అనుకుంటున్నా. బంగారయ్య గారు నా ఉత్తరంలోనే నీ కోర్కెలు తెలుపుతున్నారు.

—కిరీటి—"

అమ్మాయి విశాఖపట్నంలోనే చదువుతూండట. సుందరట! ప్రతిమకంటె సౌందర్యవతా!! ఒకవేళ—ప్రతిమే నేమో! బంగారు రంగుచేతులు! ఆమె శస్త్రచికిత్స చేసేప్పుడు తదేకదృష్టితో చూసేవాడు. ప్రతిమ తన అర్ధాంగి అయితే ఎంత బాగుండును! ఇద్దరూ కలిసి ప్రాక్టీసు పెట్టవచ్చు. తనతల్లి అన్నివిధాలా సుఖిస్తుంది. ఏ శిల్పి చెక్కి జీవం పోశాడీ విగ్రహానికి! తనూ, తన అర్ధాంగి తలిదండ్రులకు విశ్రాంతినివ్వాలి. చిగురించిన తన కోరికలు పుష్పించాలి. అప్పుడు జీవితం ఎంత మధురం!

ఈ విధంగా తలపోసి మునిగిన ప్రకాశం ఒంటిమీద మెత్తని చెయ్యి పడింది. కళ్ళు తెరచి చూస్తే చిరునవ్వు నవ్వుతూ ఎదుట ప్రతిమ నిలబడి వుంది.

"నిద్రపట్టింది మీకు! మని వచ్చింది. కాఫీ తీసుకుందాం. ముఖం, చేతులూ కడుక్కోండి" అంది.

సాయంత్రం తన స్టేషను వస్తూంటే ప్రకాశం కిటికీలోంచి వంగి చూడటం మొదలు పెట్టాడు ఏదో హృదయంలోని తీపి మౌనరాగాలు తీయిస్తోం దతనిచేత. ప్రతిమ ప్రకాశాన్ని చూసి నవ్వుకుంది.

"ఇప్పుడింటికి వెళ్ళి, మీ అమ్మగార్ని వంక పెట్టుకోమనేట్టున్నారే మీరు!—మరీ చంటిపిల్లలయిపోతున్నారండి ప్రకాశం గారూ."

ప్రకాశం సిగ్గుపడి కూర్చున్నాడు. తిరిగి అతను తలెత్తి చూసేసరికి నీళ్ళు నిండిన నేత్రాలతో చూస్తూ వుంది ప్రతిమ

"అదేమిటి! ప్రతిమా దేవీ!" అన్నాడు ప్రకాశం.

"ఆరోజు మిమ్మల్ని అవమానించాను. బరువెలా తీర్చుకోవాలో తెలియటం లేదు. కాని, అప్పట్నుంచే ఏదో ఫీలవుతున్నాను.—ఆ రోజు నా తెలివి తక్కువ పనికి క్షమించారా! ప్రకాశం గారూ!"

"ఓస్! ఇంకా అది మనసులో పెట్టుకు కూర్చున్నారుటండీ. నే నప్పుడే మర్చిపోయా నావిషయం." అన్నాడు ప్రకాశం నవ్వుతూ.

"నన్ను మరచిపోతారా!" అంది ప్రతిమ. మళ్ళీ కనుకొలకుల్లో నీళ్ళు నిలిచాయి.

"ఎలా మరచిపోతాను! నాయింటి విషయాలన్నీ ఆప్యాయంగా అడిగి, నాపట్ల యింత శ్రద్ధచూపిన మిమ్మల్ని మరచిపోతే నన్ను నేను మరచిపోయినట్టే." అన్నాడు ప్రకాశం.

రైలు స్టేషనులో ఆగింది. కూలీని పిలిచాడు ప్రకాశం.

"మీ కభ్యంతరం లేకపోతే-మాయింటికి వచ్చి మా అమ్మ నొకసారిచూసి వెళ్ళమని కోరుతున్నాను."

"క్షమించండి. ఆ అదృష్టం తరువాత కలిగించుకుంటాను. సెలవు"

ప్రకాశం ప్లాటుఫారంమీదకు దిగాడు.

"ఈ బత్తాయిలు మీ అమ్మగారికి నా ప్రార్థనగా సమర్పించండి." కిటికీలోనుండి బత్తాయిలబుట్ట అందిస్తూ అంది ప్రతిమ.

"ఎంత ప్రేమ ప్రతిమావి! మీకు మా అమ్మంటే."

"అది నా అదృష్టం."

రైలు కూతపెట్టి మోతతో బయలుదేరింది. అభినందనలూ, కరచాలనమూ రైలుతోపాటు క్రమంగా దూరమయ్యాయి ప్రకాశానికి.

తనకోసం ముద్దుక్రిష్ణ స్టేషనుకి వచ్చాడేమోనని చూశాడు ప్రకాశం. రాలేదు.

"జట్కా ఎయ్యమంటారా బాబూ!"

కావాలని తలవూపాడు - జట్కావాడు సామాన్లు తీసుకుని బయటకువెళ్ళాడు. గేటువద్ద టిక్కట్టు యిచ్చి జట్కా దగ్గరకు వచ్చాడు. ప్రకాశం జట్కాలో ఎక్కగానే 'ఛళ్ళు'మన్న దెబ్బతో గుఱ్ఱం పరుగెత్తింది.

ఎన్నాళ్ళకు చూడగలుగుతున్నాడు తన వూరిని - ఇక నిత్యం గుడిపోలయ్య మధుర తత్వాలు వినవచ్చు-అటంబాంబులకి హడిలే క్రిష్ణవేణమ్మత్తయ్యగారి రోదనం విని నవ్వుకోవచ్చు.

తన వూరెంతమంచిది. ఏమిటో యీ మమత. పదాలుపాడుతూ రోడ్డంటనడిచేవడు చుల్ని దాటింది బండి. వారెంత నిర్మల హృదయులు! ఈ అమాయకత్వం, నైర్మల్యం పట్టణవాసుల కెలావస్తాయి.

తెల్లకొంగలు బారుగా ఎగురుతున్నాయి. బంగార మందించిన పంటపొలాలు, తీరకగా సూర్యకిరణాలను మింగడానికన్నట్లు నోళ్ళు విచ్చుకున్నాయి. దూరాన పాలేళ్ళు పశువుల్ని మళ్ళిస్తున్నారు. అస్తమయసూర్యుడు అరుణిమ పులుముకొన్నాడు.

ఊరు సమీపిస్తున్నకొద్దీ ప్రకాశానికి కాత్రుత హెచ్చుతూవుంది. గుఱ్ఱం వడిగా పరుగెడుతున్నా రోడ్డు ముందుకొస్తున్నట్టుంది. అదిగో దూరాన మఱ్ఱిచెట్టు! గుడిపోలయ్య తత్వాలు వినపడడంలేదేమి చెప్మా. అదుగో తనయిల్లు దూరాన! [illegible] లలో తన తల్లిని చూడగలడు. బామ్మగారు అరుగుపైనుంచి తొంగి చూస్తూ వుంది. నవ్వుతూ నమస్కరించాడు తను. అరె! అదేమిటె! మాట్లాడకుండా లోపలకు వెళ్ళిపోయింది! గుర్తుపట్టనంత మారిపోయాడా తను!

గుఱ్ఱం వగరుస్తూ ప్రకాశం యింటిముందాగింది.

బండిలోనుంచి క్రిందికురికి, తన లెదరు సూటుకేసు తీసుకుని లోపలకు వెళ్ళాడు ప్రకాశం.

బంగారయ్య, మాలక్ష్మమ్మ, ముద్దుక్రిష్ణ, జగన్నాథరావు, కిరీటి కూచుని వున్నారు. ఒక్కరిముఖమూ ఆహ్వానిస్తున్నట్టు లేదు. ఎదురుగా తల్లిమంచం కనబడింది.

కిరీటిని చూసి ఉత్సాహంగా అడిగాడు ప్రకాశం.

"ఫస్టుక్లాస్, టానిక్సూ మెడిసిన్సూ తెచ్చా నాన్నగారూ. అమ్మేది?"

హాలంతా నిశ్శబ్దాన్ని జవాబిచ్చింది.

"ఎవరూ మాట్లాడరు. అమ్మెక్కడ."

కిరీటి వణుకుతున్న చేయి పైకి లేచి వ్రేలితో గోడమీది సుభద్రాదేవి ఫోటోను చూపింది.

"అమ్మ"—ప్రపంచాన్నంతనీ బ్రద్దలు చేసినంత అరపువచ్చింది. చేతిలోని లెదరు సూటుకేసు జారి ప్రకాశం పడిపోయాడు. కిరీటి, బంగారయ్యలు ప్రకాశాన్ని పట్టుకున్నారు. ముద్దుక్రిష్ణ పరుగునవెళ్ళి నీళ్ళు తెచ్చి ప్రకాశం ముఖాన జల్లాడు.

సూటుకేసు మూత తెరచుకొని—బయటపడిన మందుసీసా బ్రద్దలై నేలంతాపారింది. విలువైనచీర జరీఅంచు మిలమిల మెరుస్తూ వుంది.

ప్రకాశం కళ్లు తెరచి లేచాడు. ఎదురుగా తల్లికొయ్య కనపడింది. అతనికి దుఃఖం ముంచుకువచ్చింది. కళ్లవెంబడి గోదావరి ప్రవహిస్తూంటే తల్లి శూన్యశయ్యని సమీపించాడు.

"అమ్మా! నాకు దర్శనమైనా యివ్వకుండా వెళ్ళిపోయావా అమ్మా!" మరి—నీ పిచ్చినాన్న—ప్రకాశం వచ్చాడమ్మా" అతనికి వెక్కివెక్కి ఏడుపు, ఏడుపులోంచే నవ్వుతూ అన్నాడు. "ఒకసారి వచ్చి చూడమ్మా నీప్రకాశాన్ని. నీప్రకాశం పెద్ద డాక్టరమ్మా! పెద్దపెద్ద బహుమతులు సంపాదించాడమ్మా! నీకోసం మంచి మందులు తెచ్చాడమ్మా!... అమ్మా...నిన్ను కళ్ళారా చూడాలని గంపెడాసతో వచ్చానమ్మా!...... ఒక్కసారి నీముద్దుబిడ్డ ప్రకాశానికి కనపడవమ్మా నీకోసమే బ్రతికిన నీ కన్నకొడుకు వచ్చాడమ్మా; ఒక్కసారి నీపాదాలు కళ్ళకద్దుకో నీయవమ్మా!... అమ్మా!..." గొల్లున ఏడ్చే ప్రకాశం భుజంమీద చెయ్యివేసి,

(47 వ పేజీ చూడండి)

సరళ — సుశీల

వి. యల్. రాధ

"హల్లో, పాణీ! కాలిక్యులస్ బుక్ ఇస్తారా" అంటూ సరళ చక్రపాణిని అడిగింది కాలేజీ ఆవరణలో.

"ఓ తీసుకోండి. కాని రెండు రోజుల్లో తిరిగివ్వాలిసుమా" ఇచ్చాడు పాణి.

సరళ వెళ్ళిపోయింది ఇంటికి...తీరిగ్గా ఎనిమిది గంటలకు కూర్చుని నోట్సు వ్రాసుకుంటోంది. ఎందుకో అప్రయత్నంగా ఒకసారి నోట్సు తిరగేసింది. 'టప్' మని ఒక కవరు క్రింద పడింది. ఛీ! ఈ మగవాళ్ళెప్పుడూ ఇంతే. ఆడవాళ్ళంటే ఎంత చులకన! నోట్సు కావాలంటే అందులో 'లవ లెటర్' పెట్టిచ్చాడు' అని చీదరించుకుంది. ఇదివరకు చక్రపాణిమీదున్న గౌరవమంతా కర్పూరంలా హరించుకుపోయింది. సందిగ్ధావస్థలో పడింది. ఈ లెటర్ చూడనా వద్దా? పైన అడ్రస్ లేదే. నోట్సు నాకే ఇస్తున్నాడు గనుక నా అడ్రసింక వ్రాయటం యెందుకనుకున్నాడేమో. అయినా ఈ లెటర్ నాదేనని ఎందుకనుకోవాలి. పాణికి ఎవరైనా వ్రాసిందేమో. అయితే అడ్రసు ఎందుకు వ్రాయలేదు...చదివితే సభ్యతగా ఉండదేమో...అయినా ఇప్పుడెవరు చూడటం లేదుగా. సరళ చదవటానికే నిశ్చయించుకుంది.

"డియర్ సుశీలా,

మీరు వ్రాసిన ఉత్తరం అందినది. కాని మీరు వ్రాసినట్లు శనివారం పిక్చరుకు రాలేను. క్షమించండి. సోమవారం అయితే కాస్త వీలుగా ఉంటుంది. కావున సోమవారం పిక్చరుకు వస్తారని ఆశించుచున్నాను. మీ సర్వ్యా దక్షకే కలయిక.

మీ పాణి"

సరళ ఒక్కసారి నిశ్చేష్టురాలయింది. ఏమిటి ఈ ఉత్తరం! సుశీలకు! వ్యవహారము చాలవరకు వచ్చినట్లు కనబడుతుందే. సుశీల! తన క్లాస్ మేట్! ఈ మాట తనతో మాటైనా అనలేదే. మగవాళ్ళంటేనే అసహ్యించుకొని అవతలకు పోయే సుశీల చక్రపాణితో ప్రేమ కలాపాలా. ఎంత నటన! చక్రపాణిని గ్రద్ద తన్నుకుపోయినట్లు తన్నుకుపోతాననుకుందేమో...అసలు ఈ ఉత్తరం ఈ పుస్తకములోకి ఎట్లా వచ్చింది? పాపం చక్రపాణి పోస్టుచేశాననుకున్నాడు గాబోలు. అనుకోకుండా ఈ ఉత్తరం తనచేతిలో పడింది. సోమవారం అంటే ఎల్లుండేగా...చక్రపాణి సుశీల పిక్చరుకు వస్తుందని వెళ్తాడు గాబోలు. ఉత్తరం పోస్టు చెయ్యలేదని జ్ఞాపకం ఉంటేగా. సుశీల చక్రపాణి దగ్గరనుండి ఉత్తరం రాలేదని తహతహలాడుతున్నది గాబోలు. ఈ సంగతి సుశీలకు తెలీదుగా. నేను పిక్చరుకువెళితే సోమవారం? ఛీ! చక్రపాణితో నేనెందుకు? ఏం ఎందుకు వెళ్ళకూడదు? సుశీలకున్నంత ధైర్యము తనకు లేదా! సుశీల చక్రపాణిని ప్రేమిస్తున్నప్పుడు తనెందుకు ప్రేమించకూడదు? చక్రపాణి అందగాడు కాడా?" సుశీలకు అన్యాయం చేసినదవుతుందేమో... ఈ రోజుల్లో న్యాయాన్యాయాలతో పనేమిటి? ఎవరికివారు సుఖంగా ఉండటమే కావలసింది. ఇంతకీ చక్రపాణి తన్ను నిరాకరిస్తే? ఎందుకు నిరాకరిస్తాడు? సుశీలకంటె ఎందులో తక్కువ? ఆస్తిలోనా? చదువులోనా? అందంలోనా? సుశీల ఎంతనాటకమాడుతున్నది?

అంతే. సరళ సోమవారం చక్రపాణివచ్చే వేళకు సినిమాకు వెళ్ళాలనుకుంది...

సరళా, సుశీలా, పాణి ఒకే క్లాసు. ఆ క్లాస్ లో నేగాదు, కాలేజి అంతటికే అందమైనవారెవరూ అంటే ప్రతివాళ్లు సరళా... సుశీల అని అంటారు.

సుశీల కలవారిఅమ్మాయి. చూట్టానికి చాల అందంగా ఉంటుంది. అసలు సుశీల హిందీ సినిమాఫీల్డులో ఉండాల్సిన అమ్మాయి అని చాలమంది అంటూంటేవారు. బంగారులో పరితూగే శరీర ఛాయ, శిరీష కుసుమం లాంటి సుకుమార శరీరం. అటు కోలా, గుండ్రము గాని మొహానికి అతి నేర్పుగా అమర్చబడి సన్నజాజిపూవేమో అన్నట్లుండే నాసిక, విశాల నేత్రద్వయం, రెండుజెడలు ఆమెకో ప్రత్యేక శోభ నిచ్చేవి. ఉల్లిపొర కంటె పల్చగా, సొగసుగా భుజాలపై కప్పుకొన్న షిఫాన్ఓణి, మోచేతుల వరకు వచ్చేట్టు జాకెట్టు, నేలనంటి పెట్టుకుని జీరాడుతుంటె జార్జెట్ సిల్కు పరికిణీతో ముస్తాబై కాలేజికి వస్తూంటే, 'మందగమన మరాళి' 'నాట్యమయూరి' అన్న పదాలు కవులూరికే వాడలేదనిపిస్తుంది.

సరళకూడా సుశీలకేమీ తీసిపోదు. తండ్రి ధనికుడు కాకపోయినా బీదవాడు మాత్రం గాదు. సరళముగ్ధ, అందాల బంగరుబొమ్మ. ఎప్పుడూ క్రేపుసిల్కు చీరలూ, మఖమల్ జాకెట్లతో, ఒకే ముస్తాబులో ఉంటుంది. తనకోసం ఎంతమందిమగపిల్లలుగోలచేస్తున్నా లెక్కచెయ్యదు. తన పరిచయభాగ్యానికి ఎంతమందో అల్లాడుతున్నారని ఆమెకు తెలుసు, కాని వారి నావిధంగా క్షోభపెట్టటం ఆమెకో సరదా.

సోమవారం సాయంత్రం అనుకున్న ప్రకారం సరళ సినిమాకు బయలుదేరింది. సరళ సరదాగా వెళ్లుతున్నదన్నమాటేగాని గుండెలో ఏదో గుబులుగా ఉంది.

సరళ హాలుదగ్గరకు వెళ్లేసరికి చక్రపాణి ఎదురుగా కనబడ్డాడు.

"హల్లో పాణీ" అంటూ విష్ చేసింది సరళ.

"ఓ సరళా నువ్వా?" అని ఊరుకున్నాడు పాణి. ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లుంది.

"ఎవరికోసమైనా చూస్తున్నారా? అంది సరళ.

"అబ్బే లేదండి" మాటతడబడ్డాడు పాణి.

చక్రపాణి తడబాటుచూసి సరళ నవ్వుకుంది. "పాపం పిచ్చివాడు...సుశీలకోసం చూస్తున్నాడు, ఇంకా వస్తుందనే ఆశ." అనుకుంది.

"ఏమండీ మీరుకూడా పిక్చరుకే వస్తున్నారా"?

"ఏమిటి పిక్చరుకా...లేదండి... కాదండి...పిక్చరుకే" తనేది మాట్లాడుతున్నాడో తెలీక, ఇదెక్కడి శనిగ్రహంరా అని సమాధానమిచ్చినట్లుంది.

సరళకు పరిస్థితి తెలుసు కనుక నవ్వి ఊరుకుంది.

ఆరున్నర అయింది. పిక్చరు మొదలు పెట్టే వేళ అయింది. పాణి ఎవరికోసమో చూసి చూసి నిరాశ చెందినట్లున్నాడు. విసుగుదల అతని ముఖంలో స్పష్టంగా కనిపిస్తూంది.

"పాణిగారూ పిక్చరుకు టైము అయింది పదండి". రావాలనకున్న వారురారనుకున్నాడేమో "పదండి" అన్నాడు.

సరళే టిక్కెట్లు తీసుకుంది, హాలులోకి

భార్య: ఏమండీ! లేలండీ! ఎవర్నయినా మగవాళ్ళని పిలుచుకురండీ!

భర్త: అదేమిటే మనబ్బాయి వున్నాడుగా.

జె. యల్. యస్. శాస్త్రి, బందరు.

వెళ్ళి కూర్చున్నారిద్దరూ. కాని పాణి పరధ్యాన్నంగా ఉండటము సరళ కనిపెట్టింది.

"ఏమండి మనస్సు బాగా లేదా"

"అబ్బే లేదండి. మనస్సుకేం"

సుశీల ప్రసక్తి తెద్దామనుకుంది సరళ కాని అది ఎటు తిరుగుతుందోనని మానివేసింది.

పిక్చరు అయిపోయిన తరవాత పాణి,

"ఏమండి సరళగారూ, రిక్షాలో వెళతారా" అని అడిగాడు.

"మీరు?"

"నేను రిక్షాలో వెళతాలెండి"

"అయితే రెండు రిక్షాలెందుకండి డబ్బు దండగ. మీకభ్యంతరము లేకపోతే...ఒక రిక్షాలో"

"ఒక రిక్షాలోనా?"

"ఏం మీ కభ్యంతరమా".

"ఆ లేదులెండి" అన్నాడు పాణి. ఆడదైన సరళకే లేనిది తనకేం?

సరళ పాణిలు రిక్షాలో ఎక్కారు. పాణి ఒకమూల కూర్చున్నాడు. సరళ దర్జాగా కాలుమీద కాలు వేసుకు కూర్చుంది. రిక్షా వెళ్ళిపోతోంది. సరళకు పరిస్థితి అయోమయంగా ఉంది. ఇప్పుడు తానెక్కడున్నదీ తెలియటం లేదు ఉన్నట్టుండి "నా మాటకు సమాధానం చెబుతారా?"

'ఏమిటామాట? అన్నాడు పాణి.

"మీ హృదయంలో నాకు స్థానంలేదా" అంది సరళ.

"సరళా! నా హృదయం ఎప్పుడూ నిన్ను ఆహ్వానిస్తూనే ఉంటుంది" అన్నాడు పాణి.

సరళ తానీ లోకాన్ని జయించానను కుంది.

* * *

"ఏం! సుశీలా? ఎక్కడినుండి ఆ ఉత్తరం? మీవారి దగ్గరనుండేనా?" ఒక నాడు కాలేజీలో ఉత్తరము చదువుతున్న సుశీలను సరళ అడిగింది.

"మావారా?...ఎవరువారు?" అమాయకంగా అడిగింది సుశీల.

"అబ్బో...నీవింత నాటకం ఆడుతున్నా నాకు తెలీదనుకున్నావా?"

"ఏమిటి సరళా? నేనేమిటి, నాటకం ఏమిటి?"

"అబ్బే ఏమీలేదు. పిల్లి కళ్ళుమూసుకుని పాలు తాగుతూ ఎవరూ చూడలేదనుకుంటుంది."

"సరళా ఈ రోజు నీ ధోరణి వింతగా ఉంది, చెప్పేది సరిగ్గా చెప్పు."

"నాకు మాటమాత్రం చెబితే నీ జెం పోయిందే? నే నేమన్నా నీలో భాగం పంచుకుంటా ననుకున్నావా? ఎలాగయినా మన ఆడజాతి లక్షణం పోనిచ్చావుగాదు."

"సరళా! నీకుగాని పిచ్చెక్కలేదుగదా? నీ ధోరణి చూస్తుంటే నాకు భయంగా ఉంది."

"నాకేం నేను బాగానే ఉన్నాను. పాణి వ్రాసిన ఉత్తరాలు చదువుకోలేక నీకే పిచ్చెక్కుతోంది."

"పాణి వ్రాసిన ఉత్తరాలా? నాకెందుకు వ్రాస్తాడు?"

"నీకుగాక నాకు వ్రాస్తాడా మరి?"

"సందేహం లేదు. నీకు నిజంగా పిచ్చెక్కింది."

"మీ విషయమంతా నే తెలుసుకున్నా నని నీకు పిచ్చెక్కింది. ఎంత దంగనాచివే! ఇంకా దాచి లాభములేదు. నాకంతా తెలిసింది. నువ్వు పాణితో జరుపుతున్న ప్రేమ వ్యవహారము..."

"ఏం. సరళా! నువ్వేం మాట్లాడు తున్నావో, తెలిసే మాట్లాడుతున్నావా... నేను పాణితో...ప్రేమ వ్యవహారమా? ఛీ! ఛీ! నీ నోరెట్లా వచ్చిందె అనటానికి."

"నాకంతా తెలిసింది. ఏదో స్నేహితురాలవని సలహా ఇస్తున్నాను. ముందుగానే మేలుకుంటే మంచిది" అంటూ సరళ వెళ్ళిపోయింది.



సరళ-సుశీల

సుశీల ఇంటికి వెళ్ళిపోయింది. మనసంతా ఏదోలా ఉంది. విసుగుదల స్పష్టంగా కనిపిస్తూంది. ఒకవైపు కోపము, సంతోషము ఆశ్చర్యము ముఖంలో ప్రతిబింబిస్తున్నవి. ఇవాళ తాను ఎటువంటిమాట వినాల్సి వచ్చింది. తాను పాణిని ప్రేమించిందా? అతనికేసి ఒక్కసారయినా చూడలేదే. అసలతను ఎట్లా వుంటాడు? అతన్ని గురించి వెయిటింగ్ రూమ్‌లో అమ్మాయిలందరూ అనుకొన్న మాటలు తప్ప తనకేమీ తెలీదే. అతన్ని నేను ప్రేమిస్తున్నానా? ముఖాముఖము తెలియని వాణ్ని ప్రేమించటమేమిటి? ఈ పుకారెందుకు పుట్టింది? సరళ కల్పించింది కాదుగద...అయితే ఆమె కేమి వస్తుంది? చక్రపాణిని ఒకసారి చూడాలనుకుంది సుశీల.

మరునాడు సుశీల చక్రపాణిని పరిశీలించి చూసింది. బాగానే ఉన్నాడనుకుంది. ఏదో అవ్యక్త విశిష్టత అతనిలో కలదని సుశీల తలచింది.

ఇన్ని రోజులనుండి అతన్ని సరిగా చూడలేను. ఎంత అందగాడు! అందుకనే అమ్మాయిలందరూ పడిచస్తారు అతనంటే. ఇంతకాలము నేనెంత ఉపేక్ష చేశాను, అనుకుంది.

"అయితే పాణిని ప్రేమిస్తున్నావా?" అడిగింది సుశీల అంతరాత్మ.

"ఏం? ఎందుకు ప్రేమించకూడదు? అతను మనిషి కాడా?" అంది సుశీల హృదయం.

"అయితే నే చెప్పేదేమీ లేదు. కాని కాస్త జాగ్రత్త" అంది అంతరాత్మ.

* * *

ఒకనాడు పాణి హఠాత్తుగా పార్కులో కలిశాడు సుశీలకు. ఎన్నడూ "విష్" చేయని సుశీల విష్ చేసేసరికి ఆశ్చర్యపోయాడు.

సుశీల తన హృదయాన్ని ఎలా విప్పిచెప్పాలో తెలియక తికమకపడుతూంది. పాణిమాత్రం ఆమెకు ఎదురుగా కూర్చున్నాడు. అతని ప్రవర్తనకు సుశీల మనస్సులో నవ్వుకుంది. ఐదునిమిషాల తర్వాత పాణీ! ప్రేమగూర్చి మీ ఉద్దేశ్యం ఏమిటి? అంది సుశీల.

"ఏమని చెప్పమంటావు? ప్రేమ గుడ్డిది. దరిద్రసముద్రంలో ఈదులాడుతున్న వ్యక్తులను ప్రేమతో బంధించడం బుద్ధిశూన్యతను తెలియపరుస్తుంది" అన్నాడు.

'దరిద్రసముద్రంలో ఉన్నవాళ్లు ధనికులకంటే ముందుచూపు కలవారు కదా?" అందామె ఎదురుగా ఉన్న అతని ఉంగరాలజుట్టు చూస్తూ.

"ఎలా చెప్పగలవు?"

"అనుభవాన్ని బట్టి"

"అనుభవాన్ని చెబితేగాని నమ్మటానికి వీలుండదేమో."

ఆ ప్రశ్నతో మరింక తర్కించలేక పోయింది సుశీల. తలవంచుకుంది సిగ్గుగా.

"ఏం! సుశీలా, జవాబు చెప్పటం రాదా."

"మీతో మాట్లాడలేమండి" అందామె తలవంచుకునే.

"సుశీలా! వెళ్దామా ఇక..."

"నేను మీతో కలసివచ్చానా? మీతో రావటానికి?"

"సరే నువ్వుండు. నే వెళ్తున్నాను" అని పాణి లేవబోయాడు.

"పాణీ! కూర్చోండి. ఒకమాట చెప్పదలిచాను."

"అదేదో త్వరలో చెప్పవచ్చు రండి."

"పా...ణీ...మీ..."

"ఎందుకు? జంకవలసిన అవసరంలేదే."

"మీ...పా...ద...సే...వ చెయ్యటానికి యీ దీనురాలు——"

"సుశీలా దీనురలవు గావు. ధనవంతురాలవు."

"మీ...పాదసేవ చేయటానికి నే అర్హురాల్ని కానా?"

"సుశీలా! నీవన్నది నాకింకా బోధపడటం లేదు. పాదసేవేమిటి నీకేమి పిచ్చిపట్టిందా?"

"అది కాదు...పాణీ...ప్రే...మి...స్తు...న్నా...ను. వివాహం చేసుకుందామని"

"నీవు ఇష్టమా లేదా అని అడుగుతున్నావా? హు. సుశీలా పెద్దవాళ్ళ పరువు ప్రతిష్ఠలను గుర్తుపెట్టుకునే అడుగుతున్నావా? నాలో ఏమిచూసి..."

"అన్నీ ఆలోచించాను. గుణగణాల్ని చూసి..."

"ఆమాటే నాకు కావలసింది...నాలో వికుణాల్ని చూసి కోరెవ్"

"చదువు."

"హు! చదువు. చదువుకున్న వారందరూ మంచివారేనా?"

'అందం...'

"హు! అందం..."

"వీటన్నిటినీ విశ్వసించింది మీ హృదయం"

"సహృదయం అని తెలుసుకోవటం సులభంకాదేమో!"

"మాటలనుబట్టి..."

"బయటికి చక్కగా మాట్లాడి హృదయాంతరంలో మాలిన్యముంచుకొనే తేనె పూసిన కత్తుల సంగతి నీకు తెలిసుంటుందే!"

"చేతలనుబట్టి——"

"ఇంతవరకు పెద్దపనులు చేసినవున్నావని నేను వినలేదు"

"పోనీ పాణీ! వాదం ఎంతవరకైనా వెళ్తుంది - ప్రేమించటానికి అనర్హురాలనా"

"ఆమాట నేననటంలేదు సుశీలా! అది నీ ఇష్టాఇష్టాలమీద ఆధారపడుంటుంది. కాని నేచెప్పేది ప్రేమించేముందు ఆలోచించమని"

"అయితే పాణీ! నన్ను...ప్రేమిస్తున్నారా" అందామె.

"అయితే సుశీలా! ఆమాట ఆఖరికి నా నోటితో అనమంటావా" ఆ మాటతో సుశీల బుగ్గలు ఎరుపెక్కాయి.

* * *

"హల్లో పాణీ! ఇన్ని రోజులనుండి సరస్వతీ లోలుడవనుకున్నాము గాని సరళా సుశీలాలోలుడవనుకోలేదోయ్. అయినా ఈనున్న కాలేజీ ఆడపిల్లలందరు నీమీద దండెత్తారేమోయ్" అంటూ స్నేహితులు అడిగారు,

సమాధానంగా పాణి చిరునవ్వు నవ్వి ఊరుకొన్నాడు. "వీడేదో అమ్మాయిలందరకూ మంత్రం వేశాడురోయ్. లేకపోతే మగవాళ్ళ వంకైనా చూడని సుశీల కూడా. అంతే అద్భుత మంత్రశక్తే. సందేహంలేదు" అన్నాడు ఇంకో మిత్రుడు. ఇట్లా పలువురు పలువిధాలుగా పాణిని బ్రతకనీయలేదు. చెవితేనేగాని వదలమన్నారు.

"ఇదేం లేదోయ్. చాల సింపుల్ ... నేనిట్లా జరుగుతుందని ఎప్పుడూ అనుకోలేదు. సరళ నోట్సు అడిగింది. అందులో సుశీల ఉత్తరానికి జవాబు వ్రాసినట్లుగానే నే వ్రాసిపెట్టాను. అది సరళ చూసింది. స్త్రీ సహజమైన ఈర్ష్య జనించింది. సుశీల చెయ్యగలపని నే నెందుకు చెయ్యలేననుకుంది. ఆ తరువాత సరళ సుశీలతో చెప్పేవుంటుంది నువ్వు ఫలానా ఫలానావారిని ప్రేమిస్తున్నావని; నీ రహస్యం తెలిసిపోయిందని. అసలు పుకారు పుట్టిందిగదా యని సుశీల కూడ రంగంలోకి దిగింది. వీరిద్దరిమధ్య నే చస్తున్నాను, ఊపిరాడక."

"హారి! నీ తస్సదియ్యా. ఎంతపని చేశావోయ్" అన్నాడు.

"ఏదో చేసిన పనేదో చేశావుకాని పెద్ద చిక్కు. ఇద్దర్నీ పెళ్ళిచేసుకోలేవుగా. ఎవర్నో ఒకర్ని చేసుకు బాగుపడు," అంటూ దీవించేశారు మిత్రులు.

* * *

ఆ రోజు సరళ పుట్టినరోజు పండుగ. ప్రధాన అతిథి చక్రపాణి. సరళ సుశీలను కూడ ఆహ్వానించింది. కాలేజీలో అమ్మాయిలు చాలమంది వచ్చారు. కాని మగవారిలో మాత్రం ఒక్క చక్రపాణే వచ్చాడు. సుశీల కూడ వచ్చింది. సుశీల చక్రపాణిని చూచి ఆశ్చర్యపోయింది. 'విష్' చేసింది. ఆమెను చూచి మిగతా అమ్మాయిలందరు మూతి ముడుచుకున్నారు తమకా భాగ్యము లేనందుకు.

సుశీల పాణీలు చాలసరదాగా ఎంతో చనువుగా మాట్లాడుకొంటున్నారు. అది చూచి సరళ సహించలేకపోయింది. కాని ఇప్పుడేమి చేయగలదు. తరువాత పాణితో, సుశీలతో అంతచనువు పనికిరాదని చెబుదామనుకుంది. సుశీలకు తాను సరళ ఇంట్లో ఉన్నాననీ, తోటి విద్యార్థినులు ఉన్నారని ఆలోచనేలేదు. ఆమె ఎక్కడుండి మాట్లాడుతున్నదో ఆమెకే తెలియడంలేదు.

అందరూ భోజనాలకు కూర్చున్నారు. సరళ పాణిప్రక్కన కూర్చుంది. పాణి వద్దంటున్నా కొసరికొసరి తినిపిస్తూంది సరళ. ఇదిమాడలేక పోయింది సుశీల. సరళతో అంతచనువుగా ప్రవర్తించటానికి కారణం

(45-వ పేజీ చూడండి)

అన్వేషణ

పోతుకూచి సాంబశివరావు

(గతవారం తరువాయి)

పెట్టుకొని తాటాకు బుట్టలో కట్టించు కొంది చంద్రప్రభ. రాముడు వాటిఖరీదు అందుకున్నాడు. చంద్రప్రభ రాణితో కదల బోతుంటే రాముడు పిలిచాడు. 'ఆగం డమ్మా!' అంటూ రెండు పెద్దపల్ల ద్రాక్ష గుత్తులు, రెండు ఎర్రని ఆపిలుపండ్లు తీసి రాణికి, చంద్రప్రభకు అందిచ్చాడు రాముడు.

'వీటి ఖరీదు వాకివ్వక్కర్లేదండి...నాకు లాటరీ వచ్చినందుకు...మీకు బహుమతి' వినయంగా నవ్వాడు రాముడు.

చంద్రప్రభ, రాణి అవి అందుకున్నారు. మౌనంగాపోయి రిక్షాలో కూర్చున్నారు.

'నిన్ను కమలమ్మగారూ అంటాడేమిటి?' చంద్రప్రభ రాణిని ప్రశ్నించింది అమాయ కంగా.

'చిన్నప్పుడు మాయింట్లో రాముడు పని చేసేవాడు మా నాన్నగారు బ్రతికివున్న రోజుల్లో... అప్పుడు నన్ను కమలా అని పిలిచేవారు...తర్వాత పెళ్ళయ్యాక రాణి అని..."సిగ్గుగా నవ్వింది రాణి..."ఆయన జ్ఞాపకార్థం ఆ పేరు అలాగే ఉంచు కున్నాను."

భర్తమీది లాకు అభిమానానికి కట్టుబడిట్లా అలా సత్ప్రవర్తనతో వితంతు జీవితంగడుపు తున్న రాణి అంటే చంద్రప్రభకు గౌరవం, ఆప్యాయత హెచ్చయింది.

'రాణీ!...నీ నుంచి నేర్చుకోవలసిన విష యాలు చాలా ఉన్నాయి!" చంద్రప్రభ నిర్మల మనస్సుతో ఆవేదనపడి ఉచ్చ రించింది.

ఆ పలుకులు రాణికి మొదట ములుకుల్లా గ్రుచ్చుకున్నా, చంద్రప్రభ ముఖం పరీ క్షించి తేలికగా నవ్వేసింది రాణి.

బట్టల దుకాణాల్లో చీరలధరలు పరిశీ లించి. బంగారు దుకాణాల్లో ఆభరణాల నొగసు పరిశీలించి, మెల్లిగా తొమ్మిది గంట లకు యింటికి చేరారు రాణి, చంద్రప్రభ.

వాహ్యాళికి వెళ్లి తిరిగివచ్చిన కురంగేశ్వర్రావు గారు వాలుకుర్చీలో ఆరుబయట కూర్చుని ప్రసాద్‌కు ఇంగ్లీషులో కథలు చెబు తున్నారు.

తొమ్మిదిగంటలకే యింటికి చేరిన కూతు రును పలకరించాడు తండ్రి.

'అప్పుడే సినిమా అయిపోయిందమ్మా?'

'ఆ...మేము ఒక సినిమా చూద్దామని వెళ్లాం...

తీరా టిక్కెట్టు కొని......లోపలికి వెళ్ళి కూర్చునేటప్పటికి ఏదో జంతు వులు, అరణ్యం సినిమా చూపించాడు... ఆ సింహం అరుపులు, ఏనుగుల ఘీంకారాలు, సర్పాల బుసబుసలు చూస్తే భయమేసి మధ్యలో సినిమా విడిచి వచ్చేశాము!" అంది చంద్రప్రభ గారాబంగా.

'ఈ విషయం మీ అమ్మతో చెప్పకు... భావిభారత వీరనారీమణులు అలా భయపడ తగ్గా!' అంటుంది! అని పక పక నవ్వారు కురంగేశ్వర్రావు గారు.

'నాన్నా......మొన్న అక్క మీద రబ్బరుతోలు పడేస్తే భయపడి అరగంట సేపు గుండెపట్టుకు కూర్చుంది దడని ఆపుకోలేక!" ప్రసాద్ చిలిపిగా నవ్వేడు.

"ఫో...నువ్వు పెద్ద భావిభారత వీరుడిలా మాట్లాడుతావు!' చంద్రప్రభ కోపం అభిన యిస్తూ రాణితో యింట్లోకి వెళ్ళింది.

వంటలక్క భోజనాలు వడ్డించింది రాణికి చంద్రప్రభకు.

> బీదవాడు: బాబూ! కాఫీకి ఒక బేడ ఉందా?
>
> దారినపోయే మనిషి: ఆ! ఫర్వాలేదు. ఎలాగో సర్దుకొంటా లెండి.
>
> ఎస్. అబ్దుల్ హఫీజ్, హైదరాబాదు.

కామేశ్వరమ్మ కారులో దిగింది బంగళాముందుకు రంగేశ్వర్రావు హాస్యంగా లేచి కామేశ్వరమ్మకు స్వాగతం చెప్పాగా. ప్రసాద్ సైనికుడిలా నుంచొని తల్లికి సాల్యూట్ చేశాడు.

'బాగుంది మీ వేళాకోళం!' అంటూ కామేశ్వరమ్మ వయ్యారంగా నడుస్తూ బరువైన శరీరాన్ని ఈడుస్తూ వాలుకుర్చీలో ఒక నిమిషం కూలబడింది.

'నీ కూతురు భోంచేస్తుంది......వెళ్ళి పంక్తిలో కూర్చో!' అన్నారు కురంగేశ్వర్రావుగారు.

కామేశ్వరమ్మ భోజనం పేరుచెప్పగానే మెల్లిగా లేచి కాళ్లు, చేతులు కడుక్కొని వంట యింట్లోకి వెళ్ళింది.

'ఎక్కడికెళ్ళావే అమ్మా!" గారాబంగా ప్రశ్నించింది చంద్రప్రభ.

'ఆ...మా కార్యవర్గం అత్యవసర సమా వేశం ఉంటే వెళ్ళా!'

'ఎందుకు సమావేశం!' అమాయకంగా అడిగింది చంద్రప్రభ.

'మద్రాసునుంచి మహిళాసంఘ కార్య దర్శిని యిక్కడికివచ్చింది. రేపు ఆమె గౌర వార్థం ఒక సభ ఏర్పాటుచెయ్యాలి. ఇక్కడి సంఘం సహాయకార్యదర్శిగా నాకుగాక బాధ్యతలు లెక్కలేనన్ని!" నిట్టూర్పు విడి చింది కామేశ్వరమ్మ ప్రపంచ భారమంతా తనే మోస్తున్నట్లు.

"అమ్మా! అయితే రేపునువ్వు సభలో మాట్లాడుతావన్నమాట!" గ్రుడ్లు పెద్దవిచేసి ఆశ్చర్యంగా అడిగింది చంద్రప్రభ.

'మరి...రేపటి స్వాగత ఉపన్యాసం తయ్యారు చెయ్యాలి, ఈ రాత్రి!' నెత్తిమీద చెయ్యి వేసుకొంది కామేశ్వరమ్మ పెద్ద బరువున్నట్లు.

"మా అమ్మమాట్లాడుతూంటే మైక్ బద్దలైపోతుంది, వేదిక గోతులు పడి పోతుంది. హాలు ప్రతిధ్వనులతో పడిపోతుంది...అధ్యక్షుడి మేజా బల్ల గుద్దులకు తల్లక్రిందులుగా పల్టీకొట్టేస్తుంది రాణీ!" నీరసంగా హేళనగా తల్లికేసి చూసింది. చంద్రప్రభ రాణికి చెబుతూ.

"మాడురాణి! దీనికెంత పొగరో! తల్లిని అలా అంటుందా—మాతృప్రేమ ఏకోశానా లేదు!" కోపం అభినయిస్తూ పెదాలమధ్య నవ్వు బిగబెట్టింది కామేశ్వ రమ్మ.

"రేపు మీ సభకు నేవస్తానండి!' రాణి కామేశ్వరమ్మను సంతోషపెట్టదలచింది.

'మా అమ్మాయికంటే నువ్వు ఎన్నో రెట్లు మెరుగు!'

'పోనీ ఆమెను దత్తతచేసుకో!' నవ్వింది చంద్రప్రభ.

'చివరకు అదే చేస్తాను!' అంటూ గబగబ ముద్దలు మ్రింగింది కామేశ్వరమ్మ.

ఒకవారం గడిచింది. కురంగేశ్వరరావుగారు ప్రొద్దునే కాఫీ తాగుతూ రాణిని పిలిచారు. నాంపల్లిలోని బాలికల మాధ్యమిక పాఠశాలలో ఆమెను ఉపాధ్యాయిని ఉద్యోగం ఏర్పరచానని, వందరూపాయిల జీతం యిస్తారని చెప్పారు. మధ్యాహ్నం వెళ్లి పాఠశాలా నిర్వాహక సంఘం కార్యదర్శిని కలుసుకోమని సలహా యిచ్చారు.

రాణి ఆనందానికి మేరలేక పోయింది. కురంగేశ్వరరావుగారికి కృతజ్ఞత తెల్పింది. చంద్రప్రభ గంతులేస్తూ టీపార్టీ యిమ్మని అడిగింది. కామేశ్వరమ్మ సంతృప్తిగా నవ్వింది భర్త పలుకుబడికి గర్వం చూపిస్తూ.

మధ్యాహ్నం రాణి యథాప్రకారం నిరాడంబరంగా దుస్తులు వేసుకొని కురంగేశ్వరరావుగారి నుంచి ఉత్తర మొకటి తీసుకొని నాంపల్లిలోని పాఠశాలకు వెళ్లింది. కార్యదర్శి యింకా రాలేదని నౌకర్లు సమాధానమిచ్చారు. ఒకగంట ఏ పనిలేక విసుగ్గా కూర్చుంది. నోట్లో పైపు కాలుస్తూ పులెన్ సూటులో, ఫెల్ట్ హాట్ పెట్టుకొని దర్జాగా కారు దిగి నల్లకళ్లజోడులోంచి పరిసరాలు పరీక్షగా చూస్తూ, రాణిని చూసి తీవిపెంచి తన గదిలోకి పోయి కూర్చున్నాడు భుజంగరెడ్డి. రాణి తన పేరుగల చీటీ లోపలికి పంపించింది. పిలిచాడు భుజంగరెడ్డి. లోనికి వెళ్ళి నమస్కరించి, కురంగేశ్వరరావుగారి ఉత్తరం చూపింది రాణి. భుజంగరెడ్డి కళ్లజోడు తీసేశాడు. సరదాగా నవ్వాడు. కాఫీ తెప్పించాడు. ఆమె స్కూల్లో చేరడంతో బాలికల విద్యాభివృద్ధి నూత్న పంథాలో నడిపించబడుతుందని ఆశిస్తున్నానన్నాడు. కరచాలనం చేసి అప్పుడప్పుడు కనిపించమన్నాడు భుజంగరెడ్డి.

పాఠశాల కార్యనిర్వాహకవర్గంలో కురంగేశ్వరరావుగారు సభ్యులని తెలిసింది రాణికి. ప్రజల సహకారంతో చందాలు వసూలుచేసి ప్రభుత్వంనుంచి కొంతధనం పొంది ప్రజలచే ఎన్నుకోబడిన కార్య నిర్వాహక సంఘం పర్యవేక్షణలో ఆ పాఠశాల నడుపబడుతోందని రాణి గుర్తించింది. ఏదైనా కురంగేశ్వరరావుగారి ద్వారా లభ్యమయిన యీ ఉద్యోగం చాలాకాలం నిలవగలదని, భుజంగరెడ్డి కూడా చాలా మర్యాదస్థుడులాగే ఉన్నాడని సంతోషించింది రాణి. ఒక్క మనిషి పొట్ట గడుపుకోడానికి ఏ ఉద్యోగమైనా ఒకటే అనిపించినా, తన చదువుకు తగిన స్థిరత్వం గల ఉపాధ్యాయిని ఉద్యోగం లభించడంతో, నియమితకాలంలో పనిచేసి, విరామకాలం మరో నిర్మాణాత్మక పద్ధతిలో గడపవచ్చునని ఆశించింది. తన సంపాదన చాలావరకు తాత్కాలిక ఖర్చులకు ఉపయోగపడడమే గాని, దైనిక జీవితంలోని అవసరాలన్నీ ఎక్కువగా కురంగేశ్వరరావుగారి కుటుంబంతోనే తనకూ లభ్యమౌతున్నాయి. ప్రత్యేకం జీతం వస్తేగాని, జీవితం గడవదనే రోజులు పోయాయనిపించింది రాణికి.

వీధిలో నడుస్తుంటే ఒక ముష్టి ముసలి స్త్రీ కర్ర పుచ్చుకొని, నడుం ఒంగినడుస్తూ మూల్గుతూ రిక్షా అడుగుతోంది: రాణి దృష్టిలో మరియమ్మ మెదిలింది:... బహుశ ఆ యింట్లోనే ఉండి ఎవరైన మరొక అమ్మాయిని చేరదీసిందో...ఎక్కడికైనా వెళ్ళిపోయిందో...ఆమె దగ్గర వున్నప్పుడు రోజూ డబ్బుకు యిబ్బందే. ఆమె త్రాగుడుకు నల్లమందుకు డబ్బు చాలక, స్నేహితులను వంచించి, అందంతో ఆకర్షించి, లాలనచేసి డబ్బు గణించే తన స్థితి జ్ఞప్తికి వచ్చింది రాణికి...ఒక్క రోజు త్రాగుడు, నల్లమందు లేకపోతే పిచ్చిగా గంతులేసేది మరియమ్మ...వీధుల్లో తిరిగే ఆ బికారి స్త్రీ మరియమ్మ ఏమో అని పరీక్షించి చూసింది రాణి... కాదనుకొని తన దారిని నడిచిపోయింది ఆలోచనలు బంధించుకొని.

రాణికి పాఠశాలలో చాలా హాయిగా జీవితం గడిచిపోతోంది. కావలసినన్ని సెలవు దినాలు, నియమిత కాలంలో పని, సెలకాగానే జీతం,—ఆనందం యిచ్చే బాలికల అల్లరి,— జీవితంలో సంతృప్తి యిచ్చాయి. ముద్దుగా అందంగా అలంకరించుకుని, ముసిపెంగా చిలిపిచేష్టలు చేస్తూ అజ్ఞానంలోంచి విజ్ఞానపు ప్రశ్నలు వేస్తూ, మేష్టారూ అంటూ మితిమీరిన గౌరవం చూపిస్తూ కలకల్లాడే ఆ బాలికలు రాణికి ఎంతో కన్నుల పండువుగా కనిపించేవారు. ఒక్కొక్కసారి రాణి వారిని చూసి కన్నీరు పెట్టుకొనేది. జీవితంలో అటువంటి బిడ్డలను పొందే అదృష్టం తనకు లేదని. ఒక దినం మధ్యాహ్నం భుజంగరెడ్డి పిలిచాడు రాణిని. తాను నిజాంసాగర్ ఆనకట్ట దగ్గరకు ఒక ప్రత్యేక పనిమీద వెడుతున్నానని, అప్పటి ప్రదేశం చాలా సుందరంగా ఆహ్లాదకరంగా ఉంటుందని, కాలక్షేపానికి రాణిని కూడా తోడురమ్మని ఆహ్వానించాడు భుజంగరెడ్డి. అతని మాటల్లోని అంతరార్థం సులువుగా గ్రహించింది రాణి. తనకు నగరం కదలడానికి వీలులేదని, ఎన్నో పనులున్నాయి క్షమించమని మర్యాదగా రెడ్డివద్ద సెలవు తీసుకుని బయటికి వచ్చేసింది రాణి.

భుజంగరెడ్డి చిన్నబుచ్చుకున్నాడు తన మాట త్రోసివేయబడిందని. ఆ పాఠశాలలో ఉన్న పంతులమ్మలెవ్వరూ పూర్వం తన మాట జవదాటని పరిస్థితులలో మసిలిన రెడ్డికి, రాణి తిరస్కారం అవమానంగా కనిపించింది. తన చేతుల్లో చిక్కిన పిట్టను

★ అన్వేషణ ★

వేధించడం అంతకష్టమైనపని కాదనుకున్నాడు రెడ్డి.

మరోవారం రోజులు దాటాక రాణి పూర్వ జీవితం కులట జీవితమని వర్ణిస్తూ రెడ్డికి ఆకాశరామన్న ఉత్తరాలు రెండు వచ్చాయి. అవి చదువుకొని కళ్ళు మిటకరించి పైపు వెలిగించి, పొగల్లోంచి ఆలోచనలు సృష్టించుకున్నాడు రెడ్డి.

15

విశాలమైన మైదానంలో స్వతంత్రవ్యక్తుల్లా స్వేచ్ఛావాయువులు పీలుస్తున్న వివిధ వృక్షాల మధ్య అద్భుత శిల్పంతో నిర్మించి ఉన్న విశ్వవిద్యాలయ భవనప్రాంగణందాటి స్నాతకోత్సవంలో ప్రదానంచేసిన లాపట్టాను న్యాయదండంలా చేతపుచ్చుకుని, నల్లగౌను, నల్లటోపీ ధరించి యితర స్నేహితులతో ఆనందంగా, తనవిద్యాప్రతిభను హెచ్చించే మరొక చిహ్నాన్ని పొందాననే గర్వంతో బయటికి వచ్చాడు శివరాం. ఒక చెట్టుక్రిందం నిలబెట్టి, స్నాతకోత్సవ దుస్తుల్లో శివరాం ఫోటో తీశాడు స్నేహితుడొకడు. అద్దెకు తెచ్చిన గౌను, టోపీ, తిరిగి యిచ్చేసి, స్వయంసంపాదనతో నల్లకోటు కుట్టించుకోవలసిన అగత్యం గుర్తించాడు శివరాం.

గతించిన రెండు సంవత్సరాలు న్యాయశాస్త్ర విద్యాభ్యాస కలాపాలతో, ఆఫీసులోని మితిమీరిన పనిఒత్తిడితో, ఉత్సాహంతో అభివృద్ధి చేసుకుంటున్న చిత్రలేఖన ప్రయోగాలతో, వాఛీగా నడిచిపోయింది. తీరుబడిలేకుండా లక్ష్యపూరితమైన కార్యకలాపాలు పెంచుకుని వీలైనంతవరకు రాణిని మరిచిపోయాడు శివరాం.

ధూమరావు, జగదీశ్వర్ కనిపించినప్పుడు రాణిని తాము నాంపల్లి ప్రాంతంలో చూచేమని యథాలాపంగా సంభాషణల్లో సూచన చేసినా, ఆమెను గురించి తిరిగి ఆలోచించే మనస్సు వికలమై, జీవితలక్ష్యాలు వెనుకంజవేయగలవనే భయంతో శివరాం రాణిని చూడాలనే ఆకాంక్ష నిగ్రహించుకున్నాడు. పైగా ఒక స్త్రీ గురించి వ్యసనపడి, భగ్నప్రేమవల్ల బాధతో, మనిషి జీవితంలో ఏమీసాధించలేడనే సంగతి గుర్తించాడు శివరాం. రాణి తనపరిసరాలలో కనిపించకుండా వీలైనంతవరకు తనకార్యకలాపాలు నిర్ణయించుకున్నాడు.

కాని గడిచిన రెండు సంవత్సరాలల్లో మేడక్రింద కార్మికులస్నేహం బాగా పెరిగిపోయింది శివరాంకు. ఎత్తైన మేడమీద

క్షేమసమాచారాలు ప్రశ్నిస్తూ, నిమ్నజాతుల దగ్గరజేరి కలిసిమెలిసి మసలడంతో తన తరగతి నిమ్నత్వంమరిచి, శివరాంతో గౌరవంగా సంచరిస్తూ తమ కష్టసుఖాలు, నివేదించుకునేవారు మేడక్రింద నివసించే పూరిగుడిసెల మనుష్యులు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన తన బ్రతుకురీతులకు, అధమతరగతిలో అన్ని అవసరాలలోపాలతో బాధపడుతూ దినదినగండం దీర్ఘాయుష్షుగా గడిచేవారి బ్రతుకులగతులకు ఉన్న వ్యత్యాసం గురించి ఖేదపడేవాడు శివరాం. జీవితంలో ఏదో క్రొత్త విజ్ఞానం నేర్చుకుంటున్నట్లు అనుభూతి పొందేవాడు శివరాం ఆ గుడిసెల్లోని మనుష్యుల జీవితాలు పరిశీలించి.

లాండ్రీ యజమాని జనార్దనం, క్రింద కూరలమ్మే ముసలవ్వ పోచమ్మ, కిళ్ళీదుకాణం పెట్టిన మరుగుజ్జుస్త్రీ వెంకటమ్మ, బొగ్గులదుకాణంలో బస్తాలుమోస్తూ కూలి సంపాదించుకునే పెంటయ్య, బట్టలమిల్లులో కూలివాడుగా పనిచేస్తున్న కిష్టయ్య, ఆస్పత్రిలో పనిచేస్తున్న శామ్యుల్, టాంగాతోలుకునే సీనయ్య, తాళాలు బాగుచేయుడానికి వీధిలోతిరిగే అబ్దుల్లా, చెప్పులుకుట్టే యాదయ్య, వండ్రంగిపని చేసుకునే నరసింహులు, దర్జీపనిచేసే బాలారాం, శివరాం నిత్య స్నేహితులుగామారి, వీధిలో కనిపిస్తే నమస్కారాలు పెడుతూ వీలైనప్పుడు యింట్లో కనిపించి వివిధరకాల భోగట్టాలు తెలియజేయడం మామూలైపోయింది. వారి కష్టసుఖాలు పరిశీలిస్తూ, చేతనైన సహాయం చేస్తూ, ఆ నిమ్నజాతుల గౌరవాదరణలకు పాత్రుడయ్యాడు శివరాం. అతను చెప్పిన తీర్పులను సామెతలను పాటిస్తూ వీలైనంతవరకు ఐకమత్యం ప్రకటిస్తూ, శివరాంను తమ నాయకుడిలా భావిస్తూ అవసర మొచ్చినప్పుడు అతని మాటప్రకారం ఏదైనా చెయ్యాలనే ధృఢవిశ్వాసం పెంపొందించుకున్నారు ఆ నిమ్నజాతులంతా.

ఒకరోజు జనార్దనం, లక్ష్మన్నను, పులిగాడిని వెంటబెట్టుకు వచ్చాడు శివరాం దగ్గరకు. లక్ష్మన్న సిగరెట్టు కంపెనీలో పనిచేస్తున్న యువకమిత్రుడని, పులిగాడు లక్ష్మన్నకు కావలసిన స్నేహితుడని పరిచయం చేశాడు జనార్దనం. పెంటయ్య అన్న రోగంతో తీసుకు చచ్చిపోయాడని, అతనికి సంసారం లేకపోవడంచేత అతని గుడిసె కాళీగా ఉందని, ఆగుడిసె పెంటయ్యతో చెప్పి, పులిగాడికి అద్దెకు యిప్పించమని కోరాడు జనార్దనం. ప్రక్కనే ఉన్న యినుపపనిముట్ల ఫ్యాక్టరిలో కూలివాడుగా చేరాడని, యీదగ్గర గుడిసెదొరికితే తనకు

చేసుకున్నాడు పులిగాడు. శివరాం వెంటయ్యను పిలిపించి అడిగాడు. ఎవరికిద్దామా ఆ గుడిసె అని నిర్ణయం యింకా ఏమీ చేసుకోని వెంటయ్య శివరాం సలహాకు అభ్యంతరమేమీ చెప్పలేదు. తనకు గుడిసె సులువుగా అద్దెకు యిప్పించేడని, శివరాంకు దణ్ణం పెట్టాడు భక్తిగా పులిగాడు. మర్నాడు లక్ష్మన్న గది వదిలి, గుడిసెలో ప్రవేశించాడు పులిగాడు. గుడిసెలో ప్రవేశించాక, రంగమ్మ కూడా జనార్దనం సహకారంతో యిరుగుపొరుగు యిళ్ళల్లో దాసీ పనికి కుదిరింది.

పులిగాడికి నగరం వచ్చేక ఎంతో ఆనందం కలిగింది. తాను మునుపు ఉన్న పట్నం కంటే యీ నగరం ఎంతో సౌకర్యంగా కనిపించింది. కూలి కూడా పుష్కలంగా దొరుకుతోంది. భార్య జీతాలు కలుపుకుంటే పులిగాడు సులువుగా ఎనభై రూపాయిలు కళ్ళ జూస్తున్నాడు. వచ్చిన మూడు నెలలకే ఏభై రూపాయిలు దాచగలిగాడు.

ఆ నగరంలోని గుడిసెలో ప్రవేశించాక మంచివాడిగా, ఎవరికష్టాల్లో వారు లీనమయి, నీరసంగా బ్రతుకుతున్న పొరుగు గుడిసెల్లోని జనంతో కబుర్లుచెప్పి నవ్వించేవాడు పులిగాడు. సెలవుదినం వస్తే నలుగురినీ పిలిచి, కోలాటం ఆడేవాడు తనకు తెలిసిన నెల్లూరు జానపద పాటలతో. గుడిసెల్లోని స్త్రీలంతా తమ మగవాళ్ళు విచిత్రంగా కర్రలు త్రిప్పుతూ, ఉత్సాహంగా నృత్యం చేస్తూ కోలాటం ఆడుతూంటే కులుకుతూ కూర్చునేవారు. తీరుబడి ఉన్నప్పుడు శివరాం చోద్యంగా తన గది వరండాలోంచి చూస్తూండేవాడు.

ఒకరోజు చుట్ట కాలుస్తూ గుడిసెలో కూర్చున్న పులిగాడికి ఒక వింత ఆలోచన తట్టింది. తమ పేర్లు నాజూకుగా లేవని అనుకున్నాడు. ఆలోచించి చటుక్కున చిటిక వేసి, రంగమ్మను పిలిచాడు.

"ఒసే......పెద్దబస్తీ వచ్చాక మన పేర్లు మామూలుగా ఉండడం బాగులేదే...... నా పేరు పుల్లయ్య అని మార్చుకుంటున్నా......నీ పేరు రంగి,.....ఇకనుండి పేరు గోపి!" నవ్వాడు పులిగాడు.

పులిగాడు "పుల్లయ్య"గా మారాడని గుడిసెలవాళ్ళలో ప్రచారం చేసుకున్నాడు. తన భార్య పేరు 'రంగి' అని మార్చుకొనని, భార్యముందే ప్రచారం చేస్తూ వేళాకోళం చేసేవాడు పులిగాడు. గుడిసెల్లోనివాళ్ళు పులిగాడికి, భార్యకు, ఉన్న అన్యోన్యం చూసి ఆనందించేవారు.

గిరజాలు కత్తిరించి, రింగుల క్రాపు చేయించుకున్నాడు పులిగాడు. బనీనులు వదిలేసి లాగు, చొక్కా ధరించాడు. బొద్దు పొడుగుమీసాలు, సన్నగా కత్తిరించుకుని, పెదాల చివరదాకా మీసం చేసుకున్నాడు. భర్తలో క్రొత్తఅందం వచ్చిందని రంగమ్మ పొంగిపోయింది.

ఒకరోజున గుడిసెలోని వారందరినీ పిలిచి చిన్న సభ చేశాడు శివరాం. వ్యక్తిగతంగా చేసిన ఏ పనికన్నా కూడా సంయుక్తంగా చేసిన పని ఎక్కువ రాణిస్తుందని, యీ గుడిసెలలోని జనమంతా ఒక సంఘం క్రింద ఏర్పడి వసతి సౌకర్యాలు పొందుతూ, పరస్పర సహాయంతో బ్రతికితే, త్వరలో తమ జీవన ప్రమాణాన్ని బ్రతుకులోని ఆనందాన్ని వృద్ధిచేసుకోగలరని ఉపన్యసించి, వారందరినీ ఆ నగరు నిమ్నజాతులసంఘంగా ఏర్పరిచాడు. ఒక్కొక్కరి వద్దనుంచి అణా చందా వసూలు చేసి, ఆ వచ్చినధనంతో గుడిసెల్లో వాళ్ళకు కావలసిన సౌకర్యాలు, వినోదాలు జరిపించడానికి నిశ్చయించాడు. కొత్త ఉత్సాహంమాపుతూ తిరిగే పులిగాడిని వారి సంఘం పెద్దగా ఎన్నుకున్నారు అంతా. కార్యక్రమాలు శివరాం సలహాలతో నడవాలని నిర్ణయించుకున్నారు.

ఆ ప్రాంతంలో ఉన్న వందగుడిసెల యజమానులవద్ద రెండు నెలలు చందాలు వసూలుచేసి ప్రథమంగా రాత్రి పాఠశాల నడిపించడానికి ఒక చిన్నగుడిసె వేయించాడు శివరాం. ఆ గుడిసెల్లో నిరక్షరాస్యులకు తనకు వచ్చిన విద్యను నేర్పడానికి జనార్దనం ముందుకువచ్చాడు. పాఠశాలకు కావలసిన చిన్న పరికరాల ఖర్చు శివరాం స్వయంగా భరించాడు. పులిగాడు పాఠశాల నిర్వాహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడు.

గుడిసెల ప్రాంతంలో మురికినీరు తొలగించి పరిశుభ్రం చేయించమని స్థానిక పురపాలకులకు విజ్ఞప్తి చేశాడు శివరాం. ఆ నిమ్నజాతుల సంఘం పక్షాన, తమ గుడిసెల స్థానే త్వరలో చిన్న సిమెంటు యిళ్ళను వేయించమని, అందుకు తగిన ధనసహాయం యిప్పించమని ప్రభుత్వాన్ని అర్థించాడు శివరాం. గుడిసెలలోని కూలివాళ్ళకు సెలవు దినాలలో తోలు బొమ్మలాటలు, హరికథలు, భజనలు, నృత్యాలు ఏర్పాటు చేసేవాడు శివరాం.

> అన్నగారు: ఒసేయ్, సీతా, మీ అబ్బాయి చేపల్ని పడుతున్నాడే.
>
> చెల్లెలు సీత: మీ అమ్మాయి కావాలందిగావును.
>
> జి. యల్. యజ్ఞ. శాస్త్రి, బందరు.

శివరాం దృక్పథంలో పేదవాళ్ళ బ్రతుకులు మెదిలేవి. నిత్యమూ సాధన చేస్తున్న చిత్రలేఖనంలో యీ దృక్పథ ప్రభావం పడక మానలేదు. అందమైన సుందరుల స్వరూపాలు హాయిగొలిపే వెలుగునీడల ప్రకృతిదృశ్యాల వైపు దృష్టిమునుపు మొగ్గించిన శివరాం, బీదల దుర్భర దురంత విషాద జీవితరీతులు నూత్నప్రయోగాలతో చిత్రలేఖనంలో ప్రవేశపెట్టేవాడు. నగర చిత్రలేఖన ప్రదర్శనాల్లో, రాష్ట్ర చిత్రలేఖన ఉత్సవాల్లో శివరాం తన చిత్రాలు పంపించి ప్రేక్షకుల ప్రశంసలు, నిర్ణేతల బహుమతులు పొందాడు. వీధిలో హార్మోనియం వాయిస్తూ పాటలతో భిక్షం అడుగుతున్న సుబ్రాడిబొమ్మ, చెట్టుక్రింద గారడచేస్తూ తన స్వంతకుమారుడి నాలిక కోసేసి ప్రేక్షకులను భయపెడుతూ ముష్టి అడుక్కునే దృశ్యం, శివరాం బహుమతిపొందిన చిత్రాలు. చిత్రలేఖనాకళా నైపుణ్యంలో కొంత ప్రాశస్త్యము పొందినా, తాను గీసిన చిత్రాలు చూసినజనం పొగడుతున్నా, కీర్తిప్రతిష్ఠలు ఎక్కువగా పొందలేకపోయాడు శివరాం సరైన ప్రచారసాధనాలుఉపయోగించుకుని కృత్రిమప్రవర్తన అలవరచుకోలేక.

శివరాంలో ఏర్పడిన మానసిక పరిణామాలు, ప్రాపంచిక ప్రవర్తనలోకూడా ప్రతిఫలించాయి. అసహాయులైన పేదవాళ్ళమీద దయ, నవనాగరిక యువతులమీద నిర్దయ పెరిగిపోయాయి. నాగరిక యువతుల పరిసరాలు త్యజించుకుంటూ దూరంగా మసిలాడు శివరాం. కళాశాలలోని విద్యార్థినులు గాని, నాటకాలలో మునుపు ఎరిగిన నటీమణులు గాని, పొరుగిళ్లలో తన మేడవెనుక నివసించే కంట్రాక్టరులు, ఇంటి యజమానుల స్త్రీలు గాని తారసపడితే, యాదృచ్ఛికంగా పలకరించి నాముభావంగా ఉండడం నేర్చాడు శివరాం. అతని ముభావ ప్రవర్తనవల్ల అతన్ని అభిమానించే స్త్రీసమాజమే దూరమైపోయింది.

ఒకరోజు బస్సులో ఎక్కుతున్నాడు శివరాం. బస్సు ఎక్కే జనంరద్దీలో, పెదాలకు రంగు, ముఖానికి స్నో పౌడర్లు దట్టంగా వేసుకొని సిల్కుచీర సింగారించుకున్న ఒక నవనాగరిక యువతికి శివరాం చెయ్యి పొరపాటున తగిలింది. బస్సులో ప్రథమంగా ఎక్కిన శివరాంకు స్థలం దొరికి కూర్చున్నాడు. ఆయువతి తరువాత బస్సులోకి ప్రవేశించి స్థలంలేక నిలుచుంది. శివరాం ప్రక్కన కూర్చున్న ప్రయాణికుడు ఆ యువతి నిలుచుందని, స్త్రీని గౌరవించాలని నిలుచున్నాడు. శివరాంకూడా లేచి తన స్థలం కూడా ఖాళీచేస్తాడని ఆశతో. శివరాం లేవ

(45-వ పేజీ చూడండి)



సెకండరీ గ్రేడు మేష్టారు సుబ్బారావుకి పాఠం తీరుబడి లేదు.

అతనికి కాలం చాలా ఇరుకుగా వుంది. ఇరుకుగా ఇటూ అటూ గోడలతో కట్టిన బోనులాగా 'కారిడర్'లాగా వుంది.

అతని విడల్పాటి ఆలోచనలు సరదాగా ఇటూ అటూ పచార్లు చేయడానికి వీలు లేకుండా వుంది.

ఇరవై నాలుగేళ్ల సుబ్బారావు ముంగురుల మీద నుంచి కలలు జారుతుంటాయి, కృష్ణశాస్త్రి చెప్పినట్టు. కృష్ణశాస్త్రిగారు అతన్ని గురించి చెప్పలేదనుకోండి. అయితే సుబ్బా వేళ తాడా! అక్కడ నూతి గట్టు మీద తువ్వాలు కట్టుకుని చేదమీద చేద తోడుకుని నీళ్ళు పోసుకుంటూంటే నీటి బిందువులు ముత్యాల్లా ఎర్రని వొంటిమీదనుండి జారతాయి. ఉదయసూర్యుడి చిరువెచ్చని కాంతిలో మెరుస్తాయి. రోజూ పాలు పోసే గొల్లపిల్ల మాత్రం రెప్ప వాల్చకుండా ఆశగా తన వొంటికేసి చూస్తుందని సుబ్బారావుకి తెలియకపోలేదు. కాని వృత్తి గొల్లపిల్లలు మాసిన బట్టలతో, ఆశలతో అందంగా లేని గొల్లపిల్లలు తనకథలో నాయికలుగా వుండడానికి అంగీకరించలేదు సుబ్బారావు.

జబ్బలలోని పిక్కలలోని కండల యొక్క స్పర్శ—ఏదో గర్వాన్ని హాయినీ కల్గిస్తుంది. ఇంత భౌతికంగా వాస్తవంగా ప్రత్యక్షమవుతున్న ఆ బలాన్ని యౌవనాన్ని చూసుకుని మురిసిపోకుండా ఉండలేకపోతున్నాడు సుబ్బారావు.

ఆలాగ గర్వపడనివాడు పక్కా ఆధ్యాత్మికవాది. సుబ్బారావుకి ఆధ్యాత్మికవాదులంటే అంత నమ్మకం లేదు.



హాలీవుడ్ రోనాల్డ్ కోల్మన్‌లాగ, సింహ కిశోరంలాగ బలిష్ఠంగా పసందుగా వున్న దేహాలు కలవాళ్ళని – ఒకళ్ళని చూపెడుదూ!

ఊహుఁ—పది మైళ్ళ రేడియస్‌లో

అయితే ఇటువంటి గాత్రం కలిగివున్న వాడికి ఉండవల్సిన ప్రోస్పెక్ట్స్ ఏవిటి!

ఇలాగ ఒక గంట అయినా ఆలోచిస్తూ,

వొచ్చి వొళ్ళు తుడుచుకుని తను అద్దెకున్న తన వాటాలోకి వెళ్ళాడు. వాటాలో మొదట వంటగదిలోంచి రెండవగదీ, ఆఖరు

★ సుందరి - సుబ్బారావు... ★

రావుకి ఏమీ అభ్యంతరం లేదు.

మొదటిదైన వంటగది దాటుతూంటే వాళ్ళమ్మ 'ఒరేసుబ్బా! మెంతులూ ఆవాలూ అయిపోయాయిరా. స్కూల్ నుంచి వొచ్చేటప్పుడు పట్టుకురా నాయనా" అంటుంది.

'ఓ. అలాగే' అంటూ రెండవగదిలోకి వెళతాడు. అక్కడ చెల్లెలు ఓమూలకూర్చుని బుద్ధిమంతురాలిగా సాంఘిక శాస్త్రం చదువుతూంటుంది.

సుబ్బారావు నవ్వుతాడు. ఎందుకంటే ఆ పుస్తకం పేజీలమధ్య సినీమాపాటలపుస్తకంకూడా ఉంటుందిగా. అయితే సుబ్బారావు తెలీనట్టుగా ఉంటాడు. డిప్లమసీ అంటారే, అదికూడా సుబ్బారావుకి తెలియకపోలేదు.

ఆ గదిలో ఓబల్లవుంది. ఆ బల్లముందు ఓకుర్చీవుంది. ఆ కుర్చీలో కూర్చుంటాడు సుబ్బారావు. బల్లమీద ఒక అద్దం గోడకి జాపెట్టిఉంటుంది. అద్దంఅంటే అంతా కాదు; అసలు అద్దంలో మూడూబై అయిదవవంతు. ఆ మధ్య అద్దం కిందపడినప్పుడు తక్కిన రెండూబై అయిదవవంతు అసలు నుంచి బలద్వియోగం పొంది విడిపోయింది.

ఈ అద్దంలో చూసుకుంటూ సుబ్బారావు ఫుల్లీ ఒకగంట ఆలోచించుకుంటాడు. అద్దంలో అతని మొహం—మూడూబై అయిదవవంతుమొహం—కనపడుతుంది. ఆ పరిమాణంలో తనక క్రాప్పూ, జుట్టూ, ముక్కూ, పెదాలూ, పెదాలమీద అందమైన సన్నని చిన్నని మీసకట్టూ చూసుకుంటాడు. అలాగ చూసుకుంటూ ఆలోచించుకుంటాడు.

ఏమనీ—?

అదిగో, అక్కడే అతని ఆలోచన తారాజువ్వలా దూసుకుపోతుంది. విచిత్రమైన స్వర్గాల్ని తాకుతుంది. నక్షత్రాల్ని 'హలో' అని పలకరిస్తుంది. ఇంకా పైపైన ఏవే విచిత్ర స్వప్నలోకాలు ఉన్నాయో అని గవేషిస్తూ, పర్యవేక్షిస్తూ వెళ్ళిపోతుంది పైపైకి.

తనకున్న పెర్సనాలిటీకి ఒకయూరోపియన్ కంపెనీ యజమాని కనీసం వెయ్యి రూపాయల జీతంమీద మంచి ఉద్యోగం ఒకటి ఎందు కివ్వకూడదూ! ఏం, ఎందుకు యివ్వకూడదూ. అసలు మొదట రాక్ ఫెల్లర్ ఎవడు? ఫోర్డు ఎవడు?

బొంబాయిలోనూ మద్రాసులోనూ, యిళ్ళకన్న స్టుడియోలు ఎక్కువైపోయాయిట. అందులోనూ కొత్తమొహాలకోసం ప్రొడ్యూసర్లూ, డైరెక్టర్లూ ఒకటేగోల పెడుతున్నారట. మరి తనకున్న కట్టూ గెయిటూతో (Cut and gait)—చటుక్కున ఓఛాన్సుతగిలి హీరో అయిపోతే—?

అసలు అంతదూరంవరకూ ఎందుకూ. మిల్లు ఓనర్ ప్రకాశరావు కూతురు—తనుస్కూలు నుంచి వస్తుంటే కారు వయ్యారంగా డ్రైవ్ చేసుకుంటూ ఎదురువస్తుందికదా. చలాకీగా అందంగా ఫ్యాషన్‌గా ఉంటుంది. ఎర్రని పెదవులమీదకి రాబోయే నవ్వు దారితప్పి అలాబుగ్గలమీదకి వెళ్ళిపోయి సరాసరి కళ్ళల్లోకివెళ్ళి కూర్చుంటుంది. బలే అందంగా ఉంటుంది సుమిత్ర! ఒకరోజున కార్లో వెళుతూవెళుతూ తన్ని చూసి, నిదానంగా యింకోమారుచూసి, స్టన్అయి, ఉక్కిరిబిక్కిరై 'ఓహో ఎవరీసుందరవాడు ఇతనికి నా హృదయం యిచ్చేశాను. ఇతనే నా మొగుడు. ఈ నిశ్చయమూ, నిర్ణయమూ మారదు' అని గట్టిగా అనేసుకుంటే—ఏమో ఎవరికి తెలుసూ!

ఇలాంటివన్నీ ఆలోచించుకుంటాడు. అందుకే అతనికి బొత్తిగా తీరిక ఉండదు.

ఒకటి: పరికిణీలు చిరిగిపోయాయి. కుట్టించరా అన్నయ్యా.

రెండు: రెండు వోణీలుకూడా కొనటం-మరచిపోకు.

మూడు: అన్నట్టు పాలవాడు సొమ్ముకోసం నిలతీస్తున్నాడురా అబ్బాయి. వాడికి చాలా అవసరంట!

నాలుగు: ఏమండోయ్ సుబ్బారావుగారూ. మీరు అలాగ సంగీతం పాడేస్తూంటే మా పిల్లలు చదువుకోవాలా అక్కర్లేదా - స్వంత యిల్లు అనుకున్నారేంటిటి.

అయిదు: ఒరేయ్ సుబ్బారావు. అక్కడక్కడ అడిగావే. పాపం. అయిదు రూపాయలు కొడుకదా, అర్ధరూపాయి కూడా లేదురా. నీతోడు.

ఆరు: సైకిల్ కి లైటు లేదేం. నీ పేరు? పని? ఊరు? రేపు పదింటికి కోర్టుకి రా.

ఏడు: ఏయ్ హారన్ వాయిస్తూంటే తప్పుకోవాలని తెలియదూ. నడుస్తూనే నిద్రపోతున్నావా.

ఎనిమిది: చిరంజీవి సుబ్బారావుకి: ఈ నెల జీతాలు మాకు అందలేదు. మీ అత్తయ్యకి వారం రోజులునుంచి జ్వరం. ఒక్క యిరవై రూపాయలుంటే అర్జంటుగా పంపించవల్సింది. జరూరు.

తొమ్మిది: ఈ షర్టింగు గజం అయిదు రూపాయలు. ఏం అలా చూస్తావేం. బట్టలన్నీ తీయించి కుప్ప వేయించావ్. కొనే మొహమో కాదో తెలుస్తూనే ఉంది.

పది: ఏమోయ్ సుబ్బారావ్. స్కూలు వదలగానే ఒకసారి యింటికి రా. రేపు మా యింట్లో సత్యనారాయణవ్రతం చేసుకుంటున్నాం. కొంచెం మార్కెటింగ్ చేసిపెడుదువు గాని. నీకు సరుకునాణెం తెలిసినట్టు యింకెవరికీ తెలియదంటుంది మా ఆవిడ - ఇది కుర్చీలో కూర్చున్న హెడ్మాస్టర్ అబినగల ఒక స్థూలకాయం తాలూకు ఆస్యవివరంనుంచి వచ్చిన ఆజ్ఞ!

ఇలాంటివి గొప్పలు, ముళ్ళు, డొంకలు, రాళ్ళు, గాజు పెంకులు, గోతులు, తేలు కొట్లు, మండ్రగబ్బలు అడుగడుగునా మలుపు మలుపునా తగులుతూన్నా సుబ్బారావు నిస్పృహ చెందలేదు.

ఎప్పుడేనా ఖిన్నుడౌతాడు. గుండె బరువెక్కి ఓ నిముషం చీకట్లనీ కష్టాలనీ తలచుకుంటాడు. కాని అంతా ఓ నిముషం మాత్రమే. మరు నిముషంలో ఆప్టిమిస్టు సుబ్బారావు - ఉత్సాహవంతుడు సుబ్బారావు హుషారుగా ఆలోచించుకుంటాడు.

దెబ్బమీద దెబ్బ తగిలినకొద్దీ ఆలోచన మరీ మధురంగా రమ్యంగా అలంకరించుకుని వస్తుంది.

ఆశ గబుక్కున చావదు.

అందులో యౌవనంలో తగ్గను కూడా తగ్గదు.

ప్రాణికి ఎలాగో అలాగ బతకడానికి ప్రయత్నిస్తుంది. బతకడానికి అవసరమైన ఆనందంకోసం వెదుకుతుంది. ఆశ అనే చేయిని ఊతగా తీసుకుంటుంది.

ఆశ ఆలోచనల్ని రేపుతుంది. కలల్ని జల్లుతుంది.

అందుకే సుబ్బారావుకి ఆలోచించడానికి యీ కాలం సరిపోవడం లేదు. ఆలోచించిన కొలదీ అతనికి రెట్టింపు బలం వస్తుంది. అనవ

ఓట్ల హడావుడిలో

ఒకామె: ఏమండీ, మా అమ్మ నన్ను పంపించింది, ఓటేసి రమ్మని మా అమ్మ. బదులు.

ఆయన: అయితే నీ భర్త పేరేమిటంటే, మీ నాన్న పేరు చెప్పాలి.

జె. యల్. యన్. శాస్త్రి

దం కలుగుతుంది.

ఈ ఆనందం మిథ్యా నిజమా?

వేదాంతం అంటే యిష్టంలేని సుబ్బారావుకి.

అనుభవించినంతసేపూ యిది నిజమే.

తాగి మైకంలో ఉన్నంతసేపూ అదీ ఒక ఆనందమే!

అందుకే ఆలోచనల మద్యాన్ని, మైకేయాన్ని, కల్లుని, బ్రాందీని, వైన్ని, విస్కీని అన్నిరకాలనీ అవిచ్ఛిన్నంగా తాగేస్తున్న సుబ్బారావుకి—

ఆ రోజు సాయంత్రం కల నిజమయేటంత అపాయం జరిగింది.

పిల్లలకి సైన్సుపాఠం చెప్పి లాంగ్ బెల్ కొట్టగానే స్కూల్ దుమ్ముని దులిపేసుకుంటూ గబగబా వస్తూన్న సుబ్బారావుని కారు ఢీకొట్టింది—కొంచెం జాగ్రత్తగానే. ఆ కారుకింక వేరేమార్గం లేదు. ఎందుకంటే సుబ్బారావుని ఆ మాత్రం ఢీకొట్టకపోతే—ఎదురుగా వచ్చే పొగరుమోతులారీ కారుని పచ్చడిచేసి ఉండును.

కనురెప్పపాటులో సుబ్బారావు నేలమీద సాష్టాంగపడి ఓ అరగజం దూరం జర్రుమని జారాడు.

దుమ్ములోంచి – నొసటిమీద ఎర్రని నేత్రాన్నీ కాళ్ళకీ చేతులకీ అరుణకంకణాల్నీ, దేహానికి బూడిదనీ ధరించిన అపరశివుణ్ణి రోడ్డుమీదపోయే యిద్దరు ప్రమథులు లేవనెత్తారు.

'ఎక్స్క్యూజ్ మి' – సన్నని వీణాస్వరం.

కళ్ళమీద ఉన్న కంకరదుమ్ముపల్చని పొరలోంచి సుమిత్ర అస్పష్టరూపం.

'వెరీ వెరీ సారీ' అదే, అవీణాస్వరమే.

'.............'

'కారులో ఎక్కండి ప్లీజ్'


కారు ఓ అందమైన భవనం ముందు ఆగింది. సుమిత్ర అతన్ని చెయ్యిపట్టుకుని మెల్లగా లోపలికి నడిపించింది.

అసలే షాక్ తగిలిన సుబ్బారావుకి సుమిత్ర సన్నిహితరూపమూ, స్పర్శా మరో షాక్ లా తగిలాయి. ఇది నిజమా! లేకపోతే తను చచ్చిపోయి స్వర్గానికి వెళ్ళగా, తనకి సుమిత్ర అంటే యిష్టమని తెలిసిన ఊర్వశో తిలోత్తమో కామరూపులు కాబట్టి సుమిత్ర రూపంలో వచ్చారా?

అయొడిన్ చురుక్కుమనేటప్పటికి అతనికి తెలివి వచ్చింది. కళ్ళు తెరచి కలయచూశాడు. సుమిత్ర, సుమిత్రతల్లి తండ్రీ, గుమాస్తాలూ నౌకర్లూ దగ్గరా దగ్గరాలు.

'ఎలావుంది మీకు' అంది సుమిత్ర.

బట్టని వొంటినీ అంటుకున్న దుమ్ము దులిపేసుకొన్నాడు గబగబా సుబ్బారావు. సిగ్గుపడిపోయేడు సుబ్బారావు. తనేదో తప్పు చేసి



అతిథిలేనిది భోజనం చెయ్యడు.

చిత్రం: ఆర్. సుమిత్రా రెడ్డి.

నట్టు 'క్షమించండి' అన్నాడు సుబ్బారావు.

'ఏంపని చేస్తున్నావబ్బాయీ' అన్నాడు దశలక్షాధికారీ, మిల్ ఓనరూ అయిన తండ్రి.

'ఫలానా స్కూల్లో టీచరునండి.'

'బాగుంది నాయనా. ఏ క్లాస్ హోల్డు చేస్తున్నావు.'

'ఫసుఫారం.'

సుమిత్ర జాలిగా చూసింది. 'నాన్నా. వీరికి తీరుబడివుంటే మన గోపీకి ట్యూషన్ చెపుతారేమో' అంది.

వాళ్ళ స్తామన్నతకానికి, వాళ్ళ రమ్యమైన మైమ్నకి, వాళ్ళ వాళ్ళ మెరమ్నకి అన్నింటికీ వొప్పేసుకున్నాడు సుబ్బారావు సుమిత్రకేసి చూస్తూ. ఒక్క గంతులో అతనికి ఆకాశం అంత ఎత్తు ఎగిరినట్టయింది.

ఒక్క అంగలో వీధిలోకివచ్చి, అక్కడున్న కారుకి కృతజ్ఞతతో మనస్సులోనే నమస్కరించి ఒక్కడూ ఆలోచించుకుంటూ వెళ్ళిపోయాడు.

జీవితంలో ఒక అందమైన అమ్మాయినీ, ఆమె లక్షల్నీ ఒకేసారి పొందకలిగే అదృష్టం తాను కలిగి ఉన్నాడా. ఇటువంటి దైవనిర్ణయం ఏదో లేకపోతే తాను సుమిత్ర కారువల్లనే ఎందుకు దెబ్బతినాలి. ఓహో దేవుడెంత మంచివాడు. ఎంతదూరం ఆలోచిస్తాడుపాపం! బల్లమీద అద్దంలోని తన మొహమే అయినటువంటి ప్రతిబింబం 'అవును' అంది. ఆ ప్రతిబింబాన్ని తానెప్పుడూ నమ్మడు. ఆ నమ్మకం వృథాపోదు.

'సుమిత్ర చూడడంలో మాట్లాడడంలో ఒక అర్ధ్రీభావం లేదా! ఆమె హృదయం ధ్వనించలేదా?' అని అడిగింది ఆ ప్రతిబింబం.

తర్వాత రోజున ట్యూషన్ చెప్పడానికి వెళ్లాడు సుబ్బారావు. అతనికున్న బట్టలలో మంచివీ అందమైనవీ వేసుకుని. సుమిత్ర నవ్వుతూ ఎదురు వచ్చింది.

'నమస్కారం. నయంగా ఉందా మేష్టారూ' అంది.

'నయమేలెండి. అంత పెద్ద దెబ్బలేం కాదుగా' అన్నాడు తలవంచుకుని సుబ్బారావు.

'మొదట ఎంతో భయపడిపోయాను ఏదో పెద్ద ప్రమాదం జరిగి ఉంటుందని. థాంక్ గాడ్. ఏదో నయంగా తేలిపోయింది.'

'కారు పక్కనుంచి డాష్ యిచ్చింది. అదీకాక కారు అంతవేగంగా రావడంలేదు లెండి.'

'పోనీలెండి. ఈ ఏక్సిడెంట్ వల్ల గోపీకి మంచి మేష్టారు వచ్చారు. అన్నట్టు మా గోపీ చెప్పాడు మీరు బాగా పాడతారని.'

'ఏదోలెండి—గాలిపాట' సిగ్గుపడ్డాడు సుబ్బారావు.

'ఎప్పుడో మీ పాట వినాలి. వస్తానండీ నమస్తే' అంటూ హేండ్ బాంగ్ వూపుకుంటూ వయ్యారంగా నడచి వెళ్ళిపోయింది సుమిత్ర.

ఆమె మాట్లాడుతూన్నంతసేపు సరిగా తల ఎత్తలేని తన లజ్జా స్వభావానికి చాలా చిరాకుపడిపోయాడు సుబ్బారావు. కాని ఆమె ఎంత సరదాగా హాయిగా మాట్లాడింది! రోజూ యిలాగే తనతో మాట్లాడితే బావుండును.

'లెక్కలు చెప్తారా మేష్టారూ' అని గోపీ అనేటంతవరకూ అతను అన్యమనస్కుడయే ఉన్నాడు. 'బీజగణితము—రేఖాగణితము' అన్న గణిత

★ సుందరి - సుబ్బారావు... ★

బోధినిలోని అధ్యాయాన్ని చూసి యీ మనస్థితిలో ఆ పాఠం చెప్పడంకన్న రసాభాసను వేరే ఉండదనుకున్నాడు.

ట్యూషన్ ప్రారంభించి ఒక వారం రోజులయింది.

ఈ వారం రోజులూ సుమిత్ర రూపం కాని, వాక్కు కాని, అడుగు సవ్వడి కాని కనపడలేదు, వినపడలేదు సుబ్బారావుకి.

నిరాశ మెల్ల మెల్లగా వల్లవల్లగా ఆవరిస్తోంది సుబ్బారావుని. నీరసం వస్తోంది.

అతనిమీద అతనికిగల విశ్వాసం సన్నగిలి వేసవికాలపు ఏటిపాయలాగ భయపడి సిగ్గుపడి ఏడుపులాంటి యిసుక నేలమీద యింకిపోతోంది.

అద్దంలో అతని స్వప్రతిబింబం హెచ్చరించడం మానివేసింది.

ఇటువంటి విపత్ సమయంలో— ట్యూషన్ చెప్పి వీధి గేటుదాకా అడుగులు వేసిన సుబ్బారావుని

'మేష్టారూ, అక్కయ్య మిమ్మల్ని పిలుస్తోంది.' అన్నాడు గోపి. గోపి ఆ సమయంలో మురళి వాయిస్తూన్న బాలకృష్ణుడిలాగా కనుపించాడు సుబ్బారావుకి. బదులుగా ఆశగా గోపి వెనకాలనే హాలుదాటి ఏవేవో గదులుదాటి ఓ గదిలోకి వెళ్లాడు.

ఒక పెద్దగదిలో విరుగుడు చేవకర్రతో చేసిన సొగసైన మంచం మీద మెత్తని వెల్వెట్ దిండ్లు ఆనుకుని వడిలీ వడలని పువ్వులా పడుకుంది సుమిత్ర.

కిటికీలకి తెరలువాల్చి ఉన్నాయి. గోడలలోనే అమర్చబడిన విద్యుద్దీపాలు నీరెండలాంటి కాంతిని గది అంతా ప్రసారిస్తున్నాయి.

'రాండి మేష్టారూ' అంది సుమిత్ర.

అలవాటులేని ఆ పరిసరాలకీ, స్నేహశీలమైన ఆమె ఆహ్వానానికీ తొట్రుపడుతూ ఆమె చూపించిన కుర్చీలో ఆమె మంచానికి అనతిదూరంలోనే కూర్చున్నాడు.

'నిన్నటి నుంచి జ్వరంగా ఉంది. ఒకరైనీ ఏమీ తోచడంలేదు. పోనీ మీతో కబుర్లాడుతూంటే—' నవ్వింది సుమిత్ర.

'తప్పకుండానండి.'

'మీకేమీ పనిలేదుకదా.'

'ఏంలేదండి. ఈ ఒక్క ట్యూషనే నాకు వున్నది.'

'అయితే యింక చిక్కేలేదు.'

ఈ రోజున చెల్లెల్నీ తల్లినీ సినిమాకి తీసుకువెళతాను రెడీగా వుండమన్నాడు సుబ్బారావు. వాళ్ళు కనిపెట్టుకుంటారన్న బాధని గట్టిగా నొక్కిపట్టి నోరెత్తకుండా చేశాడు.

వాళ్ళ కబుర్లు సుబ్బారావు స్కూలునీ, లేటెస్టు పిక్చరునీ, సుమిత్ర కాలేజీనీ, స్పోర్ట్సునీ, రాజకీయాల్ని ఒకొక్కటే దాటి చివరకు సంగీతందగ్గరకు వచ్చాయి. సంగీతదర్శకులనీ, పాడేవాళ్ళని అందరినీ తిరగేసి చాలామటుకు ఇద్దరూ చాలావిషయాలలో ఏకాభిప్రాయం కలిగివున్నట్లు తెలిసికొన్నారు.

'మీరేమైనా పాడండి మేష్టారూ.'

సిగ్గుపడ్డాడు సుబ్బారావు. పాడాలి తప్పదంది సుమిత్ర. సుబ్బారావు పాడాడు.

నిజంగా బాగాపాడాడు. సుమిత్ర నిట్టూర్చింది.

'అదేం' అన్నాడు సుబ్బారావు.

'మీపాట నన్ను కదిలించేసింది.'

భారతరత్న బిరుదు యీ మెప్పుముందు ఏపాటిది! ఎనిమిది గంటలకు వెళతానని లేచాడు సుబ్బారావు. సుమిత్ర కృతజ్ఞతతో 'థాంక్స్. మీస్నేహం కలగడం నాఅదృష్టం' అంది.

తాగి మైకంలో ఉన్నవాడిలా ఇంటికి వెళ్ళాడు. తల్లికీ చెల్లెలికీ ఏదో సాకు చెప్పాడు. టేబిలుమీది అద్దంలో తన ప్రతిబింబాన్ని ఆదేపనిగా చూసుకున్నాడు. ఎప్పుడూ లేనికాంతి ఆకళ్ళల్లో! ఎప్పుడూ లేనిఅందం ఆ మొహంలో!

భోంచేశాక చెల్లెలు 'అబ్బ, గోంగూర పచ్చడిలో కారం ఎక్కువయింది బాబూ' అంది.

'గోంగూరపచ్చడేమిటి' అని విసుగ్గా అడిగాడు సుబ్బారావు.

'నువ్వు తినలేదూ' అని అడిగింది చెల్లెలు.

'ఎప్పుడు?'

'ఇప్పుడే.'

'ఎక్కడ?'

'ఇక్కడే. అదేమి టన్నయ్యా అలా మాట్లాడుతావ్. ఇప్పుడన్నంలో కలుపుకుని తినికూడా'...

సుబ్బారావు కాబోలనుకున్నాడు. అతని ఉదాత్త మనస్థితిలో చప్పు గోంగూరపచ్చడి వంటి విషయాలకి తావులేదు.

అతనికి కలతనిద్ర పట్టింది. నిద్రలో సుమిత్ర కనబడింది. మెత్తని తెల్లనివొంపులు తీరిన ఆమె వొళ్ళూ, వొంటిమీద కొంచెం నలిగిన తెల్లని వాయిల్ చీరా, సంస్కరింప

జడని ఆమె జుట్టు చిందరవందరగా ఆమె నున్నని మెడమీదా, బుగ్గలమీదా - జ్వరం వేడికి మరికొంత ఎరుపెక్కిన చిన్ని పెదవుల కదలికా — ఈ అప్రయత్న అలంకృతమైన ఆమెరూపంలోని సహజసౌందర్యం అతని మనస్సుని వెయ్యి అత్తరుసీసాలు పగలగొట్టినంత సౌరభంతో ముంచెత్తి ఉక్కిరిబిక్కిరి చేసింది.

తర్వాతరోజున ట్యూషను ఇంకా చెపుతూండగానే లోపలినుండి సుమిత్ర 'నమస్తే మేష్టారూ' అంటూ వచ్చింది.

'నమస్తే నమస్తే' అంటూ లేచినిలబడ్డాడు సుబ్బారావు. 'మీ వంట్లో ఎలావుంది.'

'ఈ రోజున నయమే. చారూ అన్నం తిన్నాను. అలా షికారు పోదాం రండి. మీ కంపెనీ వుంటే—'

'ఇంకా ట్యూషన్...' నసిగాడు సుబ్బారావు.

"ఫర్వాలేదులెండి...ఒరేయి గోపీ,పోయి ఆడుకో.'

కారు తిన్నగా నది వొడ్డుకి వెళ్ళి ఆగింది. ఇద్దరూ దిగారు. అంతా నిర్జనంగా వుంది. ఇసుక ఉన్న స్థలంచూసి ఇద్దరూ కూర్చున్నారు. ఇటూఅటూ తోటలు, తోటగట్లవె వరుసల్లో వందలకొద్దీ తాటిచెట్లు, తాటితోపు వెనుక ఆకాశంమీద ఎర్రని కుంకుమ, నదిమీదనుంచి అలలు అలలుగా చల్లనిగాలి, గాలికి కదలుతున్న ఆమె ముంగురులు, ఆమె షిఫాన్ చీర పైట, పైట అంచు అలా అలా కదలి అతని కాళ్లనీ మొహాన్నీ తగలడం—

వాళ్ల మాటలు ఎక్కడనుంచి ఎక్కడికి వెడుతున్నాయో తెలియదుగాని చటుక్కున ఆమె ఇలా అడిగింది. 'మీరింకా పెళ్ళిచేసుకోలేదేం?"

"నన్నెవరు చేసుకుంటారు?"—గొప్ప డిప్లమసీ ఉపయోగించి అన్నాడు సుబ్బారావు యీమాట. ఇలాగ అన్నందుకు తన తెలివికి తనే ఆశ్చర్యపోయాడు. ఇప్పుడు సుమిత్ర ఏం జవాబు చెపుతుంది? ఆ జవాబులో తన భవిష్యత్తు గర్భితమై ఉంటుంది.

"ఎవరయినా చేసుకుంటారు. మీకేం, దొరలా ఉన్నారు" అంది సుమిత్ర నవ్వుతూన్నా సీరియస్ గా.

సుబ్బారావుగుండె గబగబ కొట్టుకుంది - ఆనందంవలన; ఆ జవాబులో సూచింపబడిన అర్థంవలన; చటుక్కున ఆమె మృదు హస్తాన్ని చేతిలోకి తీసుకుని ముద్దెట్టుకోవాలనుకున్నాడు. కాని అప్పుడేకాదు. ఇప్పటికి రెండవ మెట్టు ఎక్కాడు. మొదటిమెట్టు వాళ్లింట్లో ట్యూషన్ కుదరడం!

రోజులు గడుస్తున్నాయి. రోజూ కాకపోయినా రెండు మూడు రోజులకొకసారైనా ఇద్దరూ షికార్లు వెళుతున్నారు. సినిమాలకి వెళ్లుతున్నారు. పరిచయం గాఢతరమాతోంది. డ్రైవ్ చేస్తోన్న సుమిత్ర, కబుర్లు చెప్పే సుమిత్ర, పచ్చికమీద చేతులు తలాడగా పెటుకుని ఆకాశంలోకి చూస్తూ పడుకున్న సుమిత్ర, చిరుకోపం నటించే సుమిత్ర—ఇన్ని రకాల రూపాలు, వ్యక్తిత్వాలు, అందాలు సంతరించుకుని సుమిత్ర అతని మనస్సునీ కళ్లనీ గుండెనీ ఆక్రమించివేసింది.

సుబ్బారావు ఇంటిపనులు చూడడమే మానివేశాడు. తల్లికి దగ్గువస్తే మందు తీసుకురాడు. చెల్లెలికి రిబ్బనుముక్క కూడా కొనడు. వంటచెరుకు అయిపోయిందని వరుసగా మూడురోజులు చెప్పి నాలుగవ రోజున తల్లి ఏడిస్తే అప్పుడు తీసుకువచ్చాడు. ఎందుకంటే అతనికి తీరుబడిలేదు. ఈ కాలం సరిపోవడమూ లేదు. సుమిత్రనిగురించి ఆలోచించుకోవాలి కదా, కలలు కనాలి కదా, తర్వాత ఆమె ఇంటికి వెళ్ళేందుకు డ్రెస్ వేసుకోవాలి కదా, నెల జీతం పెట్టి, మాంచి పాంట్లూ, బ్లాజులూ, స్నో, పౌడరు, బ్రిల్ క్రీమ్, సెంట్లూ కొనె కాడుకదా. ఇవన్నీ వొంటికి రాసుకోవాలి, తయారవాలి. అప్పుడు సుమిత్ర దగ్గరకు వెళ్ళాలి. మరి యింటిపనులు చూసేందుకు తీరికేది! తీరిక ఉన్నా డబ్బేదీ? తాను మాత్రం ఏం చెయ్యగలడు పాపం!

'ఏరా సుబ్బా, జీతం అంతా అలా తగలేసే నెల ఎలా గడుస్తుంది రా, అంది తల్లి. మాట్లాడలేదు సుబ్బారావ్.

'మమ్మల్ని బతికుండమన్నావా, పస్తులుండి చావమన్నావా.' నాలుగు రోజులు పోయాక అడిగింద తల్లి. వినిపించుకోలేదు సుబ్బారావు.

'నా ప్రారబ్ధం నాయనా. ఇంకా ఎన్నాళ్ళు చుట్టుపక్కలవాళ్ళ దగ్గర అప్పులు చెయ్యను. ఇంక నేను నుయ్యో గొయ్యో చూచుకుంటాను. నా కర్మ. నా కర్మ' తలబాదుకుని ఏడుస్తోంది పదిరోజులు పోయాక తల్లి. 'నీభావన్లా, నీ సుఖమే ఎప్పుడూనూ. నేనూ ఎక్కడేనా దాసిపిల్ల కింద చేరి అంట్లు తోముకుని బతుకుతాను లే అన్నయ్యా' కన్నీళ్ళు వరదలై పారాయి చిన్నారి చెల్లెలు లేత బుగ్గలమీద......

'ఏనుగుల్లా యిన్నేళ్ళొచ్చాయి బుద్ధి ఉండొద్దూ. తల్లి నలా ఉసురు పెడుతున్నావ్.' అంది మజ్జిగపోసి సువిష.

ఏడుపొచ్చింది సుబ్బారావుకి. తల్లి కాళ్ళు పట్టుకున్నాడు. బతిమాలాడు. తనకీ సుమిత్రకీ గల పరిచయాన్ని గురించి చెప్పుకున్నాడు. 'సుమిత్ర నన్ను తప్పక పెళ్ళిచేసుకుంటుం దమ్మా. ఇంక మనకి కష్టాలు ఉండవ్,' అని చెప్పాడు సుబ్బారావు.

'అయ్యో వెర్రినాయనా. ఆమె కోటీశ్వరురాలి బిడ్డరా నాయనా. నక్క ఎక్కడ నాగలోకం ఎక్కడరా సుబ్బా' అనికొడుకు అమాయకత్వానికి జాలిపడింది. ఈసారి సుబ్బారావు మళ్లీ చెప్పాడు ఈకాలంలో ప్రేమకి ఇచ్చేవిలువ, ప్రేమించినవాళ్ళని తప్ప పెళ్ళిచేసుకోని భారతీయ తరుణీమణుల వికాసమూ, సుమిత్రతో తన కారు షికార్లూ, నదీసైకత విహారాలూ...'అమ్మా ఆమె పడకగదిలోకికూడా నేను నిరాఘాటముగా వెళ్ళిపోతానమ్మా. ఇంకేం చెప్పమన్నావు. నమ్మ నా మాట నమ్మ' అన్నాడు.

తల్లికి నమ్మకతప్పలేదు. కళ్ళు పెద్దవి చేసుకుని వింది. ఆధునిక యువతుల స్వేచ్ఛని గురించి విన్నదే కాని తనకుమారుని ప్రేమించేటంత పరిణామానికి వచ్చిందన్న సంగతి గుర్తించలేకపోయింది. మొన్నటివరకూ ఈ కాలపుపిల్లలు పాడైపోతున్నారన్న నిర్ణయాన్ని ఆమె సడన్ గా మార్చివేసుకుంది. తృప్తిగా నవ్వుతూ, ఆనందం కలకలలాడే మొహంతో తల్లి కొడుకును అస్పష్టంగా ఆశీర్వదించింది. పక్కనే వింటోన్న చెల్లెలు కళ్ళల్లో ఆశ, మెరపు, హోయి—ఝులం ఝులించాయి.

తల్లి లేచి లోపలికివెళ్ళి తిరిగివచ్చి కొడుకుచేతిలో ఒక బంగారుకాసు పెట్టి ఇలాగ అంది: 'నాయనా. ఇంటి కంతటికీ ఇది బంగారం. చెల్లెలికి శ్రావణానికి లోలకులు చేయించాలని ఉంచాను. ఇది ఎక్కడేనా తాకట్టుపెట్టి కావల్సినసరుకులు తీసుకురా. మళ్ళీ విడిపించుకుందాం-దేవుడి దయవుంటే'

'దేవుడిదయఅంటే అన్నయ పెళ్ళేనా' అంది తెలివైన చెల్లెలు. (తాకట్టు అంటే గుండెలో కలుక్కుమన్నా కాసుని జాగ్రత్తగా జేబులో పెట్టుకొని, వెళ్ళిపోయాడు సుబ్బారావు

ఆ రోజున ఉదయమే సుమిత్ర ఆదేశానుసారంగా సుమిత్ర యింటికి వెళ్లాడు. ఆమె నవ్వుతూ గేటుదగ్గరే ఎదురొచ్చింది. ఆమె విదేశీయమైన శాక్ తొడిగి పైన అందమైన బనీను వేసింది. జుట్టుని వెనకాల ముడవేసి

(64-వ పేజీ చూడండి)

"ఏకాభిప్రాయం"

బిచ్చగాడు: యీ యింట్లో కుర్రవాడు మొదలు పెద్దవాళ్లదాకా ఒకటేమాట 'ఫో' 'ఫో'.

గృహయజమాని: ఔను మా అందరదీ ఒకటేమాట. మా యింట్లో భేదాభిప్రాయలు లేవు. ఏకాభిప్రాయం! ఏకగ్రీవం!!

నాదెళ్ల రామచంద్రరావు, సికింద్రాబాదు

రాశిఫలాలు

★ దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి ★

3-2-1960 బుధవారం మొదలు

9-2-1960 మంగళవారం వరకు.

మేషం:

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

ఈవారం సంతోషప్రదమైన సమయం. సంఘంలో పలుకుబడి క్రమంగా పెరుగుతుంది. వృత్తిలోకూడా మీ ధర్మాన్ని చక్కగా నెరవేర్చుకో గలుగుతారు. కొన్ని సమయాలలో లభించిన అవకాశం చేతిలోనుంచిజారి పోయే సూచనలు కనిపించినా ఆందోళన చెందవలసిన అవసరంలేదు. తొందరపడకుండా వ్యవహరించటంవల్ల మేలు కలుగుతుంది. మొత్తంమీద మీ కార్యభారం చాలావరకు తగ్గిపోయి మనశ్శాంతి లభిస్తుంది. ప్రయాణసూచన లున్నవి. బాహ్యవిషయాలలో గౌరవంకోసం శ్రమ చేయవలసివస్తుంది, అందువల్ల ఫలితం అంతగా కనుపించకపోవచ్చు. కుటుంబంలో ఆనందంగా ఉంటుంది. ఆదరణ లభిస్తుంది. తలపెట్టిన కార్యక్రమాలు సకాలంలో జరుగుతవి. వారాంతంలో అనారోగ్యం చేస్తుంది. ఇతరులవద్దనుంచి రావలసినధనం శీఘ్రంగా రాదు, 6.7 లలో శుభవార్తలు, ధనలాభం. వ్యవహార జయం.

వృషభం:

(కృత్తిక 2, 3, 4, పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

మనస్సులో ఆందోళన క్రమక్రమంగా పెరుగుతుంది. కార్యరంగంలో ఏదోవరకు ఒక విధమైన అదుర్దా. తీరా దిగిన మరునిముషం నుంచీ మరొకవిధమైన చిక్కులు. వీటివల్ల మీ స్వంతమనుష్యులనుకూడా సంతృప్తిపరచలేనిస్థితి ఏర్పడుతుంది. మొదట్లో శీఘ్రంగా జరిగేటట్లు కనుపించిన పనులన్నీ క్రమంగా వాయిదాపడుతవి. ఈ సమయంలో మీఆత్మవిశ్వాసం మాత్రమే మిమ్ములను కాపాడుతుంది. నిదానంగా ఉండటంవల్ల అన్నివిధాలా మేలు పొందగలుగుతారు. వారం రెండవభాగంలో మిమ్ములనుగురించిన అపవాదులు తొలగిపోతవి. దండుగ ఖర్చులు, తొలగిపోయి మనశ్శాంతి లభిస్తుంది. వృత్తిలో అభివృద్ధికరమైన మార్పులు రాగల అవకాశాలున్నవి, స్నేహితులవల్ల సాహాయ్యం లభిస్తుంది. 8,9 లలో అకస్మాద్ధనలాభం. అధికారుల స్నేహం లభిస్తుంది.

మిథునం:

(మృగశిర 3, 4 పా. ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

సాధ్యమైనంతవరకు చూసీ చూడనట్లు తప్పుకునిపోతూ ఉండవలసిన సమయం. అనవసరంగా కార్యభారం పెరుగుతూ ఉంటుంది. అందువల్ల ప్రయోజనంమాత్రం కనుపించదు. ఇతరుల కలహాలలో జోక్యం కలిగించుకోకుండా జాగ్రత్తపడటం, మంచిది, స్వంత పనులలో తొందరపడటం. అందువల్ల సక్రమమైన ఫలితాన్ని పొందలేకపోవటం జరుగుతూ ఉంటుంది. కుటుంబంలో మీ శ్రమకు తగినంత ఆదరం కనుపించక పోవచ్చు. కాని జరుగవలసిన కార్యక్రమాలు యథాప్రకారం సాగిపోతూ ఉంటవి. ఇంతకుముందు మీరు ఇతరులకు చెప్పిన మాటను కాపాడుకోగలుగుతారు. ప్రయాణాలు సుఖంగా జరుగగల సమయం. ఆదాయం బాగానే ఉంటుంది కాని, ముందు దుబారా ఖర్చులుచేసి, ముఖ్యావసరాలకు ఇబ్బంది పడతారు. 3, 4 లలో వ్యవహార జయం. క్రొత్త పనులు ప్రారంభించటం. వృత్తిలో అనుకూలత.

> **గ్రహస్థితి**
>
> కన్యలో రాహువు; ధనుస్సులో కుజ గురు శుక్ర శనులు; మకరంలో సూర్యుడు; మకర కుంభాలలో బుధుడు; మీనంలో కేతువు; మేష వృషభ మిథునాలలో చంద్రుడు.

కర్కాటకం:

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)

మీకు అన్నివిధాలా అండగా ఉండి సహాయం చేయతగిన మనుష్యులకు చిక్కులు రావటంవల్ల మీ కార్యక్రమాలకు అంతరాయం కలుగుతుంది. మీ స్వశక్తితో చేసుకొని మాట దక్కించుకుంటారు. అకస్మాత్తుగా మీవల్ల ఇతరులకు అపకారం జరిగిందనే అపవాదులు రాగల సూచన లున్నవి మీరు మాత్రం ఏ విషయంలోను తొందరపడటం మంచిది కాదు. ఇతరుల శుభ కార్యక్రమాలలో పాల్గొంటారు. మనస్సులో ఏదో ఒకవిధమైన ఆందోళన, నిరుత్సాహం కనుపిస్తూ ఉంటవి. ఆదాయం బాగా పెరిగే అవకాశాలున్నవి. కుటుంబంలో అన్ని విషయాలలో సంతృప్తికరంగా ఉంటుంది. స్వరాష్ట్రులతో నే ప్రయత్నాలు అనుకూలించగలవు. రాజకీయాలలో గౌరవంమాత్రం దక్కించుకోగలుగుతారు. శ్రమ అధికం. 8, 9 లలో వృథా శ్రమ, మిత్రులతో విరోధం.

సింహం:

(మఘ, పుబ్బ, ఉత్తర 1 వ పాదం)

ప్రత్యేకించి శ్రమ, ధనవ్యయము కనుపిస్తున్నా ఆ పని నెరవేర్చి గౌరవం కాపాడుకోవలయునని పట్టుదల పెరుగుతుంది. దైవానుగ్రహంవల్ల మీ ప్రయత్నాలు నిరాటంకంగా కొనసాగుతవి. ప్రయాణకార్యక్రమాలు సుఖంగా నెరవేరగలవు. అధికారుల స్నేహము, ఆదరము, లభించగలవు. వృత్తి వ్యాపారాలలో సంతృప్తికరమైన ఫలితాన్ని పొందగలుగుతారు. వ్యవహార రంగంలో మీ ఆలోచనలు కార్యరూపంలోకి వస్తవి. విలాస వినోద వస్తువులతో నే అవకాశాలున్నవి పిల్లల ఆరోగ్యం సరిగా ఉండకపోవచ్చు కొన్ని సమయాలలో మీరు తలపెట్టిన పనులు సకాలంలో జరుగకపోయినా చివరకు ఫలితం మాత్రం సంతృప్తికరంగా ఉంటుంది. వారాంతంలో ఇతరుల పనులవల్ల మీ ఆదాయానికి భంగం కలిగే సూచనలున్నవి. పుణ్యకార్యాలు జయప్రదంగా నిర్వహించగలుగుతారు 3, 4 5 లలో అదృష్ట సూచనలు, కార్యసిద్ధి, విలువగల వస్తువులు కొంటారు.

కన్య:

(ఉత్తర 2, 3, 4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

ఈ వారం మీ కార్యక్రమాలకు ఒక నిర్ణయం అనేది ఉండదు. ఆయా సమయాలలో అకస్మాత్తుగా జరిగిపోతూ ఉంటవి. కాని మనస్సులో మధ్య మధ్య అదుర్దా కలుగుతూ ఉంటుంది. చివరకు ఆలోచిస్తే కారణంమాత్రం ఉండదు. వృత్తిలో మీ ధర్మాన్ని సక్రమంగా జరుపుకుని అవతలివారి ఆదరాభిమానాలను పొందగలుగుతారు. దుర్మార్గుల కుట్రయుక్తులవల్ల స్నేహితులు మిమ్ములను అనుమానించటం జరుగుతుంది. ఇతరుల కలహాలలో జోక్యం కలిగించుకుని సర్దుబాటు చేయవలసినస్థితి వస్తుంది. శుభవార్తలు తెలుస్తవి. మొదట్లో డబ్బుకు ఇబ్బంది వచ్చే సూచనలు కనుపిస్తవి కాని సమయానికి లభిస్తుంది. కుటుంబంలో స్వల్ప విషయాలలో అభిప్రాయభేదాలు వచ్చి సర్దుబాటు కాగలవు. 3, 4 తేదీలలో మనస్సులో విచారము, కార్యభంగ సూచనలు, స్వల్పలాభం,

తుల :

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

ఎప్పటికప్పుడు విశ్రాంతిగా ఉందామని అనుకుంటు భారమైన పనులు పెట్టుకుంటు ఉంటారు. కార్యసాఫల్యం ఉంటుంది. కాని విశేషంగా శ్రమ కనుపిస్తుంది. వృత్తి వ్యాపారాలలో మాట పట్టింపులు, నిష్కారణమైన జగడాలు రాగల అవకాశాలున్నవి. విద్యావంతులు గౌరవనీయులు అయినవారి సహాయ సంపదవల్ల మీరు ఉన్నతస్థితి పొందగల అవకాశాలున్నవి. లోగడ మిమ్మలను కొంత నిరాదరణగా చూచినవారే ఈ సమయంలో మీకు అనుకూలిస్తారు. ధనాదాయం కొంతవరకు పెరిగే అవకాశాలున్నవి, కుటుంబంలో సంతృప్తికరమైన సమయం. శుభకార్య ప్రయత్నాలలో ఒక నిర్ణయం చేయగలుగుతారు. మీ ఆరోగ్యం, పిల్లల ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. వారాంతంలో ఒకరని సంతృప్తిపరచటం నిమిత్తం చేసిన పనివల్ల మరొకరికి ఇబ్బంది కలిగే సూచన ఉన్నవి. ఖర్చులు అధికంగా ఉంటవి. 8, 9 లలో గౌరవప్రాప్తి. ఆకస్మిక ధనలాభం. దూరముందున్నవారి వద్దనుంచి శుభవార్తలు.

వృశ్చికం:

(విశాఖ4 వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ).

మీరు ఈ సమయంలో ఎదటివారిని ఏ భావంతో చూస్తున్నారో అవతలివారు కూడా మిమ్మలను ఆ అభిప్రాయంతో చూడక పోవటంవల్ల మానసికంగా అశాంతి కలుగుతుంది. అందువల్ల అన్ని సౌకర్యాలు ఉండికూడా అనుభవించటానికి ఉత్సాహం కనుపించదు. ధనాదాయం బాగాఉంటుంది. శ్రమపడి మీ మాటను చలామణి చేసుకోగలుగుతారు. కుటుంబ విషయాలలో ప్రశాంతత గోచరిస్తుంది, మీరు ఎదురుచూస్తున్న వార్తలు సకాలంలో అందుతవి. ఉపకారం చేయబోయినచోట విరోధాలు రాకుండా చూచుకోవండి. ధన విషయంలో మీ సహాయం ఎదురుచూచే మనుష్యులు అధికమౌతారు. వారాంతంలో స్వంతపనులలో అశ్రద్ధ కలుగుతుంది. ఇతరుల వద్దనుంచి రావలసినధనం సకాలంలో రాదు. 3, 4 లలో దేహ అస్వస్థత, ముఖ్యమైన పనులలో పొరపాట్లు.

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా)

స్థిమితమైన సమయం. ఏపని తలపెట్టినా మీ ప్రయత్నం అనేది నిమిత్తమాత్రమే. వ్యవహారరంగంలో మీ మాట చక్కగా చెలామణి అవుతుంది. పదిమందియొక్క ఆదరాభిమానాలు, సహాయము లభిస్తవి. సంఘంలో తలవని తలంపుగా ఉన్నతస్థితి లభిస్తుంది. ఇంతకుముందు మీతో పోటి చేస్తున్న మనుష్యులు ఈ సమయంలో మిమ్మలను అనుసరించుకుని ఉంటారు. కొన్ని సమయాలలో మీ ఉద్రేకస్వభావంవల్ల అంది వచ్చిన ఫలితాన్ని జారవిడుచుకుంటారు. ఉష్ణప్రకోపంవల్ల అనారోగ్యం చేయగల అవకాశా లున్నవి. ఇంతకుముందు మీరు చేసిన శ్రమ ఫలిస్తుంది. మీ ఆరోగ్యం గురించి అశ్రద్ధగా ఉండవద్దు. ప్రయాణాలు చేయవలసివస్తుంది. తలవని తలంపుగా ఇతరుల మనస్సుకు బాధ కలిగేటట్లు మాట్లాడటం జరుగుతుంది. 8, 9 లలో విలాస వినోదాలు, దైవకార్యాలు, ధనప్రాప్తి.

మకరం :

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)

ఏ పని ప్రారంభించినా సులభంగా ఉంటుందనిమాత్రం అనుకోవద్దు. మొత్తం మీద నిదానంగా నెరవేర్చి ఫలితం పొందగలుగుతారు. నిరుత్సాహంమాత్రం కలుగదు. పోటివారిలో గౌరవంనిలుస్తుంది. కుటుంబంలో ఖర్చులుఅధికంఅవుతవి. ఆదాయంకూడా కొంచెం హెచ్చుతక్కువగా లభిస్తుంటుంది. మీరు ఇతరుల నిమిత్తం చేసిన శ్రమ అనుకూలిస్తుంది. ఆయుధాలవల్లగాని, అగ్ని, యంత్రాలు మొదలయినవాటివల్లగాని బాధకలిగే అవకాశాలున్నవి. జాగ్రత్తగా ఉండటం మంచిది. వ్యవహార విషయాలు ఎటూ తేలవు. ఇంతకుముందు మీవల్ల ఉపకారం పొందిన మనుష్యులు మీకు అన్నివిధాలా అండగా నిలబడతారు. ప్రయాణం చేయవలసిన సూచనలు కనుపిస్తవి. కాని ఆటంకాలు వస్తవి. మీ రహస్యాలను బయటకు లాగటానికి ప్రయత్నించే మనుష్యు లుంటారు. జాగ్రత్తగా ఉండండి.

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా)

చాలావరకు సుఖము, శాంతీ లభిస్తవి. వ్యాపార వ్యవహారవిషయాలలో ఎక్కువ శ్రద్ధతో పని చేయ గలుగుతారు. అవసరమైనంతవరకు లోపంలేకుండా ధనాదాయం బాగుంటుంది. మీకంటె తక్కువ అంతస్తులో ఉండేవారివల్ల చిక్కులు రాగల అవకాశాలున్నవి. అందువల్ల కొద్దిగా ధననష్టంమాత్రం రావచ్చు. దైవకార్యాల యందు, సత్కథా విషయాలయందు ఆసక్తి, అవకాశము లభిస్తవి. మీరులోలగి ఉందామనుకున్నా తప్పనిసరిగా కార్యభారం పైనవేసుకోవలసి అవసరం కలుగుతుంది. బంధుమిత్రుల సహాయం లభిస్తుంది. సంఘకార్యాలలో తరచూ పాల్గొంటారు. అధికారులతో పేచీలువచ్చి చిల్లరగా పరిష్కారం అవుతవి వారాంతంలో సేవకుల వల్ల నష్టసూచనలున్నవి. కుటుంబంలోనివారి అనారోగ్య కారణాలవల్ల, ఖర్చులు అశాంతి కలుగుతవి. 6, 7 లలో మిత్రులతో కలహసూచనలు, వృథాశ్రమ, వ్యవహార పరిష్కారాలు.

మీనం :

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి)

తలపెట్టినపని సాంతంగా జరిగేందుకు ఏ మార్గంలో నడుస్తుందో అర్థంకాదు. ఆందోళనపడుతూ ముందుకు పోతుంటారు. తగినసౌకర్యాలు కనుపించకపోయినా బయటపడకుండా మీ కార్యక్రమాలను కొనసాగించుకో గలుగుతారు. దేహసౌఖ్యం మాత్రం తక్కువ. వృత్తి ఉద్యోగాలలో ఇంతకుముందు మీరు అనుకున్నంతబాధ ఉండదు. పోటివారి ఆదరాభిమానాలు లభిస్తవి. ఆదాయాన్ని మించిన ఖర్చులు వచ్చిపడుతవి. మీ స్వంతవిషయాలలో ఇతరులు జోక్యం కలిగించుకోకుండా చూచుకోవటం అవసరం. చిన్నచిన్న ప్రయాణాలు జరిగే అవకాశాలున్నవి, కుటుంబ విషయాలలో మీ అభిప్రాయాన్ని మార్చుకుని కార్యసాధనకు ప్రయత్నించవలసి వస్తుంది. 8, 9 లలో విలువగల వస్తువులు కొంటారు. పిల్లలవలన సుఖసంతోషాలు, ఆకస్మికధనలాభం.

★

చెప్పుదెబ్బ

ఎస్. రామచంద్రమూర్తి

కాళిదాసంటే భోజరాజు ఆస్థానంలోని మిగిలిన పండితులకి గిట్టేది కాదు. కారణం ఆయన పాండిత్యం ముందు వాళ్ళెందుకూ పనికిరాకుండా పోవటమే! ఎప్పుడూ ఆయన్ని ఎలాగయినా అవమానపర్చాలనీ, భోజరాజుకి ఆయనమీద ద్వేషం కలిగించాలనీ - పన్నాగాలు పన్నుతుండే వారు.

ఆరోజు భోజరాజుతండ్రి తద్దినం. పండితుల నందరినీ భోజనాలకి పిలిచారు. సమస్తమయిన పిండివంటలతో భోజనాలుపూర్తిచేసి తాంబూలాలు వేసుకుంటున్నారు.

ఇంతలో ఒక మంగలతను పరుగెత్తుకుంటూవచ్చి కాళిదాసుని కావలించుకుని, "అన్నయ్యా, నువ్విక్కడున్నావన్నట్టా! ఏమయిపోయావో అని ఎంత విచారించామనుకున్నావు? అమ్మ ఆ దిగులుతోనే చచ్చిపోయింది! ఆనాటినుంచీ నీ కోసం అరికాలు అరిగేలా తిరిగానంటే నమ్ము!" అంటూ బొప్పాలు కార్చాడు.

కాళిదాసు తెల్లబోయాడు.

పక్కన ఉన్న కవులు-"ఎవరండీ ఈ మంగలతను? మిమ్మల్ని అన్నయ్యా అంటున్నాడు?" అన్నారు ఏమీ ఎరగనట్టు.

నిజానికి అతన్నలా అనమని చెప్పి డబ్బు ఇచ్చిందికూడా వాళ్ళే!

"అసలితన్ని నేను చూడటం ఇదే మొదటిసారి" అన్నాడు కాళిదాసు.

"అయ్యో, అయ్యో, ఎంత మాటన్నా వన్నయ్యా! నువ్వెంత చదువుకుని పండితుడివయినా నీ స్వంతతమ్ముడిని కాదంటావా? కులవృత్తిని కాదన్నంత మాత్రాన రక్తసంబంధంపోతుందా?... ఈయన మా అన్నయ్యండీ బాబుగారూ! చిన్నప్పుడే కోపం వచ్చి పారిపోయాడు" అన్నాడు మంగలి.

"ఎందుకండీ కాళిదాసుగారు ఇంకా అబద్ధాలాడుతారు? భోజరాజుగారిని ఎంతఅవమానంచేశారు? మీరేదో బ్రాహ్మణులుకదా అని ఆయన తండ్రి తిథికి పిలిస్తే..." అంటూ దుమ్మెత్తిపోశారు.

"భగవాన్! ఏమిటి ఈ పరీక్ష!" అనుకున్నాడు కాళిదాసు.



అప్పుడే ఈ వార్త భోజరాజుదాకా వెళ్ళిపోయింది. వెంటనే కాళిదాసుకోసం కబురంపించారాయన.

ఆయనెదుటకూడా మంగలతను ఇందాకటి మాటలే చెప్పాడు.

"ఏమంటారు కాళిదాసా?"అనడిగాడు భోజరాజు కోపంగా. మంగలతనిమాటలను పండితులుకూడ సమర్థించటంతో ఆయనకి కాళిదాసుమీద కోపం కలిగింది.

"నా జీవితంలో ఈయన్ని చూడటం ఇదే మొదటిసారి" అన్నాడు.

"ఛీ, ఛీ, నా పితృకర్మ కూడా పాడుచేశారు.మీరు సద్బ్రాహ్మణులని పిలిచాను" అంటూ కోపంగా సింహాసనం దిగి వెళ్ళిపోయారు భోజరాజు.

కాళిదాసు చాలా బాధపడ్డాడు. అతని కింత అవమానం ఎన్నడూ జరగలేదు.

వెంటనే బయటికి వెళ్ళిపోయి సేరుగా విలాసవతిఇంటికి వెళ్ళాడు. మనస్సు బావుండనప్పుడు ఆ ఇంటికి వెళ్లటం అలవాటు కాళిదాసుకి.

విచారంతో ఉన్న కాళిదాసుని చూసి "అలా వున్నారేం? సభలో ఏమయినా జరిగిందా"? అనడిగింది బంగారుగా.

జరిగినదంతా చెప్పాడు.

"ఇప్పుడు నేనెలాగయినా బ్రాహ్మణ్ణనేఅని రాజుగారికి తెలియచేయాలి. మాటలను అర్థంచేసుకునే పరిస్థితిలో లేడాయన." అంటూ విలాసవతి భుజంమీద చేయివేశాడు.

ఆయన చేతికున్న రత్నమంజీరం తగిలి "అబ్బ!" అంది విలాసవతి.

ఒక్కసారి కంకణంవంక చూసుకుని సాలోచనగా నవ్వుకున్నాడు కాళిదాసు.

* * *

భోజరాజుకి కాళిదాసు సభకి రాకపోతే ఏమీ తోచటంలేదు. ఇద్దరూ అన్నదమ్ములలా ఉండే వారు కాబట్టి ఆయన లేకపోతే సభ చిన్నబోతోంది.

ఒకరోజు సభలోకి ఒక అమ్మాయిని తీసుకొచ్చారు సేవకులు.

"మహారాజా! ఈ అమ్మాయి ఒక రత్నమంజీరాన్ని అమ్మచూపుతోంది బజారులో. మాకు అనుమానం కలిగి తీసుకు వచ్చాము" అన్నారు.

"ఏమంటా" వన్నట్టు చూశారు రాజుగారు ఆ అమ్మాయివంక.

"నా పేరు 'చతుర' అండి. కాళిదాసుగారు ఊరు వదిలి వెళ్ళిపోతూ మా అమ్మగారికి ఇచ్చారు ఈరత్నమంజీరం. ఆవిడ నన్ను అమ్ముకు రమ్మనమని పంపించారు" అంది భయంగా.

"రెండోది లేదా?"

"లేదుటండి. ఆయన, ఆయన తమ్ముడుగారు తలా ఒకటి పంచుకున్నారుటండి. అందుకని ఒక్క దానితో లాభం ఏమిటి అని అమ్ముకు రమ్మందండి మా అమ్మగారు."

"సరే అయితే, దాన్ని అమ్మించి మేమే పంపుతాము. నువ్వు వెళ్ళచ్చు" అన్నారు.

నమస్కరించి వెళ్ళి పోయింది చతుర.

రత్నమంజీరం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. దాన్ని చూస్తుంటే భోజరాజుకి కాళిదాసుని చూసినట్టయింది! వెంటనే సేవకుడిని పిలిచి "కాళిదాసు తమ్ముడు ఊళ్లో ఎక్కడున్నా సరే తీసుకురండి" అంటూ ఆజ్ఞాపించారు.

రాజాజ్ఞ కాదనేముంది!


మంగలతన్ని పట్టుకుని సభలోకి తీసుకువచ్చారు. ఖరీదయినబట్టలతో నగలతో దర్జాగా వున్నాడు.

"ఏమోయ్, నువ్వు కాళిదాసు తమ్ముడివని అన్నావుకదా-అయితే మీరు ఆస్తి పంచుకున్నారా, లేకపోతే కలిసి వుంటున్నారా?" అనడిగారు భోజరాజు.

"పంచుకుని విడిపోయామండి" అన్నాడు.

"అయితే, ఇటువంటి రత్నమంజీరం రెండవది నీదగ్గర ఉంది కదా?"

"లేదు బాబూ. ఇది నా జన్మలో ఇవ్వాళే చూస్తున్నాను."



"అసలితన్ని నేను చూడటం ఇదే మొదటిసారి" అన్నాడు కాళిదాసు.

గేయకథా మంజరి

గజదొంగయుక్తి

త్రొల్లి ఒక మహారాజు వద్దకు
పట్టి తెచ్చిరి ఒక గజదొంగను,
వాడు చేసిన నేరములు నవాలక్ష
వెంటనే మహారాజు విధించెను ఉరిశిక్ష.

ఇంతలో దొంగ అరచెను దాహమని
రాజాజ్ఞాపించెను నీరము తెమ్మని
వేగమె తెచ్చిరి దప్పిక నీళ్లు భటులు
కాని త్రాగక దొంగ వణుకుచు నుండె—

ఈ స్థితి చూచి నీరము త్రాగువరకు
నిన్నెవరు చంపరు నా యాజ్ఞమేరకు
భయము వలదు త్రాగుము నీళ్లని
మహారాజు పోగొట్టె వాని భయం.

ఇంతలో నా దొంగ విసరివేసె పాత్రను
ప్రక్కలయ్యెనది సభామధ్యమున
నీరమంతయు కారిపోవగ
రాజునుఁ జూచి నవ్వె పకపక

దీనిని చూచిన రాజుకు వచ్చెనుకోపం
ఘీంకరించి అడిగెను వానిని కారణం?
వాడు "అయ్యా మీరే చెప్పితిరి లేదని భయం
నీళ్ళు త్రాగునంతవర కిచ్చితి రభయం

ఇప్పుడానీరును ప్రోగుచేయుటకాదు
మీతరము-బ్రహ్మతరముకాదు
మీ ఆజ్ఞయె ప్రసాదించెను నాకు
పునర్జన్మ సభికుల యెదుటన్-

మహారాజు దొంగయుక్తికి మదిమెచ్చి
చేసెను వానిని శిక్షా విముక్తునిగా
కాన యుక్తిగలవాడు జయించున్
ఎట్టి పరిస్థితులందును జగంబున్

డాంకి లక్ష్మీదేవి

"చచ్, అబద్ధాలాడకు. మీ అన్నయ్య ఇటువంటిది నీ దగ్గర ఒక టుందన్నాడు. నాకు ఊరికే ఇవ్వ నవసరం లేదులే. కావలసినంత డబ్బు ఇస్తాను."

"దేముడి సాక్షిగా నే నెరుగను బాబూ, అన లిటువంటిది మేం పంచుకో లేదు."

రాజుగారికి విసుగూ కోపం వచ్చాయి. ఎలాగయినా కాళిదాసు జ్ఞాపకార్థం దాన్ని సంపాయించా లన్న పట్టుదల పెరిగిందాయనకి.

"వీడిని స్తంభానికి కట్టి కొట్టం డిరా" అన్నాడు.

మరుక్షణంలో వాడిని బాదటం మొదలెట్టారు.

మిగిలిన పండితులకి ప్రాణాల్లో ప్రాణాలు లేవు. తమ గుట్టు వీడు బయటపెట్టేస్తాడేమో నని హడలి పోతున్నారు!

మంగఁ తను మట్టుకు నాకు తెలి యదు మొర్రో అంటూ ఏడుస్తు న్నాడు.

ఇంతలో కాళిదాసు సభలోకి వచ్చాడు.

ఆయన్ని చూడగానే భోజ రాజుకి ప్రాణం లేచివచ్చింది. "కాళి దాసా, ఇన్ని రోజులు ఎక్కడు న్నావు? ఏం చేస్తున్నావు?" అని అడిగాడు.

"మా తమ్ముడు మళ్లీ నాకంటికి కనిపించలేదు. వీడికోసం వెతుకు తున్నానండి. చివరికి మీరు పిలి పించారని విని ఇలా వచ్చాను" అన్నాడు.

"మీ తమ్ముడ్ని రెండవ లన్న మంజీరం ఇవ్వమంటుంటే దానివిష యం నే నెరుగ నంటున్నాడు" అన్నాడు రాజుగారు.

"వాడు చిన్నతనంనుంచి అంతే మహారాజా! మా అమ్మకూడా వాడిని తెగకొడితేగాని చేసిన పని ఒప్పుకునేవాడు కాదు. మరి నాలుగు చదివించండి" అన్నాడు కాళిదాసు.

మంగలతన్ని బాదటానికి ఇంకో ఇద్దరిని నియమించారు.

వాడు ఆ దెబ్బలని ఇక భరించలేకపోయాడు. "మహారాజా! నన్ను కొట్టడం ఆపించండి. నిజం చెపుతున్నాను. కాళిదాసుగారు, నేను అన్నదమ్ములం కాదు. నా దనలు ఈయనగారు కాదు' అన్నాడు ఏడుస్తూ.

కాళిదాసుమట్టుకు తక్కువవాడా? "రాజా! వీడి మాటలు నమ్మకండి. రత్నమంజీరంఇవ్వవలసి వస్తుందని అలా అంటున్నాడు. నేనూ, వాడూ పంచుకున్న దానిని కాదని మీ న్యాయపరిపాలనకే మచ్చ దెస్తున్నాడు. బాధించండి" అన్నాడు.

వెంటనే మంగలతను భోరున ఏడుస్తూ "మహారాజా, నాకు జరిగిన శిక్ష చాలు. నేనసలు ఈ ఊరివాడిని కాదు. మీ కొలువులో ఉన్న పండితులంతా కలిసి నన్ను పిలిపించి కాళిదాసు మా అన్నయ్య అనమని - అలా అంటే బోలెడు డబ్బిస్తామని ఆశపెట్టారు బాబూ. బుద్ధిగడ్డితిని చేశాను. ఇక వదలండి" అంటూ చెంప లేసుకున్నాడు.

దాంతో భోజరాజుగారి కోపం పండితులమీదికి తిరిగింది. అందరిని తలవాచేట్లు చీవాట్లుపెట్టి వెంటనే దేశంవదిలి వెళ్ళిపోవలసిందిగా ఆదేశించారు.

కథలాంటి కథ

నేను కాకినాడ పి. ఆర్. కాలేజీలో చదివే రోజుల్లో మా నానగార్ని వేధించి వేధించి ఒక పార్కర్ పెన్ను సంపాదించాను. మొదటి సంవత్సరం పరీక్షలు ఐనతర్వాత మా సొంత వూరు ఒంగోలుకు ఎండకాలం సెలవల్లో వచ్చాను.

కొన్నాళ్ళయింతర్వాత ఒకరోజు వున్నట్టుండి నా పెన్ను మాయమైంది. పొరపాటున ఎక్కడైనా పారేసుకున్నానా అనడానికి నేను యెప్పుడూ దాన్ని బయటకు తీసుకుని వెళ్ళనేలేదు. ఇంట్లో పెన్ను ఎలా మాయమైందో అంతుపట్టలేదు. ఇది మా యింట్లో పనిచేసే కుర్రాడి పని అని అనుమానం కలిగినా ఎందుకులే అని వాణ్ణి అడగలేదు. ఈ పోయిన సంగతి నాన్నగారికి తెలియడం నా నెత్తిమీద నాలుగు అక్షింతలు పడడం అవన్నీ ఇక్కడ అప్రస్తుతాలు.

కాలేజీలు తిరిగి తెరిచారు. రెండో సంవత్సరమంతా ఏదో ఒక తుక్కురకం పెన్నుతోటే గడుపుకోవాల్సివచ్చింది. పబ్లిక్ పరీక్షలై పోయినయ్. కాకినాడకు సలామ్‌కొట్టి ఒంగోలు చేరుకున్నాను.

ఒకనాడు ప్రొద్దున్న మొహం కడుక్కుని కాఫీ త్రాగి ఊసుపోక నాన్నగారి ఆఫీసురూంలోకి వెళ్ళాను. టేబుల్‌మీద ఒక వస్తువుమీద నా కళ్ళు పడ్డయ్. అది పార్కర్ పెన్ను! దాన్ని చూడగానే అది నాదే అని స్ఫురించింది. ఒకసారి ఎప్పుడో ఊబుసుపోక గుండుసూదితో గీసిన నా పొడిఅక్షరాలు వుండటంవల్ల అది నా పెన్ను అన్న విషయం నిర్ధారణ ఐపోయింది.

ఆశ్చర్యం ఏమంటే ఈపెన్ను నాదే అన్నవిషయం నేను చెప్పేవరకూ మా నాన్నగారికి కూడా తెలీదు! ఆయన క్రితం రోజు సాయంత్రం క్లబ్బులో ఏదో రాయాల్సి వచ్చి దగ్గర్లో వున్న "బాయ్"ని అడిగి పెన్ తీసుకున్నారట. రాయడంఅయింతర్వాత వాడికి తిరిగి ఇవ్వడం మర్చిపోయి జేబులో పెట్టేసుకున్నారు. ఆ క్లబ్ బాయ్ కూడా అడిగి తీసుకోవడం మర్చిపోయి ఉంటాడు. ఆ విధంగా ఆ ఖరీదైన పెన్ను దాన్ని కొన్నవాళ్ల యింటికి చేరింది!

ఇంతకీ ఆ క్లబ్ బాయ్ దగ్గరకది ఎట్లా వచ్చిందో వినండి! మా యింట్లో పనిచేసిన కుర్రవాడి తమ్ముడే వీడు. వీడిఅన్న యింట్లో లేని టైములో ఆ పెన్నుని జేబులో వేసుకుని టింగురంగా అని క్లబ్బుకు వచ్చాడు.

శిక్ష పూర్తవగానే జైల్లోంచి బైటపడ్డ ఖైదీలా నా పెన్ను దాని స్థానం అది చేరుకుంది. ★

కనకపల్లి రాజేంద్ర

పండితులు తమ తప్పను ఒప్పుకుని కాళిదాసుని, రాజుగారిని క్షమించమంటూ ప్రాధేయపడ్డారు.

అప్పుడు కాళిదాసు కల్పించుకుని "ఈసారికి శాంతించండి రాజా," అంటూ రాజుగారిని శాంతింపచేశాడు.

కాళిదాసుకి అఖండమయిన బహుమానాలర్పించాడు భోజరాజు.

★

పొట్టి కథల పుట్ట

నిషాలో ఉషార్

ఎండ మాడ్చేస్తోంది. ఒక ముష్టివాడు నడవలేక నడుస్తూ, తూలుతూ, గభాలని పడిపోయాడు. వెంటనే వాని చుట్టూ జనం మూగారు. అందులోవున్న ఓ ముసలావిడ "వాడికి ఒక గ్లాసెడు సారా యిప్పిస్తేసరి, కోలుకుంటాడు" అంది. యింకొకడు వానిని "ఆస్పత్రికి చేర్చండ్రా" అని అన్నాడు. ఇంకొక పెద్దమనిషి "వానికి కాస్త గాలి తగలనిస్తే అదే సరిపోద్ది!" అని బిగ్గరగా అరిచాడు. ఇలా ఒక్కొక్కరు సలహాలు యివ్వడం మొదలుపెట్టారు. మళ్ళీ "వానికి ఓ గ్లాసెడు సారా యివ్వండ్రా" అంది ఆ ముసలావిడ. ఇంతట్లో ఆ ముష్టివాడు గభాల్న లేచి కూర్చుని 'అందరూ అలా సలహాలివ్వకపోతే ఆ ముసలావిడ చెప్పిందేదో యివ్వకూడదూ!" అని బిగ్గరగా అరిచాడు.

—ఎగ్గోని సుందర్.

* * *

గుసగుసలు

ఈ సంఘటన వారంరోజుల క్రితం జరిగింది. సెకండ్ బెల్ మ్రోగింది. అందరము గబగబ క్లాస్ రూమ్ లో కెళ్ళి కూర్చొన్నాము. త్రిశక్తులన్నట్టు మా క్లాసులో ఉన్న ముగ్గురు అమ్మాయిలు వచ్చి కూర్చున్నారు. ఫస్టు, సెకండ్ పీరియడ్స్ ప్రశాంతంగా సాగిపోయాయి. మూడవ పిరియడ్ హిస్టరీ ఉంది. మా మేష్టారుగారు వచ్చి కుర్చీలో కూర్చున్నారు. తర్వాత నోట్సు రాయిస్తానంటే అంతా కాపీలుతీసి "యుద్ధవీరుల్ల" వలె తయారయ్యాము. అందరము నోట్సు రాయడంలో నిమగ్నులయ్యాము. ఈ అమ్మాయిలు ముగ్గురు మాత్రము రాయటంలేదు. కాని గుసగుసలు మొదలెట్టారు. మా మేష్టారు ఉండబట్టలేక "అమ్మాయిలు గుసగుసలు" అన్నారు. అందరు రాయటంలో నిమగ్నులవటము కారణంగా అందరూ "అమ్మాయిలు గుసగుసలు" అని రాసుకున్నారు. తర్వాత మేష్టారు ఒక అబ్బాయిని ఇప్పుడు రాయించిన నోట్సు చదువన్నారు. ఆ అబ్బాయి చదువుతు మధ్య రాయించిన అనగా పిల్లలు రాసుకొన్న "అమ్మాయిలు గుసగుసలు" అంటూ చదివాడు. మేష్టారు అదివిని అదేమిటోయ్ అమ్మాయిలు గుసగుసలు చేస్తూంటే అన్నమాట. అందరుపిల్లలు "మేము రాశామంటే, మేము రాశాము" అని గొల్లున నవ్వుకున్నారు. తర్వాత మా మేష్టారు అది కొట్టేయించారు. అప్పటినుంచి ఆ అమ్మాయిలు చిరస్మరణీయులయ్యారు.

—వి. దశరధయ్య.

* * *

రేపు మనదే!

క్రొంకొని కలను నేనూ
కమ్మని మాటలు చెబుతాన్నూ.
భావి పండితు లంతానూ
ఎన్నో వింతలు చేస్తారూ
కోరినవన్నీ యిస్తారూ
ముసలితనాన్నే తరిమేస్తారట!

గుండెకు నీరస మొస్తేనూ
క్రొత్త గుండెనే పెడతారంటా!
ఊపిరితిత్తులు చెడిపోతే
వేరేవాటిని వేస్తారంటా!

జోడుకుక్కలను అతికారంటా
వాటి రెండిటికి ఒకటే గుండెట!
ఒక్క కుక్కకే రెండు తలలట!
మరెన్నో వింతలు చేస్తారంటా!
మరికొన్నాళ్లకుమనమేంచేద్దాం-
"ఏమయ్యోయ్, క్రొత్త కాళ్లు
కావాలీ
'రన్నింగ్ రేసు'లో గెంవాలీ
గలిచే కాళ్ళను వెయ్యి"మందాం!
"ఏమండోయ్ పరీక్ష త్వరగా
వ్రాయాలీ
ఫస్టుమార్కులూ కొట్టెయ్యాలీ
ఉండేచేతులు త్వరగా వ్రాయవు
క్రొత్తవాటిని వెయ్యమందాం!
కలువల్లాంటి కళ్ళూ అందం
సంపెంగలాంటి ముద్దులముక్కూ
మల్లెసరములా పళ్ళవరుసలూ
అన్ని మాకూ కావాలందాం!
మరికొన్నాళ్ళకు భవిష్యత్తులో
తీరని కోరికలంటూ వుండవు!
మనసులోని కోరిక లేవీ
కలలూ కావు...కల్లలూ కావు!!

—శాంతిసాగర్.

★

సరళ సుశీల

(27-వ పేజీ తరువాయి)

ఏమిటి? తన్ను పెండ్లాడతానన్న పాణి యీనా ఈవిధంగా ప్రవర్తిస్తూంది?

పాణిని సరళ ప్రేమిస్తోందని సుశీలకు తెలుసు. పాణిని సుశీల ప్రేమిస్తున్నదని సరళకు తెలుసు. తాను వీరిద్దరినీ ప్రేమిస్తున్నానని పాణికి తెలుసు. సరళతో చనువుగా మాట్లాడితే సుశీలకు ఒంటిమీద తేళ్ళు, జెర్రులు ప్రాకినట్లుంది. సుశీలతో చనువుగా ఉంటే సరళకు కోపం.

* * *

"ఏం పాణిగారూ, అలా దిగాలుపడి ఉన్నారేం. కారణం తెలుసుకోవచ్చా. అంతరహస్యం అయితే అవసరం లేదు" అంటూ సుశీల పాణి రూమ్‌లోకి వచ్చింది.

"ఇదిగో సుశీలా! ఈ ఉత్తరం చదివితే అంతా నీకే బోధపడుతుంది" అంటూ ఒక ఉత్తరము సుశీలకు ఇచ్చాడు చక్రపాణి.

సుశీల బిగ్గరగానే చదివింది.

"ప్రియపుత్రుడు చక్రపాణికి,

నువ్వు పదిహేనురోజులు కాలేజీకి సెలవు పెట్టి రావలెను. నీకు ఇక్కడ మన వూరికి దగ్గరలోనే ఒక సంబంధం చూసినాము. లగ్నము కూడ ఖాయముచేసినాము. నువ్వు నా మాట కెదురాడవని తెలుసు. పిల్ల చాల బావుంటుంది. మిగతా వివరాలు ఇక్కడ మాట్లాడుకోవచ్చు. వెంటనే రావలెను..."

"సుశీలకు మాట పెగలలేదు. అలాగే మ్రాన్పడిపోయింది. చివరకు తేరుకుని "ఏం పాణీ ఏం చేయదలిచావు, నన్ను నట్టేట ముంచిపోతావా" అంది.

"అదే సుశీలా నేనూ ఆలోచిస్తున్నాను. ఏమీ బోధపడటం లేదు. ఏమిచెయ్యాలో అంతకన్నా తోచటం లేదు. అయినా నాకొక్కటే ఉపాయం తోస్తూంది సుశీలా."

"ఏమిటది"

"నీ కిష్టమేనా"

"అదేమిటో చెప్పండి"

"నువ్వు నన్ను ప్రేమిస్తున్నావా సుశీలా"

"పరీక్షిస్తున్నారా"

"అయితే నే చెప్పినది చేస్తావా"

"తప్పకుండా"

"నీకు నాకు పెళ్ళికావాలంటే ఒక్కటే ఉపాయముంది సుశీలా. ప్రస్తుతం మనిద్దరం ఈ వూరినుండి పరారీ అవడమే"

"ఆ!"

"అంతకన్న వేరుపాయం లేదు సుశీలా"

"క్షమించండి...మీ మాట కాదన్నందుకు. అంత పని చెయ్యలేనండి. ఈ అప్రతిష్టమా తండ్రికి తెచ్చిపెట్టలేను"

"అంతే నంటావా సుశీలా"

"అబ్బ నాకల తిరిగిపోతుందండి...మీరు చెప్పేది నా కర్థం గావటం లేదు...నా తండ్రికి ద్రోహం చెయ్యలేనండి"

"ప్రేమంటే ఇదేనా సుశీలా"

"ప్రేమ లేచి పొమ్మని చెప్పదు గదండీ"

ఇది మనకై మనము కోరుకోవటం లేదు గదా...పరిస్థితుల ప్రాబల్యం వల్లనేకదా."

'ఏమైనా...నేను...అంత సాహసం చెయ్యలేనండి...ఫలానావారి అమ్మాయి లేచి పోయిందంటే ఎంత నామర్దా! అయినా పెద్దలనుకాదని మనం సుఖపడేదేముంది...వస్తా..." సుశీల వెళ్ళిపోయింది.

* * *

"ఏం సరళా ఉత్తరం చదివావుగా, నీ సలహా ఏమిటికి?"

"నాకంతా అయోమయంగా ఉందండి. ఏమి చెయ్యాలో తోచటం లేదు."

"నాకొక ఉపాయం తోస్తుంది సరళా!"

"ఏమిటండి అది. త్వరగా చెప్పండి"

"నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా"

"హాస్యమాడుతున్నారా"

"మనిద్దరకు పెళ్ళి కావాలంటే ఒక్కటే ఉపాయం సరళా! ప్రస్తుతం మనిద్దరం ఈ వూరునుండి పరారి అవటమే"

"ఆ! పరారీయా! ఇప్పుడుగూడ హాస్యమటండీ"

"హాస్యం కాదు సరళా...నిజంగానే అడుగుతున్నాను"

"అయితే ఎక్కడికెళ్దామంటారు?"

"రావటం నీ కిష్టమేనా"

"మీ వెంట నరకానికి రమ్మన్నా వస్తాను' అంది సరళ నవ్వుతూ.

"మీ అమ్మ నాన్నలను వదలి?"

"స్త్రీకి భర్త తర్వాతనే అమ్మా నాన్నలు గదండి"

"మీ తల్లి దండ్రుల కొచ్చే పేరు...విచారించావా"

"ఒక మంచిపనికి...చెడ్డ పని చేసినా వరవాలేదు"

"ఏమిటా మంచిపని?

"స్త్రీకి కోరుకున్న భర్త దొరకడం"

"నావెంట వస్తే ఏ మొస్తుంది సరళా! బాధలు తప్ప..."

"నన్ను చేసుకోవటం ఇష్టం లేకపోతే చెప్పరాదూ. ఈ అడ్డదోవలెందుకు?"

"సరే. అయితే నిజంగా బయలుదేరు సరళా. రేపు రాత్రి మెయిలుకు."

"డబ్బు..."

"అది నే చూసుకుంటాగా"

"ఏమిటో నాకంతా అయోమయంగా ఉంది. ప్రేమించిన భర్త లభించాడు అన్న సంతోషము తప్ప."

"ఇక అంతా సంతోషమే సరళా" అన్నాడు పాణి. ఈ తరం అంతా అబద్ధం, నిన్నూ, సుశీలను పరీక్షించాను...అంతే... అందులో నువ్వే నెగ్గావు. ఈ నాటినుండి నువ్వు నా హృదయ రాణివి సరళా!" అన్నాడు. సరళ తాను భూలోకంలో ఉందో, స్వర్గలోకంలో ఉందో తెలుసుకునే స్థితిలో లేదు. "పిచ్చుకమీద బ్రహ్మాస్త్రమండీ" అంది కిలకిలానవ్వుతూ పాణి ఆమె ముంగురులను సర్దుతూ నవ్వుతున్నాడు. ★

అన్వేషణ

(31-వ పేజీ తరువాయి)

లేదు. కండక్టరు ఆ పరిస్థితి గురించి, ఆ యువతి రక్షణకువచ్చి, ఆసీటు కాళీచేసి ఆ యువతికి ఇవ్వమని మర్యాదగా సలహా ఇచ్చాడు. శివరాం మొండిగా లేవలేదు. బస్సులోని ప్రయాణికు లంతా శివరాంవైపు ఆశ్చర్యంగా చూశారు. కండక్టరు శివరాంను మళ్ళీ మర్యాదగా బతిమాలేదు.

"సమాన హక్కులుకోరే నవనాగరిక స్త్రీలకు సానుభూతి చూపనక్కర్లేదు. బస్సుల్లో స్థలం లేనపుడు మగవాళ్ళు నుంచోరూ?... అల్లాగే ఆడవాళ్ళు నుంచోవచ్చు. సమాన హక్కులుపొందే నాగరిక స్త్రీలు సమాన బాధ్యతలు బాధలు కూడా భరించాలి!" శివరాం తీవ్రంగా అని చలనం లేకుండా తనసీటులో కూర్చున్నాడు.

అంతవరకు వింతగ చూస్తున్న బస్సులోని ప్రయాణికులు శివరాం మాటలోని సత్యాన్ని గుర్తించి ఆ యువతివైపు హేళనగా చూసి, శివరాం ప్రవర్తనకు హర్షం చూపారు. లేచినిలుచున్న ప్రయాణికుడు తిరిగివచ్చి తనసీటులో కూర్చున్నాడు. మర్యాదగా సలహాలిచ్చిన కండక్టరు మారు మాటాడక టిక్కట్లు ఇచ్చటంలో నిమగ్నుడైపోయాడు. బస్సు వేగం వడకలో తూలుతూ బాధగా నిలుచోక తప్పలేదు ఆ నవనాగరిక యువతికి.

మరోదినం స్థానిక రైలుబండిలో కాచిగూడ వెడుతున్నాడు. శివరాం, అతను కూర్చున్న పెట్టెలో జనం నిండుగా కూర్చున్నారు. సీతాఫల్ మండిలో తెలంగాణా

అన్వేషణ

గ్రామీణరైతు ఒకడు పంచె ఎగకట్టి బనీను వేసుకుని, కంబళీ బుజానికి తగిలించి, చేతికర్రబట్టి చుట్టకాలుస్తూ శివరాం ఉన్న పెట్టెలోకి వచ్చాడు. అన్నిసీట్లు నిండి ఉన్నాయి. ఒక యూరపియను శ్వేతవనిత ప్రక్కనే రెండుసీట్లు ఖాళీగా ఉన్నాయి. ఆ తెలంగాణ రైతు తిన్నగాపోయి ఆమె ప్రక్కను కూర్చుని కంబళీ చివరలతో ఆమె శరీరాన్ని రాపిడిచేస్తూ కర్రమొదలు ఆమె కాళ్ళమీద తగిలిస్తూ, చుట్టపొగలు వదులుతూ, అమాయకంగా స్వంతయింట్లో ఉన్నట్లు కూర్చున్నాడు. శుభ్రంగా సిల్కు అందంగా అలంకరించుకుని, హాజాకుగా కూర్చున్న ఆ యూరోపియను స్త్రీకి, తెలంగాణ రైతు కంటకంగా కనిపించాడు. తనసౌందర్యం, 'గాంభీర్యం' గౌరవం ప్రతిష్ఠ ఆ రైతువల్ల భగ్నమవుతున్నట్లు బాధపడి గట్టిగా కసిరింది. ఆ అమాయక రైతు అయోమయంగా, భయంగా లేచిపోయి దూరంగా నిలుచున్నాడు. ఆ శ్వేతవనిత ప్రవర్తన శివరాంకు కోపం కలిగించింది. టిక్కెట్టుకొన్న ప్రతివానికీ రైలులో నియమించబడిన ప్రతి పెట్టెలోను ఎక్కడైనా కూర్చొనే హక్కు ఉన్నప్పుడు జాతిగాంభీర్యం ప్రదర్శిస్తూ, పరదేశీయురాలు స్వదేశీవానిని అవమానించడం భరింపరాని విషయంగా తోచింది. శివరాం తక్షణం తనసీటు ఖాళీచేసి తెలంగాణ రైతును కూర్చోబెట్టి 'తానువెళ్ళి శ్వేతవనిత ప్రక్కన కూర్చున్నాడు. శ్వేతవనిత శివరాంను అపాదమస్తకం ఒకక్షణం తీవిగా పరిశీలించి ఊరకుంది.

'నేను అందంగా ఉన్నానా?' వ్యంగ్యంగా ప్రశ్నించాడు ఆవనితను ఇంగ్లీషులో.

ఆ శ్వేతవనిత చిరాకుగా చూసింది అతని ప్రశ్నకు.

'నీలాగే టిక్కెట్టు కొనుక్కున్న ఆ రైతుని పొమ్మని కసిరించడం చాలా అన్యాయం. అతనికి నీ ప్రక్కనే కూర్చొనే హక్కు ఉంది!' అంటూ శివరాం ఆ రైతును తీసుకువెళ్ళి శ్వేతవనిత ప్రక్కన కూర్చోబెట్టాడు.

ఈ చిత్రం పరిశీలిస్తున్న జనం శివరాం ప్రవర్తనలోని స్వదేశాభిమానం ప్రశంసిస్తూ, శ్వేతవనిత వైపు హేళనగా నవ్వారు. ఆ నవ్వులతో శ్వేతవనిత ముఖం కుంచించుకుపోయింది. తెలంగాణ రైతు ఆ పరిస్థితి అర్థంకాకపోయినా, శ్వేతవనితను చూచి బెదరకుండా స్వేచ్ఛగా కూర్చున్నాడు తనసీటులో.

ఈ విప్లవభావాలు అతనిలో బాగా వేళ్లు నాటుకుపోయి, ఆఫీసులో కూడా శివరాం ప్రవర్తనలో మొలకెత్తేయి. కంపెని యజమాని మితిమీరిన ఉద్యోగహోదా చూపిస్తూ గుమాస్తాలనందరినీ భయపెడుతూ, క్రూరంగా సెలవుదినాలలో పనిచేయిస్తూ, నౌకర్లను తన గృహకార్యాలకు నిర్దయగా ఉపయోగించుకుంటూ, తనప్రాపకం కోరినవారికి పెద్ద పదవుల అవకాశాలు కల్పిస్తూ ప్రవర్తించడం శివరాంలో ఉద్రేకం కలిగించింది. గుమాస్తాల సంఘం ఏర్పరచడానికి ప్రయత్నించాడు. కొందరు గుమాస్తాలు శివరాంతో ఏకీభవించలేదు. మిగిలినవారి సహకారం లభించగానే కంపెనియజమాని ప్రవర్తనపై నిరసన తెలుపుతూ సమ్మె ప్రకటించాడు శివరాం. సమ్మెచేసేవారిని ఉద్యోగాలలోంచి తక్షణం తొలగిస్తానని కంపెనీ యజమాని బెదిరించాడు. సమ్మె ముందురోజువరకు సహకారం చూపిస్తామని ఐక్యత ప్రదర్శించిన గుమాస్తాలు సమ్మెదినాన శివరాంకు ద్రోహం చేసి ఆఫీసుకు వెళ్ళారు. ఇటువంటి పిరికితనమున్న గుమాస్తాల బ్రతుకులు కొన్ని తరాలు గడిచినా బాగుపడడం అసంభవమనుకున్నాడు శివరాం. సమ్మె ప్రకటన ఫలితంగా శివరాంను ఉద్యోగంనుంచి తొలగించాడు కంపెనీ యజమాని.

న్యాయ విద్యాభ్యాసం యింకా పూర్తి కాకుండానే ఉద్యోగం పోవడంతో శివరాం దైనిక జీవన ప్రయాణానికి కొంత కష్టం కలిగింది. అనేక ఖర్చులు తగ్గించుకోవలసి వచ్చింది. బ్రహ్మయ్యగారికి తెలియకనే తనకు చాలా కొంతసొమ్ము వచ్చేదారి కనిపించినా, ఆయనకు ఉద్యోగం పోయిందనే అసంతృప్తి వార్త అందించడం శివరాంకు యిష్టం లేకపోయింది. కష్టపడి చిత్రాలు ఎక్కువ గీసి పత్రికలకు పంపించి ధనం సంపాదించేవాడు. బజారులో తన చిత్రాలు అమ్మించేవాడు, దుకాణదారుల చేత. బట్టల దుకాణంలో పద్దులు చూస్తూ ఒక గంట, ప్రసిద్ధ ఎగుమతి దిగుమతి వ్యాపారస్తుల కంపెనీలో ఉత్తరాలు టైపుచేస్తూ ఒకగంట. ఎరుగున్న స్నేహితుల పిల్లలకు ఇంకో గంట పాఠాలు చెప్పి, జీవనోపాధి సంపాదించేవాడు శివరాం.

'లా' డిగ్రీ లభించగానే తన ఉద్యోగం రాజీనామా చేసి లాయరు వృత్తి అవలంబింపతల్చుకున్నానని అందుకు తగిన ధనసహాయం అర్థిస్తున్నానని శివరాం బ్రహ్మయ్యగారికి ఉత్తరం వ్రాశాడు. బ్రహ్మయ్యగారి ఆనందానికి మేరలేకపోయింది. మనుమడు కష్టపడి న్యాయపరీక్షలో ఉత్తీర్ణుడై సమాజంలో ఉన్నత పరపతి పొందడానికి వకీలు వృత్తి అవలంబించడం తన కుటుంబ గౌరవ ప్రతిష్ఠలను యినుమడింప చేస్తాయని గర్వపడ్డారు. తన పేరనే ఉన్న రెండు ఎకరాలు భూమి అమ్మేసి అయిదువేల రూపాయిలు శివరాంకు పంపించారు బ్రహ్మయ్యగారు. భూములు తమ్ముడికోసం తాతయ్య అమ్మేశాడని అన్న వెంకటేశ్వర్లు లోలోపల అసూయతో బాధపడ్డాడు. పార్వతమ్మ భర్తను, ముందకొడి ప్రవర్తనకు నిత్య గుమాస్తా జీవితానికి, గిరసినా, పెద్ద ఘోషచేస్తూ సాధించింది.

బ్రహ్మయ్యగారు పంపిన ధనం శివరాంకు చాలా ఆధారమైంది. తాతయ్య సహాయానికి శివరాం అభిమానంతో కృతజ్ఞతలు తెలియజేశాడు. మరో నాల్గు కుర్చీలు, ఒక పెద్ద మేజాబల్ల, నాల్గు అద్దాలబీరువాలు, వెయ్యి రూపాయిల విలువగల లా గ్రంథాలు కొన్నాడు శివరాం. ఇంట్లోని ముందుగది లాయరు ఆఫీసుగదిలా మార్పించేశాడు. సుప్రసిద్ధ లాయరు రామచంద్రరావువద్ద వృత్తిఅనుభవాల శుశ్రూష పొందడానికి చేరాడు శివరాం.

లాయరు రామచంద్రరావు న్యాయవాదవృత్తిలో ఒడుదుడుకులు చూశాడు. వృత్తి ప్రారంభించినరోజుల్లో అనుభవమున్న తదితర లాయర్లతో పోటీచేసి అభివృద్ధికిరావడం తర్వాత అయిదు సంవత్సరాలు పుష్కలంగా ధనం సంపాదించడం, ఆ పిదప లా కళాశాలలద్వారా పట్టాలు పొందిన యువకులు న్యాయవాద రంగంలో పెరిగిపోవడంతో లావాదేవీలు విపరీతరగతుల వకీళ్ళకు పంపకములు తనపలుకుబడి కొంత తగ్గడం శివరాంకు మొదట బోధచేశాడు. వృత్తిలోని అభివృద్ధి పూర్తిగా వ్యక్తియొక్క ప్రతిభమీదకాక అదృష్టంమీద కూడా ఆధారపడి ఉంటుందని నుడివాడు రామచంద్రరావు.

(ఇంకా ఉంది) ★

సుభద్రా సదన్

(23 వ పేజీ తరువాయి)

"ప్రకాశం" అని పిల్చాడు బంగారయ్య.

"నీ పరీక్షలలోనే మీ అమ్మగారికి ఒక రాత్రి హఠాత్తుగా తీవ్రమయ్యింది ఆస్త్మా. తుదకు లోకి దింపిన ఫలితమిది. అలా ఎప్పుడూ జరగదని డాక్టరనుకున్నాడు.—కాని జరిగింది.

ఆమె దేవత, అందుకే మందులకోసం పరిగెత్తే మమ్మల్నాపింది. మీ నాన్నగార్ని దగ్గరకు పిలిచింది.

"ప్రకాశాన్ని చూడాలని వుందండీ."

"టెలిగ్రామిస్తాను. రేపు ప్రొద్దుటికి వస్తాడు." అన్నారు మీ నాన్నగారు.

"ఇప్పుడు వెర్రినాన్నకు పరీక్షలు కదూ."

"అవును."

"ఈ పరీక్షలలో వాణ్ణి పిలిపించవద్దు." ఆమెకు ఆయాసం అధికమైంది.

"నేను డాక్టరును పిలుచుకు వస్తాను. నువ్వు కంగారుపడకు" వెళ్ళబోయే భర్తను చేసంజ్ఞతో ఆపుచేసింది.

"డాక్టరక్కర్లేదు. నాకు బాగానేవుంది"—కళ్ళు బరువుగా తెరుస్తూ మాట్లాడింది.

"నాకింక మందులవసరంలేదు. నా నమస్కారాలు స్వీకరించండి, ప్రకాశం మిమ్మల్ని జాగ్రత్తగా చూస్తాడు. మీరింక విశ్రాంతి తీసుకోవాలి. నాకోసం ప్రకాశాన్నేడ్వవద్దని చెప్పండి.

ఎదురుగా పటంలో పార్వతీపరమేశ్వరుడికి కుసుమాంజలి నిస్తూవుంది. పార్వతీదేవికి నమస్కరించింది. అలాగే కష్టంగా రెండు చేతులూ కలిపి కడసారి-మీ నాయనకు నమస్కారం చేసింది...అందరివంకా చిరునవ్వుతో చూసింది...అంతే...చంద్రుడస్తమించాడు. లోకాన్నంతనీ చీకటితెర కప్పేసింది."

"అబ్బ! చాలింక భరించలేను. అమ్మా! నాకు నువ్వు కావాలి!"

"ప్రకాశం" అని పిలిచాడు బంగారయ్య

"నాకు మా అమ్మ కావాలి. అమ్మలేక బతకలేను."

కిరీటి నిశ్చలంగా ఫోటోవంక చూస్తూ నిలబడి పోయాడు.

అతని నయనాలనుండి రెండశ్రుబిందువులు రాలాయి.

"ప్రకాశం! మీ అమ్మను చూడాలని వుందా?" అన్నాడు బంగారయ్య.

"అవును" అన్నాడు ఆశతో చూస్తూ ప్రకాశం.

"నువ్వు చాలా చదువుకున్నవాడివి-మూఢుడవుగావు. భౌతికశరీరంలో మీ అమ్మ ఒక్కతెగానే కనపడింది,—

మీ అమ్మ స్వర్గవాసి అయిన శోకాన ఆమెను తెలిసిన ప్రతిజీవీ శోకించింది—గుడిపోలయ్య ముద్దుక్రిష్ణ, యిరుగు పొరుగు వనితలు నటులు-వీరందరూ నీ తల్లి స్వర్గ నిర్గమనానికి రోదించారు. మీ అమ్మ అప్పుడు ఒక్కతే. ఇప్పుడామె అందరి హృదయాల్లోనూ వుంది. నీ తల్లి నీకిచ్చిన సందేశం-నువ్వు పుట్టినప్పుడు చేటలోపడి కేరున ఏడ్చావు. నీ జననానికి ప్రపంచకమంతా సంతోషించింది-నీ మరణానికి ప్రపంచమంతా గొల్లుమని ఏడ్వాలి-ఈ సందేశాన్ని, నీ మాతృదేవత మూగగా సేవజేస్తూ వేలజీవుల ప్రేమను చూరగొన్న సత్యాన్ని నువ్వాచరించాలి.

నేను పెసరట్లమ్మి, రెండణుకుల గజంబద్దతో కొల్చి, ఇంటింటికీ తిరిగి, మో సంచేసి బట్టల వ్యాపారంలో డబ్బుగడించాను. కారణం?-ఎవరి మొహం చూసినా న్యాయం, దయ, ఋజువర్తన నాకు కలగలేదు. బహుశః నీతండ్రి సాంగత్యంవల్ల—నీతల్లి నేత్రాలు నువ్వుగరించి నన్ను వాత్సల్యంతో ప్రథమంగా చూసినపుడు — ఈవి నన్ను వీపున చరిచి నీచదువు కొప్కారం చూపింది. విషపాత్రలో మధువుపోసినా విషమే అవుతుంది. మురికిగుంటలో మంచినీరు పారినా మురికిపోదు—నేను మురికిగుంటను. నా ప్రార్థనలు భగవంతుని కందవు. నీమాతృదేవి నన్ను క్షమించమని భగవంతుణ్ణి ప్రార్థించి ఉంటుంది. దానిఫలితమే నీ వైద్యవిద్య. మీ నాన్న చేతనవృద్ధి.

ప్రకాశం! ఈవిధంగా నీతల్లి అజ్ఞాతంగా వుండి—వడ్డీకు వడ్డీలు కాజేసిన లోభిని, ఎన్నో సామాన్య బీదసంసారాల్ని వ్యాపారంలో కబళించిన దుర్మార్గుణ్ని-నన్ను—మార్చింది. ఇప్పుడు చూశావా నీతల్లిని? నీ తల్లి, నీకిచ్చిన సందేశాన్నాచరించి కర్తవ్యాన్ని నిర్వర్తిస్తావా? లేక-జీవితానికి భయపడి భీరువై పారిపోతావా?

"లేదు. తప్పకుండా అమ్మ ఆశయాన్నాచరణలో పెడ్తాను—నే నేం చేయాలిప్పుడు?" వినీతుణంగా బంగారయ్యవైపు చూశాడు ప్రకాశం.

ఎమ్.బి.బి.ఎస్.లందరూ చదువుకున్నారు. ప్రభుత్వాసుపత్రులూ వున్నాయి. ప్రతి ఒక్కరూ పీడించి, డబ్బుతీసుకుని, రంగు నీళ్ళుపోసి రోగాలెక్కువ చేస్తున్నారు.

ప్రభుత్వ న్యాయస్థానాలెక్కువవుతున్నాయంటే—అన్యాయం పెరిగిందన్నమాట. అదనపు ప్రభుత్వాసుపత్రులవసరమయ్యాయంటే అనారోగ్యం అభివృద్ధి చెందిందన్నమాట—కాని మనవూరిలో ఆసుపత్రులేమీ లేవు. అందుచేత నువ్విక్కడ ప్రాక్టీసు పెట్టాలి."

"తప్పకుండా పెడతాను. కాని......" అన్నాడు ప్రకాశం సంకోచిస్తూ.

"నాకు జన్మ యిచ్చినది మా అమ్మకాదు. మీ అమ్మ — ఇప్పుడే కళ్ళు తెరిచి ప్రపంచాన్ని చూస్తున్నాను. గతంలోని నా పీడకలలో బాధితులందరూ తమకు జరిగిన అన్యాయాన్ని చెప్తున్నారు—మానవుడిగా పుట్టిన నీకు, దానవుడిగాడో చెపాక్కక్కడిదని అడుగుతున్నారు—నేను నా తప్పు గ్రహించాను—కాని—నేను భగవంతుణ్ణి క్షమాభిక్ష అడగలేను. నా అన్యాయానికి గురియైనవారి పడగాలి—దాని కొక్కటే మార్గం—ఇప్పటివరకూ నే నార్జించిన లక్షలు నీ కిస్తున్నాను — 'సుభద్రా సదనము' నిర్మించి ఉచితంగా వైద్యంచేయి. కాని ఎక్కడా 'బంగారయ్య' అనే అక్షరాలు కనపడకూడదు—అప్పుడే భగవంతుడు నన్ను క్షమిస్తాడు—అప్పుడే నేను చేసిన పాపాలకు నిష్కృతి లభిస్తుంది—ఈ రోజు అస్తమించిన సూర్యుడు రేపుదయించక మానడు—తుపాను తాకిడికి నేలగరచిన తన పూరింటిని దీనంగా చూసేవాడు పురుషుడు కాడు. — మాయింట్లో కొన్ని పిచికలు గూటిని కట్టాయి —— ప్రొద్దుట మేతకి పోయేప్పుడు గూడు పడగొట్టేవాణ్ణి...... సాయంత్రం తిరిగివచ్చేసరికి గూటి పునర్నిర్మాణం జరిగేది.

నాటినుంచి నేను నేర్చినపాఠం — ఆపద, ఓటమి విధికృత్యాలు. దైన్యం, దుఃఖం దాని నేస్తాలు — ధైర్యం, స్థయిర్యంతో వాటి నెదిరించినప్పుడే జీవనయాత్ర తాపీగా సాగేది — చదివినవాడికి చదవనివాణ్ణి నేనేం చెప్పాలి."

* * *

"ఇదీ మాగాధ పార్వతీ! తర్వాత ప్రకాశానికి నాకు వివాహమయిందని వేరే చెప్పక్కర్లేదనుకుంటాను. ఇప్పటికీ ఎప్పటికీ ఒకే చిత్రం! పోస్టలులో చికిత్సకు వచ్చే ప్రతివ్యక్తీ మా అత్తగారి మూర్తికి మ్రొక్కి ఆశీస్సులు తీసుకోవడం ఆచారం. పోస్టలుకి విషణ్ణవదనం వచ్చిన వ్యక్తితో వికాసంతో వెళ్తాడు. —

ఎవరో నిండు చూలాలు వ్యగ్రానుం వస్తూ దారిలో నొప్పులు పడుతూ, యిక్కడకు వచ్చి, ప్రవేశానికి ముందు అత్తగారి చిత్రానికి నమస్కరించ నిరాకరించిందని విని వచ్చాను. నన్ను చూడగానే మా అత్తగారికి చేతులు జోడించావు — ఇప్పుడు నీకంతా అర్థమైవుంటుంది."

"ఎంత విషాదగాథ ప్రతిమా! — మీ అత్తగారి చిత్రం నా మనసులో శాశ్వతంగా ముద్రవేసింది."

"సరేలే. చాలా రాత్రయింది. విశ్రాంతి తీసుకో. నీకేం కావాలన్నా కబురు పంపు. మరేం భయంలేదు. సుఖప్రసవమౌతుంది." పార్వతికి దుప్పటి కప్పి వెళ్ళిపోయింది ప్రతిమ.

కిటికీలోంచి దూరాన మినుకు మినుకుమనే నక్షత్రం కనపడుతోంది పార్వతికి. సుభద్రాదేవి పటం మనసులో తట్టిందామె.

(అయిపోయింది)★



ప్రత్యేక రచన:

మనమూ... మన పేర్లూ...

వాడ్రేవు భానుమతి

"వాట్స్ ఇన్ ఎ నేమ్?" అనే షేక్స్పియరు వాక్యాన్ని గిరీశం గారు "పేర్లలోన యేమి పెన్నిధి యున్నదిః" అని ఒక చిన్న గీతముక్కగా తర్జుమా చేసి పారేశాడు. షేక్స్పియరు, గిరీశమూ కూడ బలుక్కున్నట్టు ఇలా అనేసినా మనం తొందరపడి వాళ్ళకి తాళం వెయ్యలేము. ఏ మాటకామాటే అంతా కాకపోయినా కొంతమటుకు పేర్లలో ఉంది. కొంతం ఇంచి 'మాత్రే' ఈ తమాషా మనకు బోధపడుతుంది.

అసందర్భంగా, అసాధ్యంగా వుంటే పేర్ల మాటేమి మనం ఎందుకు నవ్వుతాము? ఎప్పుడూ మూతి ముడుచుకు కూర్చుని, కోపంగా మూటమూటలాడుతూ ఉండే అమ్మాయి పేరు సుహాసిని అంటే మనం ఫక్కున నవ్వుతాము. నల్లగా పేకేదు కందులా నిగనిగలాడిపోయే పిల్లకి సూర్యముఖి అని పేరుపెడితే నవ్వురాకుండా ఉంటుందా? అలాగే బన్నగా, గడకర్రలా, కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని ఆకలి చూపులు చూసే అబ్బాయికి భీమసేనరావుఅని పేరుంటే ఎలావుంటుందో, చెప్పినా వినక, తనకి తోచక మూర్ఖంగా ఛట్టాకళ్ళు పట్టుపట్టే ఆయనపేరు వివేకానందమూర్తిఅన్నా అలాగే ఉంటుంది.

పేర్లలో ఏమీ లేకపోతే మా బాబయ్యగారు 'వెంకట వరసమ్మ'గా కాపరానికి వచ్చిన తన భార్యను 'వెంకట రమణమ్మ'ను ఎందుకు చేశారు? పెళ్ళీడు వచ్చేదాకా 'సుబ్బలక్ష్మి'గా పెరిగిన మా చెల్లెలు హఠాత్తుగా ఒకనాడు 'విజయలక్ష్మి' అని ఎందుకు ప్రకటించుకోవాలి? గాలున్నరాళ్ళ చేతిలో చేరగానే వెంకన్న వెంకటనారాయణెలా అవుతున్నాడు?

వీధిలో వాళ్ళ అందమైన పాపాయిని బుజ్జగించి ముద్దు పెట్టుకుని 'నీ పేరేమిటోయ్' అని అడిగి, 'శుశీకళ్' అని ఆ అమ్మాయి ముద్దు ముద్దుగా చెబితే 'నిజంగా నువ్వు సుధాకరుడవే నయ్యా!' అని మురిసిపోతాము.

సరళ సలహా...

మనిషి అన్నతర్వాత అతనికి కలిగే మంచీ చెడూ కూడా రెండు రకాలుగా ఉంటుంది. మానసికంగాను, దైహికంగానుకూడా అది సంభవిస్తుంది.

ఆత్మసంతృప్తికి మించిన ఆరోగ్యమూ, అసూయకి మించిన జటిల రోగమూ మరొకటి లేదు. సంఘంలో ప్రతి నిముషమూకూడా ఏదో ఒక విషయానికి మనమిమాని అసూయపడేవాళ్ళుంటూనే ఉంటారు. మన ప్రక్కన, ఎదట ఎక్కడపడితేఅక్కడ అసూయాగ్రస్తులు ఆవరించి ఉంటారు.

ఇంతకీ చెప్పేదల్లా 'అసూయ భయంకరమైన అంటువ్యాధి' అని. వాళ్ళని చూసి మనము ప్రతిక్రియగా అసూయ పడతాము. తెలిసిగాని, మనకు తెలియకనేగాని ఇది జరుగుతుంది. అసూయాగ్రస్తుల మనస్సులో 'అసహనము'నే వ్రణం పుడుతుంది. దాని నివారణకే మన పరిశోధనలు సాగాలి— ప్రయత్నాలు ఫలించాలి.

ఏతరయినా వాళ్ల అమ్మాయి పేరు 'సుజాత' అని చెబితే పిల్ల ఎంత చక్కగా ఉంటుందో నని ఎందుకు ఊహించుకుంటాము? పెళ్ళి చూపులకు వెళ్ళినప్పుడు పిల్లని 'పేరేమిటమ్మా' అని అడిగితే ఆమె 'ఏ' లలితకుమారి అనో 'శారద' అనో చెబితే 'బావుందమ్మా' అంటారు. అలా కాక ఆమె ఏ వెంకమ్మ అనో, మారమ్మ అనో తనపేరు చెబితే ముక్తసరిగా 'బా...వుంది' అనడం మన మెరుగమూ?

అన్ని ప్రాంతాలలో మల్లేనే తెలుగు దేశంలో కూడా కొన్ని తమాషా తమాషా పేర్లున్నాయి. ఒకామె పేరు తలుపులమ్మ, ఇంకొక ఆమె పేరు వీరభుంటమ్మ, ఇలాగ. అయితే ఇంగ్లీషు వాళ్ళలోనూ ఇలాంటి విచిత్రమైన పేర్లున్నా వాటి అర్థాలనుగూర్చి మనం ఆలోచించక పోవడంతో మనం అంతగా ఆశ్చర్యపడము. ఒకామె మిసెస్ డోర్స్ (శ్రీమతి తలుపులు) ఇంకొకఆమె మిస్ బెల్ (కుమారి గంట) ఇలాగ. పోతురాజు అనే పేరు వినేసరికి అబ్బా అదేంపేరు బాబూ! అనిపించినా మిస్టర్ లాంగ్ ఫెలో (పొడుగాటి ఆయన) లార్డ్ ఛర్న్వుడ్ (కట్టెందొరగారు) అనే పేర్లను ఎందువల్లనో మనం విస్మరిపోము.

పెరిగి పెద్దవాళ్లయాక వాళ్ళ బుద్ధులెలా వుంటాయో పాపం తల్లిదండ్రులకి ఏం తెలుస్తోంది? మావీధిలో ఒకరి అబ్బాయికి బుద్ధుడని పేరుపెట్టారు. పెరిగి పెద్దవాడయ్యాక చూసి నలుగురూ బుగ్గలు నొక్కుకున్నారు. ఎవరోదాకా ఎందుకూ మాధర్మారావు బావ లేడూ? నిలుపునా ... (వేరేమాట అనడం

విశ్వనాథం అంటే మా అమ్మదగ్గర ఇవాళే పెద్ద ఇదిగా ఫిర్యాదు చేస్తాడు!) ఒకప్పుడు మా కాలేజీ ప్రిన్సిపాలు (వీర) భద్రయ్యగారు. పేరు విన్నంతమాత్రాన ఒళ్లు జలదరించినా ఆయనంత మంచివాళ్ళని చాలా అరుదుగా చూస్తాము.

ఈ విషయాలు అలావుంచి తెలుగు దేశానికి ఇంతదూరంలోవున్న మాకు పేరును బట్టేకదా ఒకరు తెలుగువారు అవునో కాదో తెలిసేది? వెంకటరత్నమ్మ, బాలా త్రిపురసుందరమ్మ, మంగతాయారమ్మ వంటి పేర్లూ కుటుంబరావు, సత్యనారాయణమూర్తి, శ్రీరామమూర్తి వంటి పేర్లు కొట్టవచ్చినట్టు చెబుతాయి తెలుగు పేర్లని. మీకూ తెలుసు ననుకుంటాను వెనకటికి శాస్త్రి దొరగారు తన ఒకప్పటి అభిమాన విద్యార్థి పేరు మరచిపోయి తెలుగుదేశంలో ఎవరినయినా నువ్వు సూర్యనారాయణ అనిగాని సత్యనారాయణ అనిగాని పిలిస్తే నీమాట నూటికి తొంభయిపాళ్లు రైటయి ఊరుకుంటుంది" అని అన్నారట! అలాగే ప్రక్కన ఉండే వాళ్లు కపూర్, సహూజా, ఆరోరా లయితే పంజాబీవాళ్ళని చక్రవర్తి, బొర్తీ, హాల్దార్, రాయ్, చౌధురీలయితే బెంగాలీవాళ్లనీ కేల్కార్, కలేల్కార్, బ్రహ్మానందకర్ గజేంద్ర గడ్కరీలయితే మరాఠీ వాళ్ళనీ తపీమని చెప్పేసుకోవచ్చును. అసలు ఈ పేర్లూ ఈ వివరాలూ లేకపోతే ఎవరు ఏమిటో ఏం తెలుస్తుంది? 'ఏయ్ ఓయ్' అని ఎందర్ని ఎలా పిలవగలం? అందువల్ల పేర్లు అవసరం; అందమైన పేర్లు చాలా అవసరం.

ఇహ ముద్దుగా ముచ్చటగా పెట్టుకున్న పేర్లను ముందూ వెనకా తెగగోసి, కుదించి పిలిచేవీ, ఆకార గుణ వయో భేదాలనుబట్టి తగిలించేవీ అయిన మారు పేర్లున్నాయి. అసలు పేర్లకంటె తమాషాగా ఉండేవి మారుపేర్లే. ఒకప్పుడు యాత్రలు చేసుకుంటూ మేము ఒక ఊళ్లో ఓ సత్రానికి వెళ్లాము. బసకోసమని. అక్కడఉన్న ఒకాయన, "చంటిఅబ్బాయి అలా వెళ్ళాడు, ఇప్పుడే వస్తాడు, కూర్చోండి" అన్నారు. ఒక అర గంటపోయాక ఒక అరవైఏళ్ళ "చంటి అబ్బాయి" చక్కావచ్చాడు! మా పెద్దత్తగారు ఒకావిడ పేరు సూర్యకాంతమ్మ. ఆవిడని అంతా చిన్నమ్మగారంటారు. మా వాళ్ళలోని ఆడవాళ్లంతా ఆవిడభుజాలదగ్గర కయినారారు! రత్నంలాఉండే మారత్నమ్మత్తగారిని 'రత్తీ' అనేవారు. మా ఇంకో అత్తగారి కూతుర్ని అంతా 'చిన్ని, చిన్నీ' అనడమే కాని, ఆవిడ పేరు రాజ్యలక్ష్మి అని నిన్న మొన్నటిదాకా నాకు తెలియదు. 'రుక్మిణి' ఎక్కడైనాసరే 'రుక్కు' అయితీరుతుంది, సుభద్రమ్మగారు కొన్నిచోట్ల భద్రమ్మగారు, మరికొన్నిచోట్ల సుబ్బమ్మగారూ అయినా. వరలక్ష్మి ఒకభర్తకు 'వరం' అయితే సుబ్బలక్ష్మి అందరకూ 'సుబ్బులు' అవుతుంది. లలిత 'లాలి' అయింది; సరోజిని 'సరమ్మగా' రయింది. నా చిన్ననాటి స్నేహితురాలు ఫుల్లాబ్జాక్షిని ఇంట్లోవాళ్లు ముద్దుగా 'ఫుల్లమ్మ' అంటారు. నాకు ఒకసారి జ్వరంవచ్చినప్పుడు ఎదురింటి బెంగాలీ ఆవిడ నన్ను చూడ్డానికి వచ్చింది. వాళ్ళ పిల్ల నా చేతిలోవున్న పత్రిక చూస్తూ నా ప్రక్కగా నిలుచుంది. వెంటనే ఆవిడ 'ఫుల్లూ!' అంది. ఆ బెంగాలీ ఉచ్చారణ అలాలా వినిపించింది నాకు.

"నాకు 'ఫ్లూ' కాదండి, వట్టి జ్వరమే" అన్నాను.

"కాదు, కాదు. మా అమ్మాయి పేరు 'ఫుల్లూ!' అందావిడ. ఆపిల్ల పేరు ప్రఫుల్లట. ఢిల్లీలో ఫ్లూజ్వరం ఉధృతంగా ఉన్నరోజుల నాటిమాట యిది.

పంజాబీవాళ్లు 'సురీందర్' అని పేరుంటే 'పింకీ' అని, 'నరేందర్' అని పేరుంటే 'నిందిరీ' అనీ పిలుస్తారు. ఇంకా పిల్లలకు బబ్బూ, గుల్లీ, గుడ్డీ, టిక్కూ, పప్పూ అని ఎన్నో ముద్దుపేర్లున్నాయి. మనలో బాబు, బాబీ, బుజ్జి, రాజా, అబ్బాయి, అబ్బి, అబ్బు—ఇలాగ. పిల్లలకి తాతపేరో, అమ్మమ్మపేరో పెడితే, తాతయ్యా అనీ అమ్మమ్మా అనీ పిలవకూడాదు. ఇవన్నీ ఒకఎత్తు. ఢిల్లీలో వుండికూడా (ప్రస్తుతం పూనాలో) ముద్దుపేర్ల విషయంలో తెలుగుదనం మరచిపోని రేవతిగారి సంగతి ఒకఎత్తూను. మొదటిబిడ్డకి సలక్షణంగా సత్యనారాయణ అని పేరుపెట్టుకుని ముద్దుగా 'సత్తుబుడ్డీ' అని పిలుచుకుంటున్నారు!


రాఘవయ్యగారనే ఒకాయనకి కూని. అందుకని ఆయన్ని అంతా కూనయ్య అనే పిలిచేవారు. సరే, మా ఊళ్లో ఉండే సుదర్శనంగారు ఊళ్లోవాళ్ల పోరు పడలేక 'వామనమూర్తి' అని పేరేమార్చేసుకున్నాడు. ఓసారి పాలకొల్లు వెళ్ళాం. మా బంధువుల పక్కింటి ఆయనపేరు రోడ్డు రత్తయ్యగారు ఆవిడపేరు రోడ్డురత్తమ్మగారు. రోడ్లు వేసే కూలీలపై అజమాయిషీ చేయడం ఆయన ఉద్యోగమట! ఆయన్నిబట్టే ఆవిడాను!

మనుష్యులు ఏదేశంలోఅయినా ఒకలాగే ఉంటారు. ఇంగ్లీషువాళ్లు, అమెరికన్లు తామస్ అని పేరుంటే 'టిమ్మీ' అంటారు. విక్టోరియను 'విక్' అంటారు. హస్బండ్(భర్త)ను 'హబ్బీ' అంటారు. మన విజయనగరం మహారాజ్ కుమార్ గారిని 'విజ్జీ' అంటారని అందరమూ ఎరుగుదుము

వృత్తులు, పదవులు మీదుగా — అవి ఉన్నా ఊడినా — కొందర్ని పిలుస్తాము. తాసీల్దార్ రవణయ్యగారు, రైటరు కామ

(53వ పేజీచూడండి)

ఎప్పుడూ ఇంతే—18 శంకర్.



ఏం చేసినా...

మారని స్వభావాలు!

వి. సత్యవతీదేవి

“ఆ ఏమిటే అంత యిరుగ్గా జడవేసుకున్నావు. వాళ్ళ సావిత్రి చూడు, ఎంత వదులుగా చెవులమీద పడుతున్నట్లు చక్కగా వేసుకొంటుందో. కొస్త ఆముఖానికి పౌడరు రాసుకోకూడదూ... మరీ అంత పెద్ద బొట్టేమిటే అమ్మవారిలాగ. వాళ్ళ జానకి చూడు. కనీకనిపించనట్టు ఎంత చిన్న బొట్టు పెట్టుకొంటుందో. చీర షోగ్గా కట్టుకోడమైనా తెలీదు. ఒకళ్ళను చూసిఅయినా నేర్చుకోవు” అప్పుడే ఆఫీసునుంచి వచ్చిన మా మామయ్య మా మేనత్తను సాధించడం మొదలుపెట్టేరు. అరగంటక్రితం ట్రెయిను దిగి ఆయింట్లో ప్రవేశించి ఆంధ్రపత్రిక చదువుకొంటూ కూర్చున్న నేను మామయ్య మాటలు విని పలకరిద్దామని లేచాను. కాని అతని మాటలతీరు చూసి పలకరించడానికి భయంవేసింది.

మా అత్తకు పెళ్ళయిన నాలుగు సంవత్సరాలలో అక్కడికి నేనురావడం ఇదే ప్రథమపర్యాయం. మామయ్య స్వభావం ఎలాంటిదో నాకింకా తెలీదు. కాని మా అత్తను అలా సాధిస్తూవుంటే మాత్రం ఒకవైపు నవ్వు, ఒకవైపు విచారం కల్గినయ్. ఎంచేతనంటే మా అత్త పుట్టింట్లో వున్నప్పుడు (పెళ్ళి కాక పూర్వం) ఎవ్వరే మాటన్నా పడేదికాదు.

పోనీ నన్ను చూసేనా సాధించడం మానుతారేమో అనుకొని ఎదురుగా వెళ్ళేను. “ఓహో ఎప్పుడొచ్చావుగీ అంతా కులాసాగా వున్నారా” అని పలకరిస్తూనే “చెప్తూంటే నీకు కాదూ; నేనువచ్చేటప్పటికి వంటపనంతా పూర్తయిపోవాలని ఎన్నిసార్లు చెప్పాలి” అని తిరిగి ప్రారంభించేరు. మా అత్త నోరెత్తి సమాధానం చెప్పకపోవడం నాకు బలే ఆశ్చర్యం కల్గించింది. ఆయ నంటున్న మాటలన్నీ ఎవరినో అన్నట్లు తనపని తను చేసుకుపోతూంది.

ఆయను కాఫీతాగి బయటకు వెళ్ళిన తరువాత కూర్చున్నచోటునుంచి లేచి “ఏమిటత్తా, ఎందుకలా సాధిస్తున్నారు” అన్నాను మనసులో వుంచుకోలేక. “ఈమాత్రం దానికే భయపడిపోతున్నావా “పత్యా” ఇంకా వుంటావుగా. అప్పుడే ఏం చూసేవు ఆయని స్వభావమే అంతే. ఎదుటివాళ్ళను దేనికో వకదానికి సాధించనిదే అతనికి తోచదు. ఇంక మనం సమాధానం చెప్పామా ఆరోజు రామ, రావణ యుద్ధమే. అందుకే ఎన్నంటున్నా నోరెత్తను.” మా అత్త ఆయని స్వభావం గూర్చి అలా చెప్పుకుపోతూవుంటే నాకంతా అయోమయం అనిపించింది.

ఆ యింట్లోవున్న వారంరోజులు గుళ్ళమీద వున్నట్లు అనిపించింది. మామయ్య యింట్లో వున్నంతసేపూ దేనికో వకదానికి పరాయివాళ్ళను మెచ్చుకుంటూ ఇంట్లో వాళ్ళను సాధిస్తూవుంటారు. కష్టపడి ఎంత బాగా వంటచేసినా కూడా “ఈ కూర నీముఖంలా వుంది. ఆరోజు వాళ్ళ రత్నం యిచ్చిన కూర చూడు అమృతం... అంటూ మొదలుపెడతారు. నిజంగా ఆరోజు అదిచ్చిన కూర జ్ఞాపకమొస్తే ఈరోజు తింటున్న తిండికూడా సయించదు. ఈ సాధింపులు అలవాటులేక నేను 15 రోజులు వుందామనుకొని వెళ్ళి వారం రోజులలో తిరిగివచ్చేసేను. ఆయను ఆఫీసుకి వెళ్ళిపోయేదాకా ఎవ రేమూల వున్నామో కూడా తెలిసేదికాదు. తిరువాత యిపను వచ్చినట్టు సరదాగా గడపటం. మళ్ళీ ఆయన వచ్చేవేళకు పిల్లులలాగా ఎవరిస్థానాల్లోకి వాళ్ళు చేరడం. నలుగురితో సరదాగా మాట్లాడుకొన్నా అతనికి కిట్టదు. నాలుగు రోజులు వుండటానికే నాకే కష్టమయినప్పుడు యీజీవితం ఒకచోట గడిపే మా అత్త అతనితో ఎలా వేగుతున్నదో” అని అనిపిస్తూ వుంటుంది.

★ ఏం చేసినా మారనిస్వభావాలు ★

ఒక్క అయసేకాదు, అలాంటివ్యక్తులు ప్రపంచంలో లక్షలకొలదీ వుంటారు. వీళ్లకు ఎదుటివాళ్లను, అంగులోను చెయ్యిలాంగిన వాళ్లను సాధించడం అలవాటయిపోయి ఒకళ్ళింటికి తామెళ్ళినా, తనయింటికి పరాయివాళ్ళొచ్చినా తను ప్రవర్తనను మాత్రం మార్చుకోరు. వాళ్ళకు, వాళ్ళకు అలవాటు కాబట్టి ఫర్వాలేదుగాని ఎదుటి వాళ్ళకుమాత్రం నానాబాధగానువుంటుంది. ఇలా సాధించడం అలవాటయినవాళ్ళకు ఎదుటివాళ్ళుచేసిన ప్రతి పనిలోను అది ఎంత బాగా చేసినాకూడా ఏదో వకలోపం కనిపిస్తూనే వుంటుంది. ఇంక వీళ్ళను తిట్టడమేకాకుండా అల్లవాళ్ళు అంత బాగా చేస్తారు. ఇల్లి వీళ్లు ఇంత చక్కగా



వుంటారు అని మొదలుపెడతారు. ఇలా సాధిస్తున్నందువల్ల ప్రయోజనమేమైనా వుందేమో అంటే అదీలేదు. పైగా వీళ్ళ స్వభావమే అంత. మనం ఎంతచేసినా మెప్పులేదు అనుకొని యెదుటివాళ్ళు మొండికెత్తిపోవడం తప్ప.

మా మామయ్యగారిలాంటివ్యక్తే మా పక్క సీతమ్మగారు. ఆవిడభర్త బజారునుంచి ఎంత మంచికూరలు తెచ్చినప్పటికీ "ఈ వంకాయలు అన్నీ పుచ్చులే...అదేమిటండీ ఈ బెండకాయలు మరీ అంత ముదురుగా వున్నాయ్. మీకు కూరలబేరమే తెలీదు. వాళ్ళ కొనులు మొగుడు చూడండీ. దగ్గరుండి ఎంచి, తూపించి మరీ యింటికి తీసుకువస్తాడు. ఆవిడకంటె కేరంగు నచ్చుతుందో కూడా అతనికి తెలుసు. ఒక్కొక్క ఆడది చేసుకొన్న అదృష్టం అది. అందుకే "పుణ్యంకొద్ది పురుషుడు, దానంకొద్దిపిల్లలు" అని ప్రారంభిస్తుంది. ఆ మహానుభావుడు నోరెత్తకుండా తనపనిలో తాను మునిగిపోతాడు.

కారణం వున్నప్పుడు ఎవరేమన్నా పడవచ్చుకాని అనవసరంగా మా స్వభావమింతే యనంటూ సాధిస్తూ వుంటే యెదుటివాళ్ళకు మహా కష్టంగా వుంటుంది. మాస్వాధీనంలో వున్నవాళ్ళుకదా మా యిష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తామంటే అది అర్థంలేని మాటలు. ఎదుటివాళ్ల గుణగణాలను గుర్తించి దానికనుగుణంగా తమ ప్రవర్తనలను, స్వభావాలను మార్చుకొనేటందుకు ప్రయత్నిస్తే అందులో చిన్నతనం చెందవలసిన అవసరముండదని భావించవచ్చు. ★

మనవమూ, మనపేర్లూ

(49 వ పేజీ తరువాయి)

రాజుగారు, భద్రం మాస్టారు, దీక్షిత దాసుగారు, వేంకట కవిగారు మొదలైనవి. పార్శీ వారిలోనూ, గుజరాతీవారిలోనూ సాధారణంగా వారి వృత్తినిబట్టే పేర్లు ఏర్పడతాయి: బజాజ్ (బట్టల వర్తకుడు), కంట్రాక్టర్, కాబినెట్ మేకర్, వారియల్ వాలా, క్లబ్‌వాలా, బరన్‌వాలా మొదలైనవి. మనలో చూసుకుంటే, గుణగణాలను బట్టి, మనం పేరుపెట్టి పిలవకపోయినా, మొక్కపాటి పార్వతీశమనీ, గురజాడ గిరీశమనీ, చిలకమర్తి గణపతి అనీ, పానుగంటి జంఘాల శాస్త్రి అనీ పేర్లు పొందేవారూ ఉన్నారు.

అగ్నిహోత్రావధాన్లు గిరీశాన్ని "ఏమండీ హేసుమాన్లుగారూ, మీ పేరేమిటండీ?" అని అడుగుతాడు. అలాగ లక్షణాలనుబట్టి పేర్లు ఉన్నట్టయితే, "కోతీ కోతీ..." అంటే, "అయ్యో నా పేరెలా తెలిసిందీ?" అని కోతి అడగవలసిన అవసరమూ ఉండదు; ఇల్లు అలుకుతూన్న ఈగలాగ ఆ పేరు మరచిపోవడమనేదీ ఉండదు!

అనూరాధ డైరి

ఇప్పటి పెద్దవాళ్ళసంగతి చూస్తుంటే పాలు కాచుకోటం వీళ్ళవంతే— పారబోసుకోటం వీళ్ళవంతే అనిపిస్తోంది.

పాతకాలం పద్ధతులపైన గౌరవం ఉంటే ఛాందసులనీ, అప్‌టుడేట్‌గా ఉంటే అదిరిపాటనీ ఎటూకాకుండా ఉంటే అయోమయం సరుకనీ పిలుస్తుందీ లోకం. లోకం అంటే ఆడవాళ్ళన్నమాట. కాకపోతే ఆడవాళ్ళనోర్లై ఉండాలి!

వదినగారు వాసిగలవారు. వారం రోజులుగా సాధిస్తున్నారు. విషయం మరేంలేదు. నేను మహిళా మండలి సభ్యురాలిని. అది ఆవిడకు పడదు. రెండోది నేను వాల్జడ వేసుకుంటాను. మూడో కారణం ముక్తసరిగా మాట్లాడటం. నాలుగు ఇంటి జమాఖర్చుల బాధ్యతఅంతా పూర్తిగా నేనే చూడటం. ఇహ నంబరులేని (అ)కారణం ఉండనే ఉంది. వాళ్ళ (అంటే వదినావాళ్ళ) పిల్లల అల్లరిచిల్లరిపనులు ససేమిరా నేను సహించకపోవడం. ఆమెను ఈ కారణ పంచభూతాలుకలసి నామీద ఉగ్రనారాయణావతారమెత్తించాయి. పిచ్చి పిచ్చి ఆపేక్షలు ఒలకబోసుకుంటూ పిల్లల్ని చెడగొట్టుకోడం అవివేకం. నేను పిల్లల్ని పెళ్ళి అయిన మర్నాడే కనివుండకపోవచ్చు. ఆమాత్రంచేత నేనీ మాటలు అనటానికి అనర్హురాలిని కాదు. ఆవిడ ఒకటే ఆడిపోసుకుంటుంది మాట మాట్లాడితే. 'పిల్లల్ని కన్నవాళ్ళకి తెలుస్తుంది కడుపు తీపి' అని. ఏదో పెద్దది... అని ఊన్నంత మాత్రాన నేను గొడ్డాలునైపోలేను గానీ, (నారాత అదే అయితే జీవితాన్ని విచారిస్తూ గడపడమూ నావల్ల కాదు) నిజంగా ఆ పిల్లల క్షేమమేగనక వదిన కోరుతుంటే అలా నెత్తికెక్కించుకుంటుందా — ఆవిడ పిచ్చిగాని 'మొక్కై వంగనిది మానై వంగుతుందా' అని పూరికే నే అన్నారా మనవాళ్లు?

నా మటుకు నాకు ఈ మాటలో సత్యం కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది. చిన్నప్పుడు దొడ్డమ్మకూడా యిలాగే తన మన్యుణ్ణి గారాబం చేసేదిట. అన్నాయ్‌కూడా దున్నాయ్‌గా పెరిగి పెద్దయ్యాడు. వాడి కొక్కటే జబ్బు. నోటి దురుసుతనం, మొండి పట్టుదల, ఇంట్లో పెద్దా, చిన్నా లెక్కలేదు. నిర్మొహమాటంగా చేబదులు అడిగి తీసుకుని ఎగవేయడంలో వాడికిసాటివాడే. బాబాయిల్ని, వాళ్ళ పిల్లల్ని 'నిక్‌నేమ్స్' అవీ పెట్టి ఏడిపించడం వాడి 'హాబీ!' డైరీలని పేరుపెట్టి లేని అబద్ధాలు అందర్ని గురించీ ఉత్పత్తిచేసి నిలవచేయడం వాడి వృత్తి. మాట్నీసినిమాలకు ఆఫీసు ఎగగొట్టి (చూసినదాన్నే పదహారోసారి చూడ్డానికి) ఎగబడడం వాడి ప్రవృత్తి.

ఓసారి వల్లిమండి ఓ పెద్దన్నయ్య వీడికి 'మందగిరి దున్న' అని పేరు పెట్టాడు. దాంతో కుర్రకారంతా పట్టుకు పీక్కుతినేసరికి 'బలవంతమైన సర్పము' సామెత అయింది. కాస్త తాత్కాలికంగా కొరుదచ్చినా మళ్ళీ పుంజుకున్నాడు.

ఇంట్లో ఇలా ఈ ప్రబుద్ధుడు ప్రవర్తిస్తుంటే ఎదురుగానే వీడికి ప్రతిరూపాలుగా నమూనాలు అప్పుడే అయిదుగురు తయారయ్యారు. కుమారరత్నాలు ఈ 'ప్రబుద్ధ పాదారవిందాలు' ఆశ్రయించి మరెంతవారౌతారో చూడాలి.

మొత్తానికి అన్నాయ్‌ని చూస్తే వాళ్లఅన్నాయ్‌కేభయం! నాన్నాయ్‌కి కూడా భయం వేసేదిట!!

కొందర్ని చూడగానే కళాకేంద్రాలలో సుందరవస్తువులుగా ఉంచి ఆనందించవచ్చు ననిపిస్తుంది. మరి కొందర్ని చూస్తే ఏ 'జూ'లోనో పెంపుడుజంతువుల విభాగానికి 'అటు' ప్రక్క ఉండే విభాగంలో ఉంచాలనిపిస్తుంది.

హైద్రాబాద్ పబ్లిక్ గార్డెన్స్ చూట్టానికి వెళ్ళినప్పుడు అక్కడ ఖడ్గమృగం లేదంటూ మాలో కొందరం నిరుత్సాహపడ్డాం. నామటుకు నాకు అన్నాయ్ మాట స్ఫురించింది చటుక్కున. కానీ బైటికంటానా. ఏమైనా అన్నాయ్ దున్నాయ్ మార్గం వదులుకోవాలి, లేదా వాడి ప్రమేయం ఇక తలవాళ్ళు వదులుకోక తప్పేదేముంది! ★

★ ఉత్తరాలు ★

(2-వ పేజీ తరువాయి)

మీ "గళ్లనుడికట్టు" కొరకు వారం, వారం 25 నయాపైసలు వెతుక్కోవలసివస్తోందంటె, నమ్ముతారనుకుంటాము.

మేడూరి సత్యనారాయణాచార్యులు,
గోపాలాచార్యులు—బూర్గుంపల్లి.

* * *

20-1-60 తేదీ 'ఆంధ్రపత్రిక'లో ప్రచురింపబడిన "ఇంటికి దీపం ఇల్లాలే" అన్న వ్యాసం చాలచాల బాగుంది. రచయిత్రి కమలా చంద్రశేఖర్ గారు ఇంటిలో గృహిణియొక్క ప్రాముఖ్యతను, భర్తమీద, పిల్లలమీద ఆమె చూపు ప్రేమానురాగాలను, అతిథి అభ్యాగతులమీద ఆమె చూపు ఆదరాభిమానాలను చాల చక్కగా వ్రాశారు. స్త్రీయొక్క ప్రాముఖ్యత(గృహవిషయంలో) గొప్ప గొప్ప కవులు పురాణాలలోను, కావ్యాలలోను ఎలా వర్ణించారో చక్కగా చూపించారు.

వి. కె. రకుమాబాయి, గుత్తి.

* * *

కమలా చంద్రశేఖర్ గారి "ఇంటికి దీపం ఇల్లాలే" అన్న వ్యాసం సుమారుగా వుంది. ఎంతసేపూ పాతకాలపు ఇల్లాళ్లనుగురించే చర్చించడం యీనాటి స్త్రీల ప్రగతికి మార్గం చూపించడం కానేరదు. ఈనాటి ఇల్లాళ్లను గురించి కొంతయినా వ్రాసివుంటే వ్యాసం సమగ్రంగా వుండేది.

—కాంతిశ్రీ, పులివెందుల.

* * *

స్త్రీ విలువ, స్త్రీకుండే అధికారాలు, స్త్రీ గృహనిర్వహణ, దాంపత్య జీవితంలో స్త్రీ పాత్రను కళ్లకు కట్టినట్లు చూపుతూ, కళ్లు మిరుమిట్లు గొలిపే బాహ్య ప్రపంచపు వింతలతో విచిత్రంగా ప్రవర్తించే యువతులను వారి జీవితాన్ని తీర్చిదిద్దుకోడానికి ఉపయోగించే సందేశను నందజేసిన కమలా చంద్రశేఖర్ గారికి నా వందనములు.

రాధ, వాల్తేరు.

* * *

వ్యాసం ఆఖరి భాగం: "గృహనిర్వహణ రాష్ట్ర నిర్వహణ" పోల్చి చాలా బాగా వ్రాశారు.

రత్నం, హైదరాబాద్.

* * *

"ఇంటికిదీపం ఇల్లాలే" అనే వ్యాసం నేటివరకు వనితాలోకంలో ప్రచురింపబడిన వ్యాసాలన్నిటిలోను అన్నివిధాలా ఎన్నతగినది. ఇల్లాలు అన్నపదానికి ఈయబడిన అర్థం, ఆమె బాధ్యతలు, తద్వారా ఆమె పొందే స్వేచ్ఛ, కుటుంబానికి కలిగే ఆనందం చక్కగా మహాకవుల వాక్యాల నాధారంగా చేసుకుని వివరించిన రచయిత్రి అభినందనీయురాలు. ప్రతివారు చదివి నేర్చుకో వల్సిన విషయాలెన్నో ఉన్నాయంటే అతిశయోక్తి కాజాలదు.

పెమ్మరాజు వెంకటరత్నం, చింతలపూడి.

* * *

"మధ్యతరగతి మగువలు" అన్న వ్యాసము ఎక్కువ మోతాదులో నడిచిందని నిస్సందేహంగా చెప్పవచ్చు. బహుశా రచయిత్రిగారు తమ సొంత విషాదాన్ని వివరించారో, లేక ఎరిగివున్న ఏదో ఒక కుటుంబాన్ని తీసికొని వ్రాశారో గాని—అందరు భర్తలు అలా ఉంటారా? అలా వ్రాయటం ఏమీ బాగా లేదు. భార్యభర్తని మంచి చేసుకోవటంలో ఉంది అంతా! నామటుకు నాకు ఎక్కడో అరుదుగా తప్ప అందులోనూ మధ్యతరగతి మగువలలో రచయిత్రిగారు వివరించినంత ఇదిగా భార్యల్ని హింసపెట్టే వాళ్ళు లేరనే అనిపిస్తుంది.

బహుశా ఏదో ఆవేశంలో వ్రాసివుంటారు రచయిత్రి. రచయిత్రిగారు కోపం తెచ్చుకోకుండ నిజాన్ని గ్రహించవలసిందిగా కోరుతున్నాను. కుమారి ఎస్. మంజీర, గుంటూరు

* * *

"మధ్యతరగతి మగువలు" అనే వ్యాసం చాలా బాగుంది. హనుమావతిగారు చాలా నేర్పుతో మధ్యతరగతి మగువలలో నున్న లోటుపాట్లను వివరించారు. భార్యలపై భర్తలకున్నటువంటి చెడుఅభిప్రాయాలను చక్కగా విమర్శించారు. ఇటువంటి వ్యాసములను రచిస్తూ స్త్రీజాతికి ఆనందాన్ని కల్గిస్తూ పురుషజాతిని హెచ్చరిస్తూవుండాలని నాకోరిక.

వి. లలిత, ఏలూరు.

* * *

"సుందరత - సుఖజీవనం" అనే తమ వ్యాసంలో సీతారామమ్మగారు దాంపత్య జీవితంలోని విపరీతాలన్నీ "పిల్లలు పుట్టిన తరువాతనే ప్రారంభమవుతాయ్" అని రాశారు. ఒకవిధంగా చూస్తే ఈ అభిప్రాయం వాస్తవానికి విరుద్ధంగా వున్నదేమో ననిపిస్తోంది. ఎందుకంటే భార్యాభర్తలమధ్య అనురాగం సంతాన ప్రాప్తి అనంతరం నిజానికి మరింతగా అభివృద్ధి చెందితీరాలి. అలా కాక, సంసారంలో పొరపొచ్చెలెక్కువైతే, అందుక్కారణం స్త్రీపురుషులకు పరస్పరం ఆకర్షణ అనేది అకస్మాత్తుగా పిల్లలరాకతో నశించటమో, లేక, ఆర్థిక సంబంధమైన ఇబ్బందులలో కాక, మనసులు కలవని ఆసాములను దంపతుల్నిగా చేసిన పరిస్థితులేనని అనుకోవాలి.

ఎస్. హెచ్. సీతారామశర్మ, గుంటూరు.

* * *

స్వరతరంగిణి

"స్వరతరంగిణి" శీర్షిక ఏర్పాటుచేసినందులకు చాల ఆనందముగా వుంది. ఇప్పుడు పత్రికలోని మిగతాశీర్షికలకోరకే కాక పాట నేర్చుకోవటంకోసం కూడా ఎదురు చూస్తూంటాను. పాటకు రాగం ప్రక్కన ఆరాగమునకు ఏ ఏ స్వరములో కూడా వ్రాయగలరని ఆశిస్తాను.

మిస్. రాజ్, మంటాడ.

* * *

నుడికట్లు

నుడికట్టులలో నూతనరీతులు
కనిపెట్టిన మీ బుద్ధిబలానికి,
నడుంకట్టి నడి
పించు నైపుణికి,
నభింముట్ట జే జేలర్పింతును.

రాగశ్రీ, బెల్గాం.

* * *

కమలశ్రీగారి స్మృతిపథంలో 'ఆనాటి సంక్రాంతి' చాలా బాగుంది. ఒక్క సంక్రాంతి అనే కాదు. తనమీద వేసిన అభాండం నిజము కాదని ఋజువైనప్పుడు ఎవరైనా పొందే ఆనందం యింతింతని చెప్పలేము. అది వారి స్మృతిపథంలో జీవితాంతం నిలిచిపోయింది—

శాంతిశ్రీగారి 'చేటు తెలిసి చేబదుళ్లు' వ్యాసం బాగుంది. చేబదుళ్లు తీసుకవెళ్లి తీర్చనివారిలో నూటికి తొంభైతొమ్మిది మంది "ఆయింటి మాటలు ఈ యింటికీ, ఈ యింటి మాటలు ఆ యింటికి మోసుకవెళ్లి తగాదాలు తెచ్చేవాళ్లే" నన్న విషయం గమనార్హము.

కొప్పుల హేమాద్రి, గొల్లప్రోలు.

* * *

'చేబదుళ్లు' అన్న వ్యాసం గృహిణులకు ముఖ్యముగా తెలుసుకోవలసిన విషయము. కాని నాన్ గజిటెడ్ ఉద్యోగుల భార్యలు చేబదుళ్లు ఎక్కువగా చేసి ఇచ్చి పుచ్చుకోవటములో వారికి నీతినియమాలు (అనే అర్థములో) ఉండవు అన్నట్లు బడిపంతుళ్ళ భార్యలు మరీ అన్నట్లుగా వ్రాశారు. పంతులుగారి శ్రీమతినైన నాకు ఈ వ్యాసం మరీ నచ్చలేదు. జీతాలు తక్కువైనంత మాత్రాన ఇంగితజ్ఞానము తక్కువ అవుతుందని నేను ఒప్పుకోను.

వై. సత్యవతీ సత్యం, బలభద్రపురం.

* * *

"మధ్యతరగతి మగువలు" అన్న వ్యాసము చాలా బాగుంది. కాని హనుమావతిగారు వ్రాసినట్లుగా భర్తలు, భార్యలను అంత నీచముగా చూడటము లేదు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యపట్టణమైన హైదరాబాదులో 12 లక్షల మధ్యతరగతి కుటుంబాలు కలవు. వాళ్ళంతా హాయిగా, కులాసాగానే కాలం గడుపుతున్నారు. వి. సీతారామయ్య.

★



రెండు రెళ్లు నాలుగేనా?


ఇంకొన్ని ఎక్కువే ఉన్నట్టు జ్ఞాపకం అంతే వాక్య తాత్పర్యం కాదు రెండు రెళ్లు నాలుగేననీ, చాలా కాలంనుంచి అది అంతేననీ, నాలుగు కావడం అనేది రెండు రెళ్ళకు మహా చెడ్డఅలవాటయిపోయిందనీ చిన్నా పెద్దాఅంతా అనుకుంటున్నారు. ఆ ధీమాతోనే, బడిపిల్లలుకూడా టంగున జవాబిస్తారు. కాని డా॥ ఐన్‌స్టీన్ వంటివారు కొంచెం తటపటాయించారు. ఏమో ఎవ రెరుగును! రెండురెళ్లు ఐదైతే ..కనీసం నాలుగు కాకపోతే ఇలాంటి ధర్మసందేహాలు గొప్పవాళ్ళకి కాని రావు. ఈరోజున తిరిగి చలనచిత్రకారులలో ఈతరహా సందేహాలు కనిపిస్తున్నాయి.


ఈ కథకు డబ్బు వస్తుందా? ఈపాట హిట్ అవుతుందా? ఈ తారమీదమోజు డబ్బు సంపాదించి పెడుతుందా? ఈ రాయి గురికి తగులుతుందా?.. ఈ మొదలైన సందేహాల దగ్గరనుంచి గ్రామీణజనులకు గ్రామీణ వాతావరణంగల చిత్రాలు నచ్చుతాయా? ప్రజలలో దైవభక్తి ఉందా? బాగున్నవి డబ్బు గడిస్తాయా లేక డబ్బు గడించేవే బాగుంటాయా? ఏది ముందు? ఏది ముఖ్యం?

ఆయా చిత్రాల లాభాల అందనాలు విపణివీథిలో తలక్రిందులయినప్పుడల్లా ఈ ప్రశ్నలు గంద్రగోళంగా విరగబడి విలువలను క్రిందుమీదు చేస్తున్నాయి. ఈ కంగాళులో నే సినిమా నిర్మాత దృష్టిలో చిత్రం బాగుండడం డబ్బురావడం అనేవి ఒకొకొక్క దుర్ముహూర్తాన వేరైపోయాయి. ఒక కథ బాగా చెప్పడం అనేది ప్రేక్షక బాహుళ్యానికి అందని, కొరుకుడుపడని స్థాయిలో ఉంటేదిమాత్రమేనన్న తాత్పర్యం రూఢి అయిపోయినట్లు తోస్తుంది. దానితోపాటే ప్రేక్షకబాహుళ్యాన్ని రంజింప చేయగలిగినది నేలబారుగా ఉంటుందన్న గురభి ప్రాయంకూడా ప్రవేశించి ఉండాలి. ఈ అభిప్రాయాలు రెండూ చేతబట్టుకొని నేటి నిర్మాతే సాధించగలుగుతున్నదికూడా ఏమీ కనబడదు. నూటికి పది చిత్రాలే లాభం సంపాదిస్తున్నవి. ఈ దృష్టితో ప్రజాభిప్రాయాన్ని లాభసాటి వ్యాపారాన్ని అర్థం చేసుకొన్నకొద్దీ అదిమరింత అయోమయం అవుతోంది. సినిమా తీయడంలో ఏ ప్రమాణాలకు కట్టుబడి వ్యవహరించాలో కేటిని మన్నించాలో స్పష్టంగా తేలడం లేదు. అందువల్లనే రెండురెళ్లు నాలుగయినంత ఖరారుగా, వారిసూత్రాలు డబ్బు తేవటం లేదు. రెండుకు నికరమైన విలువలేక, ఒకొక్క నిర్మాతకి "రెండురెళ్ళు" ఒకొక్క తరహాగా ఉన్నందువల్ల ఏ రెండురెళ్లు నాలుగవుతాయో, ఏవి కావో తేలక చాలమందిని ఖంగారు పెడుతున్నాయి.

హఠాత్తుగా చలనచిత్ర నిర్మాణ ప్రపంచాన్ని సంస్కరించి వేయాలని ఈ వాక్యాలు ఉబలాటపడడం లేదు; అలాటి గురాశ లేదు కాని, పెరిగి పెరిగి తలకిందులైపోయి, మారిన ప్రమాణాలను తిరిగి నిదానించి విలువలు కట్టడానికి ప్రయత్నాలు జరగడం వాంఛనీయమని నిర్మాతలు గ్రహించవలసి ఉంది. డబ్బు గడిస్తున్నవి బాగుంటున్నాయి కాబట్టి, వాటికోసం కథలనిండా నీరు కలపాలి కాబట్టి అలా చేశాం అన్న సూత్రాలను వదలి, ధార్మికమైన ప్రమాణాలను ఎంచి నిర్ణయించుకొని వాటికి కట్టుబడి ఆరోగ్యకరమైన పద్ధతిలో చిత్రాలు తీసేందుకు మార్గాలూ మార్గాంతరాలూ ఆలోచించుకోవడం శ్రేయస్కరం. ★

రోహిణీ పిక్చర్సువారి
"నిత్యకల్యాణం పచ్చతోరణం"లో
వి. యస్. ఆర్.





వాహినీవారి 'రాజమకుటం'లో రాజసులోచన, రామారావు.

ఫ్రెంచి దర్శకుడు కాక్టో కొత్త చిత్రం

నార్మన్ మారిస్

త్రలాలోకా లేని చిత్రం,—పేరుకి సంబంధం లేని చిత్రం—లోకంమీద పదిమందీ కథ అనుకు చేతరపోజడి లేని చిత్రం—ఫ్రెంచి చలనచిత్రకళకే అద్భుతం అనిపించుకొన్నదీ అందరూ ఎదురుచూస్తున్నదీ ఒకటి త్వరలో విడుదల కాబోతోంది. దాని పేరు "లే టెస్టమెంట్ డి ఆర్ఫీ" (ఆర్ఫియస్ అంతమగీతం) కర్త—చలనచిత్రకళాకారుడుగా, కవిగా, నవలా రచయితగా, నాటకకర్తగా ప్రసిద్ధుడైన బహుముఖ ప్రజ్ఞాశాలి జీన్ కాక్టో.

ఇది తన ఆఖరు చలనచిత్రమనీ విశేషంగా, సాంప్రదాయిక చిత్రాలతో పోల్చితే విలక్షణంగా ఉండేవిధంగా దీనిని తీస్తున్నాననీ ఆయన చెప్పుకున్నారు. చూసినవారు, ఇది కావ్యమన్నారు. దేశకాలాతీతమైనదని స్తుతించారు.

కాక్టోతో ఈవిషయం ప్రస్తావించి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెబుతూ కావ్యహృదయాన్ని వివరించారు.


ప్రశ్న: మీ చిత్రం పేరుకు అర్థం ఏమిటి?

జవాబు: నా చిత్రానికి, దాని పేరుకూ సంబంధం లేదు. ఇది నా తుది చిత్రం అని మాత్రం సూచిస్తుంది. చిత్రణ శిల్పం, నా తొలి చిత్రం "బ్లడ్ ఆఫ్ ఎ పొయెట్"లో లాగే స్వేచ్ఛాయుతంగా ఉంటుంది. ఇందులో నేను నా పాత్రనే ధరించి కేవలంగా నటిస్తున్నాను. ఇంకొక కళాకారుడి జీవితాన్ని నేను చిత్రిస్తాను అంటూ తీసే చిత్రాలు నాకు గిట్టవు. అందువల్ల ఇప్పుడు నా గురించి నేనే మాట్లాడుతున్నాను.

ప్రశ్న: అయితే ఇది స్వీయచరిత్ర అవుతుందా?

జవాబు: మోడల్ ను చూసి బొమ్మవేసేవాడు దానికి ఎంత దూరం వెళ్ళగలిస్తే, ఆ వస్తువు హృదయానికి అంత దగ్గరయి సంపూర్ణమైన చిత్రం వేయగలుగుతాడు. ఈ చిత్రం కూడా అంతే. సమకాలిక జీవితంలో సంభవించగల సన్నివేశాలేవీ ఇందులో కనబడవు; అయినా ఊహించి కట్టిన ఈ సన్నివేశాలతోటే నేను జీవితానికి—నా జీవితానికి—దగ్గరగా వచ్చి దాన్ని సమగ్రంగా ఇందులో ప్రతిబింబించగలుగుతున్నాను.

"చిత్రకారుడైతే, కళమీద అభిమానం గలవాడై కొద్దిమంది కోసమో బొమ్మ వేస్తాడు గాని సినిమా ఇత్యాది ప్రజలు చూడవలసినదిగదా అని మీరు అనవచ్చు. అయితే, తమ జీవితంలో తెల్లారిలేచి రాత్రి పడుకునే



దినదిన ప్రవర్ధమాన తార

కాక్టో కొత్తచిత్రం

నాకాకర్ అలా చేసే పనిపాటలన్నీ చూడాలని అందరికీ సరదా ఉండదు. అలా ఉండని వారికోసం కాకపోయినా ఇలాంటి చిత్రాలు తీయడం తప్పేమీ కాదు."

ప్రశ్న : మీ చిత్రంలో కథ ఏమన్నా ఉందా?

జవాబు : నా చిత్రానికి మొదలూ తుదీ లేదు. కాని ధ్యేయం ఉంది. ఈ చిత్రం తీయడానికి ఏదో వంక ఉండాలికదా—ఏదో ఓ కథ అడ్డుపెట్టుకోవాలి కదా అని నేను ఆలోచించలేదు. తెరమీద ఎవర్ని చూపెట్టాలి, ఏమి చూపెట్టాలి, వాళ్ళచేత ఏ పద్ధతిలో మాట్లాడించాలి అన్నదే ముఖ్యం. చెబుతున్న విషయాలకు సంబంధం ఉందా, అవన్నీ కలిసి ఏమి చేస్తున్నాయి అన్నది వేరు. మనం వెచ్చటిచోట పడుకుని ఒక కునుకు తీసినప్పుడు, మనలోని అస్పష్టమైన అవ్యక్తమైన ఊహాలకు రూపకల్పన చేసుకుంటాం. వాటన్నింటినీ గుదిగుచ్చే దారం ఏమీ వుండదు. అది నిద్రా కాదు, మెలకువా కాదు. ఇలా జాగ్రదవస్థకు సుషుప్తికీ పరిమాత్రులు కలిసిపోయిన వేళ, ఒకచోట ప్రశాంతస్థితిలోంచే ఈ ఊహాచిత్రాలు ఆవిర్భవిస్తాయి. అందువల్ల నా చిత్రంలో కథ కనబడదు. ప్రేక్షకుడి బుద్ధికి తోడుపోసి ఉత్కంఠత కలిగించి, ముందుకు లాక్కుపోయే సన్నివేశాల పరంపర క్రమంగా వుండదు. కాని విడిగా ఏ సన్నివేశానికాసన్నివేశం ఒక కథ అవుతుంది. పూర్ణమైన ఈ కథలన్నీ పూసగుచ్చి కట్టిన హారమే నా చిత్రం. ఆపూసలన్నింటినీ కలిపి పట్టుకునే ఆధారం, హారంలో దారంలాగే అంతర్వాహినిగా వుంటుంది. ఉపసంహార ఘట్టంలో నేను వేదికమీద నిలబడి లెక్చరర్ గా కనబడి మాట్లాడే సన్నివేశమే ఈ హారాన్ని నా భావసుందరి కంఠసీమను నిలిపే కొక్కెం.

ప్రశ్న : చలనచిత్రకళలో వ్యంగ్యాత్మక ప్రతిభను—ముఖ్యంగా కామప్రవృత్తికిసంబంధించినవాటిలో—పరిమితమైన స్థాయిలోనే చూచి హర్షించడానికి అలవాటుపడిన ప్రేక్షకబాహుళ్యాన్ని హడలగొట్టవలసివస్తుందని మీరు భయపడటం లేదా?

జవాబు : ఏది ఎప్పుడు తప్పు ఏది ఎప్పుడు ఒప్పు, ఎప్పుడు గొప్ప, ఎప్పుడు కాదు అనేది చూపి, తప్పులను సానుభూతితో అర్థం చేసుకోగలగడం నేర్పేది ప్రతిభ, అటువంటి "గొప్ప తప్పు"లను పోగేసి చూపిస్తుంది నా చిత్రం. వీటిమీద మాట్లాడి వ్యాఖ్యానించగల శక్తి ద్వారా చలనచిత్రాల సొత్తు. నిత్యవ్యవహారంలో మనం ప్రాసే పదివేభావ వాడివాడి, వాడిపోయి సగం చచ్చిపోయింది. అందువల్ల శక్తివద్భావంలో మాట్లాడ గలగడమే చలనచిత్రకారుల లక్ష్యం. అది ప్రమాదకరమైనదే కావచ్చు.

ఈ చిత్రంలో కనబడే పాత్రలు బహు కొద్ది. అవి మాట్లాడేదం మరీ కొద్ది. చెప్పదలచుకొన్న సంగతి మనసుకు నాటుకునేలా ఒకటిరెండు నిమిషాలలోనే చెప్పగలగడం కష్టం. కాక్టో మిత్రులు కొందరు ఇందుకు సంసిద్ధులై ఆయా పాత్రలు ధరించారు.

* * *

ఇందులో ఆయన రంగులు వాడలేదు. చిత్రలేఖనంలో వలె 'చలనచిత్రలేఖనం'లో రంగులు పని చెయ్యవు. చిత్రానికి నిర్దిష్టరతను సమకూర్చలేవు తీస్తే, వున్న రంగులన్నీ ఉన్నవి ఉన్నట్టుగా తీసి చూపగలగాలి అలా కాకపోతే వంచించడమే అవుతుంది. మానవుడిలో దుష్ప్రవృత్తి విజృంభించి, రూపు చూపుతున్న వేళ, ఈ రంగులు కంటికి ఎదురుగా కనబడి బుద్ధిని చెదరగొడతాయి అని కాక్టో అన్నారు. ★



కె. వి. ఆర్ట్ ప్రొడక్షన్సువారి 'కన్నకొడుకు' చిత్రంలో రామకృష్ణ, కృష్ణకుమారి.

మార్గదర్శకుడైన దర్శకుడు హెచ్. ఎం. రెడ్డి

శ్రీ హెచ్. ఎం. రెడ్డిగారి మరణవార్త వినగానే చాలా విచారం కలిగింది. అస్వస్థులుగా ఉన్నా ఇంత హఠాత్తుగా వెళ్ళిపోతారని ఎవరూ అనుకోలేదు. దర్శక పితామహుడని ప్రజలు పిలుస్తున్నట్టుగానే ఉత్తరాయణం కోసం ఎదురుచూచిన భీష్ముని వలె రెడ్డిగారున్నా, ఉత్తరాయణం రావటం చూచుకుని మరణించటం వారి మనోనైర్మల్యానికి, మంచితనానికి నిదర్శనం కావచ్చు.

1937 లో అనుకుంటాను,— నేను సినిమా పత్రికలో ప్రవేశించి 'కనకతార' చిత్రం వ్రాస్తున్న క్రొత్త రోజుల్లో శ్రీ రెడ్డిగారితో పరిచయం కలిగింది. కొల్హాపూరులో వారికిగల పలుకుబడికీ వారి శక్తిసామర్థ్యాలను గురించి మిత్రులు కీ॥ శే॥ గూడవల్లి రామబ్రహ్మంగారు, పారుపల్లి శేషయ్యగారు చెప్పుతూన్నప్పుడు ఎలా వుంటాడో అని భయంగా ఉండేది. పేటకువెళ్లి దొరగారి వేషంలో హోటల్లో వారు నాకు దర్శనం ఇచ్చారు. పొడుగుపాటి శరీరం తిప్పిన మీసాలు! ఆ గాంభీర్యం క్రొత్తవారికి భయంగానే ఉండేది. కొంతసేపు మాట్లాడిన తరవాత పైకి కనిపించే వేషానికి లోపలి మనస్తత్వానికి తేడా తెలిసింది. మన లాటివాడేనని మనస్సున్నవాడని—మనసిచ్చి చనువుగా మాట్లాడకోవచ్చునని. గృహలక్ష్మి చిత్రం తీస్తున్నప్పుడు పరిచయం బలపడింది. ఎంతో ఆదరంతో చూచి మాట్లాడేవారు; పని చేయించుకునే వారు. వేదాంతం మాట్లాడడమంటే వారికి చాలా ఇష్టం. జ్యోతిషమంటే వల్లె అనే చెప్పవచ్చు. ఎంత పనిలో ఉన్నా జ్యోతిష్యం మాట వచ్చినా జోస్యుడు వచ్చినా చేసేపని మానివేసి ఆ విచారంలో పడేవారు. చాలావరకు వారి జీవితంలో ఆత్మశక్తికన్నా గ్రహబలంలోగల విశ్వాసమే హెచ్చు ప్రాధాన్యం వహించి ఉంటుంది.

అటివిమీరిన సంసారపు జంజాటంలో ఉన్నా కొంతవరకు ముక్తసంగులుగానే ఉండేవారు. దైవమంటే భయమూ భక్తీ ఉండేవి. సిరదాతలు కాకపోయినా దీనులపైన జాలీ, సాయం చేయాలనే సంకల్పంగల మనిషి. కాని—అది ఎప్రభావమైనా గాని, చాలా ఆత్మాభిమానంగల వ్యక్తి. ఒక్కొక్కప్పుడది స్వలాభానికి అడ్డుతగిలే పరిస్థితులు కూడా తెచ్చిపెట్టగలిగేది. కాని చివరవరకూ దాన్ని వారు త్యజించకుండా నిలబెట్టుకున్నారు.

మదిరాసు నగరానికి వారు పరదేశీగా వచ్చిచేరారు. [illegible] ప్రజల సహకారం ప్రోత్సాహాలను సంపాదించి పరిశ్రమలో—సంఘంలో పాగుకొని పోయారు. అభిప్రాయభేదాలున్నా, ఎదుటపడి వారిమాట కాదనటానికి సాహసించే వారు అరుదనే చెప్పాలి. వారితో కలిసి పని చేయడం ఒక భాగ్యంగా నటులు భావించారు. వారిది సిద్ధహస్తమని వ్యాపారస్థులు విశ్వసించారు.

సముద్రాల రాఘవాచార్య

శ్రీ రెడ్డిగారు మనదేశంలో నిర్మించిన చిత్రాల సంఖ్య అట్టే పెద్దదికాదు. కాని వాటిలో మరపురాని మనోహర చిత్రాలు కొన్ని ఉన్నాయి. వారు పోయినా ప్రజలు ఆ చిత్రాలను మరచిపోరు. చిత్రనిర్మాణంలో శ్రీ రెడ్డిగారిది ఒక ప్రత్యేకదృష్టి. కళాత్మక సృష్టికంటే ఆర్థికవిజయం మీదనే వారు శ్రద్ధవహించేవారు. కరుణ హాస్యాల మోతాదు వారి చిత్రాలలో హెచ్చుగా కన్పిస్తుంది. ఆ ఆవేశంలో వారొక్కొక్కసారి, సహజత్వాన్ని వదలిపెట్టి చాలా మాటుగా చెప్పడం చూపించడం కూడా ఉంది. అదే వారి విజయానికి కారణమైంది. వారి మనోనిశ్చయం మార్దవం చాలాకష్టే. అలాగే వారు ధనం గడించారు. స్టూడియో అధిపతులైనారు. దక్షిణభారత ఫిలిం ఛేంబరుకు అధ్యక్షులైనారు. ఉన్నంతవరకూ హాయిగా అనుభవించారు. ఆయన చరితార్థులు. సుకృతి.

శ్రీ రెడ్డిగారు సాధించిన సఫలతలలో కీర్తిగొప్పది శిష్యపరంపర యింకా గొప్పది. ఎందరో గురువులున్నారు. వారి కృషిచేసిన శిష్యులందరూ తనవంటివారూ, తనను మించినవారూ కావటం చూచి సంతోషించే భాగ్యం ఏ కొందరికో లభిస్తుంది. ఆ కొందరిలో శ్రీ హెచ్. యం. రెడ్డిగారు ఒకరు. వారితో కలిసి పనిచేసిన శ్రీ యల్. వి. ప్రసాద్ గారు, తంగిరాల హనుమంతరావు, కమలాకర కామేశ్వరరావు, పి. యస్. రామకృష్ణరావుగార్లు దర్శకులై గురువుకు కీర్తి తెచ్చారు. శ్రీ ప్రసాద్ గారి అనుయాయులు ఆ పరంపరను సాగిస్తూ గురువుగారి కీర్తిని విస్తరింప చేస్తున్నారు. ఈ పరంపర ఇలా విస్తరిల్లుతూ ఉన్నంతకాలం హెచ్. యం. రెడ్డిగారు అమరులే. ఈ ఆనందం వారి ఆత్మకు అనంతశాంతిని ప్రసాదించి తీరుతుంది ★



వాహినీవారి 'రాజమకుటం' లో పద్మనాభం, గుమ్మడి.



చంద్రికావారి 'శ్రీకృష్ణరాయబారం'లో కర్ణుడుగా గుమ్మడి, కుంతిగా హేమలత.

వార్తావరణం

చలన చిత్రాల చరిత్రలో శబ్దం, వర్ణం తరువాత ఇప్పుడు పరిమళం రావడంతో కొత్తఘట్టం ఆరంభమైంది.

అయితే ఈ పరిమళాల కొత్త హంగు తాత్కాలికమైనది కావచ్చునని చలన చిత్రాలపై దీని ప్రభావం అమితంగా ఉండకపోవచ్చుననీ అనుకొంటున్నారు.

కాంటినెంటల్ పిక్చర్స్ పేరిట కాంట్ లియొనార్డో అనే ఇటాలియన్ నిర్మాత, పియర్ లూడొవికో పావోనీ, అలెసాండ్రో తేవా అనే ఛాయాగ్రహణ దర్శకులూ తీసిన టోటల్ స్కోప్ డీలక్స్ కలర్ చిత్రం 'బిహైండ్ ది గ్రేట్ వాల్'లో ఈ పరిమళాల హంగు చేర్చి అమెరికాలో ఇటీవల విడుదల చేశారు. దీనికి 'అరోమారామా' అని పేరు పెట్టారు. పావోనీ, రెండేళ్ళ క్రితం చైనాలో పర్యటిస్తూ తీసిన ప్రకృతిదృశ్యాల సంపుటి ఇది.

చిత్రంలో మొత్తంమీద 81 రకాల పరిమళాలను గుప్పిస్తారు. చార్లెస్ వీస్ అనే అతను కనిపెట్టిన ఈ అరోమారామా పద్ధతి: సెల్యులాయిడ్ మీద సౌండ్ ట్రాక్‌తో పాటు, ఈ వాసనకోసం మరొక ట్రాక్ విద్యుచ్ఛక్తితో రికార్డు చేసి ఉంచుతారు. అంటే ఏ దృశ్యం లో ఏ వాసన వెయ్యాలో సూచించే సంకేతాలను ఇక్కడ కాంతి కిరణాలభాషలో వ్రాస్తారన్నమాట. ఫిలిం తిరుగుతున్న కొద్దీ ఈ సంకేతాల ప్రకారం

ఈ 'సెంట్ ట్రాక్', హాలులోని ఒక ఎలెక్ట్రానిక్ ట్రిగ్గర్‌ను పనిచేయిస్తూ ఉంటుంది. ఆ మీట, వెంట వెంటనే, సినిమా ఎయిర్ కండిషనింగ్‌లోని ప్రసార యంత్రాల ద్వారా ఆయా పరిమళాలను గుబాళిస్తుంది. ఇందుకోసం ఆయా పరిమళాల ద్రవ్యాలను అక్కడముందే అమర్చి ఉంచుకుంటారు.

అమెరికాలోని ఒక కంపెనీ ఈ పరిమళ ద్రవ్యాలను ఉత్పత్తి చేస్తుంది. (ప్లాస్టిక్ పెట్టెలకు తోలువాసన, పాతకార్లకు కొత్త కార్ల వాసన, చుట్టపెట్టెలకు పొగాకు వాసనవేసే ద్రవ్యాలనుకూడా అమ్ముతుంది) తెరమీదికి ఒకదృశ్యం రాగానే రెండు సెకండ్లలో దానివాసనను హాలులోని ప్రతి ప్రేక్షకుడి నాసాపుటాలకు అందించి, అంత త్వరగానే ఉపసంహరించి, కొత్త పరిమళాన్ని ప్రసరించడానికి సదుపాయాలున్నాయట. ఇది బాగా కట్టుదిట్టం కానందువల్ల ప్రసుతం, గోబీఎడారి చూస్తున్నప్పుడు పచ్చగడ్డి వాసనవచ్చే ప్రమాదం ఉన్నట్లు ఒక పత్రిక వ్రాసింది.

అమెరికన్ నిర్మాత మైకెల్ టాడ్ జూనియర్ కనిపెట్టిన మరోపద్ధతి 'స్మెల్లో విజన్' త్వరలోనే రాబోతూంది.

అశ్వరాజ్ వారి 'దీపావళి' చిత్రంలో రంగారావు.





చంద్రికా ఫిలింస్ వారి 'శ్రీకృష్ణ రాయబారం'లో
రఘురామయ్య, కాంతారావు.

అన్నపూర్ణా పిక్చర్స్ వారు కొత్త చిత్రానికి కథాసంవిధానం ఏర్పరచడం పూర్తి అయింది. గతవారమే ఆత్రేయ సంభాషణల రచనకూడా ముగించారు. నటులు నాగేశ్వరరావు, సావిత్రి, జగ్గయ్య, సూర్యకాంతం, రేలంగి మొదలగువారు. సంగీత దర్శకుడు పెండ్యాల. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు, నిర్మాత మధుసూదనరావు.

* * *

ఆంధ్ర ఫిలిం పత్రికా రచయితలసంఘం వార్షిక సర్వసభ్య సమావేశం జనవరి 17న జరిగింది. గత సంవత్సరం కార్యకలాపాల సమీక్ష, సమస్యలపై చర్చ జరిపిన మీదట, 1959 లో ఉత్తమచిత్రాన్ని కళాకారులనూ ఎన్నికచేసి "విమర్శకుల బహుమతుల"ను ఇవ్వాలని తీర్మానించారు.

తెలుగు చలనచిత్ర పితామహుడు హెచ్. ఎం. రెడ్డిగారి మృతికి సంతాపం ప్రకటిస్తూ తీర్మానం చేశారు.

కొత్తసంవత్సరానికి శ్రీ మాగాపురామన్ శ్రీ కొలను బ్రహ్మానందరావు అధ్యక్ష ఉపాధ్యక్షులుగా, శ్రీ గౌతమ్, శ్రీ బి. వి. నరసింహారావు కార్యదర్శులుగా, శ్రీయుతులు పి. లక్ష్మీనారాయణ, గోశెట్టి శ్రీరామారావు, ఎల్లోరా, ఎ. వి. కృష్ణమూర్తి, జి. వి. రావు; సభ్యులుగా కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

* * *

హైదరాబాద్ నగరంలో సినిమా యజమానులు బొంబాయి, మద్రాసులలో లాగే ప్రాంతీయ భాషా చిత్రాలను కూడా ప్రదర్శనకాలంలో మూడోవంతు విధిగా కేటాయించాలన్న నియమం అమలు జరపాలని ఆంధ్ర – చలనచిత్ర వాణిజ్యమండలి తన వార్షిక నివేదికలో కోరింది.

ఎం. జి. ఎం. వారు భారీ వ్యయప్రయాసలతో నిర్మించిన చిత్రం 'బెన్‌హార్'ను, న్యూయార్కు చలనచిత్ర విమర్శకులు 1959 కి ఉత్తమచలనచిత్రంగా ఎన్నిక చేశారు. పౌరాణిక వాతావరణంలో నిలిచి మేజర్ జనరల్ ల్యూ వాలెస్ వ్రాసిన నవల ఆధారంగా అరకోట్ల ఖర్చుతో రెండేళ్లు పైగా పనిచేసి తీసిన ఈ చిత్రానికి విలియం వైలర్ దర్శకత్వం నిర్వహించారు.

'టెన్‌కమాండ్‌మెంట్స్' చిత్రంలో మోసెస్‌గా నటించిన చార్లటన్ హెస్టన్ ఇందులో ముఖ్యపాత్ర ధరించాడు. స్టీఫెన్ బాయిడ్, మార్తాస్కాట్, కాథీ ఓ డానెల్ హ్యూగ్రిఫిత్, జాక్ హాకిన్స్ బెన్‌హార్ భార్య ఎస్తర్‌గా హియాహారే-యా-రీత్ అనే ఇజ్రేలీ యువతి నటించారు. ఈ చిత్రంలో 9 నిముషాలసేపు చూసిన రథాల పందెం చిత్రించడానికి 3 నెలలూ, 40 లక్షల రూపాయలూ ఖర్చయాయి. ఈ చిత్రం చాలా పెద్దది–మొత్తం 3 గంటల 39 నిముషాలు (సుమారు 31 రీళ్లు) సాగుతుంది. దీనికి, మొదటి వారంరోజులలోను 11 థియేటర్ల మీద 12,16,792 డాలర్లు వసూలయ్యాయి. జనవరి 4 నాటికి 10 లక్షలు వసూలు అవుతాయన్న అంచనా 2వ తేదీకే పండిపోయింది. ఇది 'టెన్‌కమాండ్‌మెంట్స్' కన్న ఎక్కువ గడిస్తుందని లెక్క వేశారు.

దాదాసాహెబ్ తోర్నే స్మృతి

భారతీయ చలనచిత్ర పరిశ్రమకు ప్రారంభోత్సవం జరిపినవారిలో ప్రముఖుడు దాదా సాహెబ్ తోర్నే జనవరి 20న పూనాలో కాలధర్మం చెందారు. ఆయన వయసు 69

భారతదేశంలో చిత్రనిర్మాణం ఆరంభమైన తొలిరోజులలోనే ఈయన 'పుండలీక్' అనే కథాచిత్రం నిర్మించారు. మొట్టమొదటి మహారాష్ట్ర టాకీచిత్రం "శ్యామ్ సుందర్" (సరస్వతీ) నిర్మాత కూడా ఈయనే. సుమారు 25 హిందీ మహారాష్ట్ర చిత్రాలు తీసి అనేక విధాల మార్గదర్శకుడు అనిపించుకొన్న దాదాసాహెబ్ చిత్రాలలో భక్త ప్రహ్లాద, సింధాల్, రాజా గోపీచంద్, దేవయాని, సచ్ హై ఎన్నతగవి. సాహూకా పాడక్, శాంతా ఆప్టే, జయశ్రీ, స్వర్ణలత, రత్నప్రభ మొదలైన నటీనటులనూ, ప్రసిద్ధ దర్శకుడు మహబూబ్‌ఖాన్‌ను ఆయనే వెండితెరకు పరిచయం చేశారు. ★

అదీ ఇదీ

మాయమైన బాట్

ఐదవ టెస్ట్‌లో పాల్గొనడానికి ముందు ఆస్ట్రేలియన్ క్రికెట్ ఆటగాళ్లు కలకత్తా, ఈడెన్ గార్డెన్స్‌లో ప్రాక్టీసు చేస్తూ ఉండగా, ఆటోగ్రాఫ్ వేటగాళ్లు ఆటగాళ్లని చుట్టుముట్టేశారు. దాదాపు వెయ్యి మంది జనం వెంటపడి వేధించి ఫీల్డులోంచి ఆటగాళ్లని తరిమేసినంతపని చేశారు. గుంపు ఒత్తిడికి ఇద్దరు ఆటగాళ్లు కిందపడి దెబ్బలు తగిలించుకున్నారు. ఒక ఆస్ట్రేలియన్ ఆటగాని బాట్ కూడా ఆ గందరగోళంలో మాయమైపోయిందట.

(న) కళ్లు

న్యూయార్క్‌లో డా॥ లిరాయ్ సార్డ్ జోన్స్ అనే ఆయన చనిపోతూ నేత్రదానం చేసి మరీ పోయాడు. ఆయనకళ్లు దినపూర్ (బీహార్) గ్రామానికి చెందిన 16 ఏళ్ల రైతు కుర్రాడు శ్యామ్ ఓహారికి, కుర్సియాంగ్ (ప. బెంగాల్)కు చెందిన 32 ఏళ్ల స్త్రీ క్రిసెన్‌కు దృష్టి భిక్ష పెడుతున్నాయి. న్యూయార్క్ వైద్యుడు డా॥ విలియం కౌకిమిస్ పాట్నా ఆస్పత్రిలో ఈ కళ్లు మార్పిడి చికిత్స చేశాడు.

బ్రహ్మపుత్రుడు

బ్రహ్మపుత్రానది ఏటేటా జననష్టం, ధననష్టం చేసి కష్టం కలిగిస్తోంది, కారణం ఏమిటి?

రైల్వేమంత్రి శ్రీ జగ్జీవనరాం సమాధానం వినండి! బ్రహ్మపుత్ర, సోనేపుత్ర ఈ రెండూ మగనదులట. అందుచేతనే ఇవి మహోగ్రంలుగా ప్రవర్తిస్తున్నాయట. నాగరికత పెరుగుతోంది. మగవాడి ప్రవర్తన క్రమంగా అదుపులోకి వస్తోంది. ఆ పరివర్తన ప్రభావంవల్లనే బ్రహ్మపుత్రానది కూడా క్రమంగా అదుపులోకి వస్తోంది. ఇదీ మంత్రిగారి చమత్కార ఛలోక్తి.

మంత్రిగారి మనీపర్సు

కేంద్రమంత్రి శ్రీ కె. సి. రెడ్డి బెంగుళూరునుంచి మద్రాసు వచ్చేలోగా ఆయన జేబులోని మనీపర్సు మాయమైపోయింది. బెంగుళూరులో రైలెక్కేటప్పుడు పర్సు ఉంది. మద్రాసు సెంట్రల్‌లో దిగేటప్పటికి పోయింది. పర్సులో ఉన్నది 7 వేల రూ. లు అంత ధనమున్న పర్సు 'దాచేస్తే దాగని సత్యం' లాంటిది. ★

పుస్తకసమీక్ష

ఆంధ్ర మహావిష్ణువు-(ద్విపద కావ్యము.) రచన: వఝ్ఝల కాళిదాసు. మూల్యం 75 న.పై. ప్రాప్తిస్థానం ఆంధ్ర విజ్ఞాన సమితి, విర్ధినివాస్, 'ఎమ్'రోడ్డు - బిష్టుపూర్. జమ్‌షెడ్‌పూర్.

ఆంధ్రజాతికి ఆదిపురుషుడైన ఆంధ్రమహావిష్ణుగాథ ద్విపదకావ్య రూపంలో ముచ్చటైన చిన్ని పొత్తంగా వెలువడింది. ఇదివరలో ఈ కావ్యం ఆంధ్ర సచిత్రవారపత్రిక స్వర్ణోత్సవ సందర్భంలో బహుమతి గణించుకొన్నది. భావవిన్యాసం, కథావికాసం కలసివచ్చేటట్లు కమనీయంగా ఈ ద్విపద కావ్యం, వ్రాసి శ్రీ కాళిదాసుగారు లబ్ధప్రతిష్ఠులైనారు.


తేనె తెలుగు పలుకులతో తేటగా కవనం చెప్పటానికి ప్రాచీనకవులు వాడిన ద్విపద ఛందస్సు అందిపుచ్చుకున్నట్టు వుంటుంది. మాటల పొదుపుకుగాని, కథనపు టొడుపుకు గాని ఈవిధమైన ఛందస్సు ఎంతో అనువుగా ఉంటుందనటానికి ఈ కావ్యమే నిదర్శనం. అందుకే శ్రీ కాళిదాసుగారు 'ద్విపద'లో ఈ కావ్యం చెప్పారు. 58 పేజీల యీ చిన్న పొత్తం అందమైన బొమ్మలతో అభిమానులకు విత్తమే అవుతుంది. ★

—రామం.

పదరంగం

సమస్య 16

నలుపు (1)



తెలుపు (5)

తెలుపుఆడి మూడెత్తులలో ఆటకట్టాలి.

న్యూఢిల్లీ లేఖ


(4-వ పేజీ తరువాయి)

అయితే పార్లమెంటు సభ్యుడు ఒక్కొక్కడూ తన నియోజకవర్గానికి ఏం చేసిందీ తెలిపే నివేదికలు కూడా ఆయన ప్రచురించటం అవసరం.

బొంబాయిరాష్ట్రవిభజనకు అనుకూలంగా రాజ్యాంగం మార్పు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఢిల్లీకి ఇవ్వబడిన ప్రాతినిధ్యం కూడా అదే బిల్లుతో ఉపసంహరించడం అవసరం! ఢిల్లీ ప్రతినిధులు అప్రయోజకంగా అనవసరంగా జీతాలు తీసుకుంటున్నారు!! ఇందువల్ల ఆఖర్చు తప్పుతుంది. కాగా పాలక వ్యవహారాలు పరిశుద్ధం చేయడానికి ఇది మొదటి మెట్టు కాగలదు.

ఇంతవరకు ఢిల్లీ పట్ల శ్రద్ధ తీసుకుంటున్న వారు పార్లమెంటులోని ఇతర సభ్యులు. వారికి ఢిల్లీ పౌరులు కృతజ్ఞులుగా ఉంటారు. ★

ఆంధ్రపత్రిక గళ్లనుడికట్టు 14



ఆధారాలు

అడ్డము

1. చంద్రకళ కనిపించే అమావాస్య సినిమాలకు చెందిన మనిషి.
4. కాకౌరవములో ఎంతపొగరున్నది!
6 రాత్రిమీద నాట్యమాడేది.
8. అలమరలో దాచిన మినుము.
9. సమావేశం.
10. ఏడున్నర గడియలు.
11. చిన్నదూర్పులో సకలం చిన్నదై పోతుంది.
13. మొత్తం రావాలంటే 9 అడ్డం తక్కిన భాగీగా ఉన్న నిలువు గడి పూర్తి కావలసిందే.
14. నాయకుడు ఇట్టలు తయారు చెయ్యడం.
15. స్వాగతం ఇస్తుంటే జరిగింది.
16. శత్రువు వెనక్కి తిరిగాడు.
18. కనకం, బంగారు వస్తువులు, విరివిగా ఉంటే పదిగాబరా.
20. చంద్రకళలేని అమావాస్యలో కోకిలకూత.
22. కోడదూడ.
23 బాణం ఉంచేది బాణంలాంటిదే.
24 నేను అభిమానిని అనే స్త్రీ.
26. తిమరు వాతపెట్టిన పిదప.
27. మచ్చలేనిది.

నిలువు

2. నీదంప వేడికి కరిగిపోతుంది.
3. పిలిచి మొదట ఇటుతిప్పి రాసేది.
4. వేడి
5. సభకు రయమున వెళ్ళడంలో తొందర.
7. కాళ్ళకు పూసుకునేది.
8. వినోదం.
11 కిరీటం గల కావ్యం
12 ఇనుముతో చేసినా బంగారులాంటిదే.
16. కొండవిరిగి పడడంలో తలకిందు లైంది.
17. ఒక తెలుగు సినిమాతార అభిమాన పాత్ర.
19. పాటలు పాడేది.
20 నాగలి-చివరఉన్న అసక్తి
21 బాణముల దేశం
24. తల్లి
25. యుద్ధం తలకిందులైంది,

13-వ నుడికట్టుకు జవాబులు

1 పా	■	2 ఎ	త్తు	■	3 నా	4 వే	■	5 లు
6 ర	గ	డ	■	■	■	7 ట	ము	కు
ము	■	బా	■	■	■	కొ	■	కు
■	8 కి	టు	9 కు	■	10 అ	డు	గు	■
■	■	■	11 ము	ఖా	రి	■	■	■
■	12 ప	13 గ	లు	■	14 ది	15 లా	సా	■
16 అ	■	డ	■	■	■	లా	■	17 జా
18 స	ర	స	■	■	■	19 జ	ము	వ
లు	■	20 రి	క్క	■	21 గా	లం	■	కి

సుందరీ-సుబ్బారావు

(37 పేజీ వ తరువాయి)

కొనలు భుజాలమీద కుచ్చులాపడేటట్లు చేసింది. ఆ దుస్తులో ఆమె అవయవాల సౌంకం స్ఫుటంగా, మరీ ఆకర్షణీయంగా ఉంది. ఆమె చేతిలో బాడ్మింటన్ బాట్ వుంది.

సుబ్బారావు రెప్పలల్లార్పకుండా ఆమెని చూశాడు.

'ఏం యీ డ్రెస్ బావులేదా' నవ్వుతూ అడిగింది సుమిత్ర.

'చాలా బావుంది. మీరు అప్సరసల్లా ఉన్నారు.'

'ఊర్వశినా తిలోత్తమనా' కిలకిలనవ్వింది 'రండి ఒక గేమ్ వేసుకుందాం'

బాడ్మింటన్‌లో మంచి ఆటగాడయిన సుబ్బారావు మూడు గేములూ ఓడిపోయాడు. ఆమె అందాన్ని అవయవాల్ని తనివిదీరక చూసే అతనికి కోలుబంతి కనపడనేలేదు.

'మీరుపరాగ్గా ఆడారు. మీరు మంచి ప్లేయరని విన్నాను. ఆడదాన్ని కదా అని పాపం దయతలిచారుకదూ' చిరుకోపంతో అందిసుమిత్ర.

'నోనో—మీరీ వేళ నిజంగా బాగా ఉన్నారు—అం—ఆడారు'అన్నారు.విరగబడి నవ్వింది సుమిత్ర. ఆ నవ్వుకి — ఇదేమిటి ఈ తెల్లని పారిజాతపూలదండలు ఎవరో విసురుతున్నారని యిటూ అటూ చూశాడు సుబ్బారావు.

వారంరోజులు పోయాక అక్కడే ఆ బాదంచెట్టుకింద కూర్చుని వాళ్ళిద్దరూ మాట్లాడుకో వడంకనుక పాఠకుడు పనిఉంటే తెల్లబోతాడు. వాళ్లు 'మీరు' అనకోవడం మానివేశారు. 'నువ్వునువ్వు'అని చాలాసన్నిహితంగా దనవుగా మాటాడుకుంటున్నారు.

'నువ్వెవర్ని ప్రేమించలేదా సుమిత్రా'

'ఉహుఁ'

'అయితే నువ్వు పెళ్లాడవా'

'ఉహు—సన్యాసిగా ఉంటా'

'అబ్బ నిజం చెవుమా'

'నీమాటకేంగాని మరినువ్వు'

'నేనా—నేను నేను...'

తడబడ్డాడు సుబ్బారావు.

'ఊఁ—చెప్పవోయి'

'ఒక దివ్యసుందరీమణిని ప్రేమించాను'

'ఎవరూ...?'

'పేరుచెప్పకూడదు'

'పోనీ, ఏవూరూ?'

'ఈ ఊరే—'

'ఎక్కడుంది యీ పూర్ళో?'

'ఎక్కడ—యిక్కడే'

'ఇక్కడా—' తెల్లబోయి యిటూ అటూ చూసింది సుమిత్ర.


'ఇక్కడ' అంటూ గుండెలు చూపించాడు సుబ్బారావు.

'ఓస్. అంతేనా' అంటూ పకపక నవ్వింది సుమిత్ర.

సుబ్బారావు ఒక్కసారి తన హృదయం విప్పి ఆమెముందు పెడదామనుకున్నాడు.

'నువ్వులేనిదే నేను బ్రతకలేను. నా ప్రతి అణువులో, ప్రతి ఊహలో నువ్వే నువ్వే.' అనేసి ఆమె పాదాలమీద పడిపోదామనుకున్నాడు. కాని సుమిత్ర చటుక్కున లేచి "ఇక పోదాం సుబ్బారావ్. ఆలస్యమైపోయింది' అంటూ విష్ చేసి లోపలికి వెళ్ళిపోయింది. (మిగతా వచ్చేవారం ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd. by S. Radha Krishna at The Andhra Patrika Press 6 & 7, Thambu Chetty Street Madras-1. Editor S. Sambhu Prasad.



గుసగుసలు

చిత్రకారుడు: కల్యాణప్రసాదశర్మ, విజయనగరం.

Regd No. M. 4479 Andhra Patrika Illustrated Weekly.